
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:245 హైదరాబాద్, శుక్రవారం, 4 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## హైదరాబాద్‌లో వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలవకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించాలని, ట్రాఫిక్ సమస్యను త్వరగా క్లియర్ చేయాలని అన్నారు. జిల్లాల్లోనూ అధికారులు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.



## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్ ఏప్రిల్ 43

హెచ్ సియు కు సంబంధించిన ఇంచు భూమిని కూడా తాము తీసుకోమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పర్యావరణానికి ఎలాంటి ఇక్కట్లు కలగకుండానే అభివృద్ధి ఉంటుందని హామీ ఇచ్చారు. కంచ గచ్చిబౌలి భూములపై వివాదం రగులుతున్న నేపథ్యంలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు.. ప్రభుత్వాన్ని కాపాడుతామని అన్నారు. చంద్రబాబు హయాంలో బిల్లీరావుకు కట్టబెట్టిన భూముల కేటాయింపులను రద్దు చేసి దానిపై న్యాయపోరాటం చేసినది దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, ఐఎంజి బోగస్ కంపెనీ చెప్పడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను కాపాడారని తెలియజేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తి వేస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



## కేసీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట

హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హైకోర్టులో ) ఊరట లభించింది. 2011లో నమోదైన రైల్‌రోకో



కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో 2011 ఆగస్టు 15న సికింద్రాబాద్‌లో రైల్‌రోకో నిర్వహించారు. ఈ క్రమంలో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు చెప్పిన వాంగ్మూలం ఆధారంగా కేసీఆర్‌ను 13వ నిందితుడిగా రైల్వే పోలీసులు చేర్చారు. ఈ మేరకు ప్రజాప్రతినిధుల కోర్టులో పోలీసులు అభియోగపత్రం దాఖలు చేశారు.

ఈ కేసు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో.. కేసును కొట్టివేయాలంటూ కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. రైల్‌రోకో జరిగిన సమయంలో కేసీఆర్ సంఘటన స్థలంలో లేరని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. కేసీఆర్ పిలుపుతోనే రైల్‌రోకో నిర్వహించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం.. కేసీఆర్‌పై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఢిల్లీ: కంచ గచ్చిబౌలిలోని భూముల వ్యవహారంలో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు (. కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు చర్యలు నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇవాళ మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యంతర నివేదికను పంపారు. హైకోర్టు నివేదికను పరిశీలించిన జస్టిస్ గవాయ్ ధర్మాసనం.. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను అమికస్ క్యూరీ.. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేసింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని అత్యున్నత న్యాయస్థానం ప్రతివాదిగా చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా, చెట్లు కొట్టే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా అని నిలదీసింది.

## ఆ 22 జిల్లాలకు బిగ్ అలర్ట్.. 3 రోజులు దబిడి దిబిడే..

: తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 22 జిల్లాలకు అలర్ట్ ప్రకటించారు. అంతేకాదు.. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లొద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ



శాఖ తాజా నివేదిక ప్రకారం.. ఉపరితల ఆవర్తనం మరాఠ్వాడా, దానిని ఆనుకుని ఉన్న మధ్య మహారాష్ట్ర ప్రాంతంలో సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడింది. తూర్పు గాలులలో ద్రోణి ఈ రోజు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి ఉపరితల ఆవర్తనం మీదుగా నైరుతి మధ్యప్రదేశ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడింది. ఉత్తరాంధ్ర తీరం, దానికి సమీప ప్రాంతాల్లో మరో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడింది. వీటి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం నుంచి మూడు రోజుల పాటు వర్షాలు పడుతాయని పేర్కొంది. తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

ఆ జిల్లాలకు బిగ్ అలర్ట్..

భారీ వర్ష సూచన నేపథ్యంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అరెస్ట్ జారీ చేసింది. ఉత్తర తెలంగాణాలోని పలు జిల్లాలకు ఈరోజు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల వద్దకు వెళ్ళే రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పిడుగులు పడే సమయంలో కరెంట్ పోల్స్‌కి దూరంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల , నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్ పేట్, మహబూబ్నగర్ జిల్లాలకు నేడు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ.. శుక్రవారం 22 జిల్లాలకు యెల్లో అలర్ట్స్ జారీ చేసింది. అదే సమయంలో హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అవసరముంటేనే బైటకు రావాలని స్పష్టం చేశారు అధికారులు.

కుమ్మేసిన వాన..

గురువారం నాడు తెలంగాణ వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో వర్షం దంచికొట్టింది. పలు చోట్ల భారీ ఈదురు గాలులు వీయడంతో చెట్లు కూలిపోయాయి. భారీ వర్షం కారణంగా ఇళ్ల గోడలు కూలిపోయాయి. పిడుగుపాటుకు పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇక హైదరాబాద్‌లోనూ భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. మరో మూడు రోజుల పాటు నగరంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి ద్వంద్వ వైఖరి

### బిసి కోటాపై బిజెపి, బిఆర్ఎస్ డ్రామాలు

### మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

### కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని కలిసిన తెలంగాణ నేతలు

హైదరాబాద్ ఏప్రిల్ 3

బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బిసి కోటాపై బిజెపి, బిఆర్ఎస్ డ్రామాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బిసిలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ శాసన సభలో చట్టం చేయడంపట్ల కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, బిసి ఎమ్మెల్యేలు, ఎంపిలు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బిసి కోటాకు బిజెపి మద్దతు ఇచ్చిందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేసన్లు ఇవ్వాలని చట్టం తీసుకొచ్చామన్నారు. ఇడబ్ల్యుఎస్‌లకు పది శాతం రిజర్వేషన్లు ప్రధాని మోడీ ఇవ్వలేదా? అని పొన్నం ప్రశ్నించారు. ఓసి జనాభాయే 10 నుంచి 12 శాతం ఉంటుందని, పది శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని అడిగారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాజకీయం వద్దని గతంలోనే విజ్ఞప్తి చేశామని, ఇడబ్ల్యుఎస్‌లకు ఇచ్చిన పది శాతంలో ముస్లింలు లేరా? అని నిలదీశారు. మరి ఇడబ్ల్యుఎస్‌లో ముస్లిం రిజర్వేషన్లు బిజెపి ఎలా సమర్థించిందని అడిగారు. ఇడబ్ల్యుఎస్‌లకు తెరుచుకున్న డోరు? బిసిలకు ఎందుకు తెరుచుకోవడంలేదని పొన్నం



ధ్వజమెత్తారు. బిజెపి మతం పేరుతో ఓట్లు అడుగుతోందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసింది తమ ప్రభుత్వమేనని టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే కులగణన చేశామని, బిసిల రిజర్వేషన్ల విషయంలో ఒక మెట్టు దిగడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మంత్రివర్గ విస్తరణ అనేది ఎఐసిసి పరిధిలోని అంశం అని, గుజరాత్‌లో బిసి జాబితాలోనే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. బిసిలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బుధవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బిసి సంఘాలు, తెలంగాణ కాంగ్రెస్ నేతలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధర్నా చేసిన విషయం తెలిసిందే.

## విస్తరణ మరింత ఆలస్యం...

హైదరాబాద్, ఏప్రిల్ 3,

తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మళ్లీ వాయిదా పడే అవకాశాలే ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త మంత్రుల ఎంపిక విషయంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 3న విస్తరణ జరుగుతుందని అందరూ ఊహించినప్పటికీ, చివరి నిమిషంలో ఢిల్లీ నుంచి కొత్త ట్విస్ట్‌లు తెరపైకి వచ్చాయి. మంత్రుల జాబితా ఖరారైనట్లు పార్టీ ముఖ్య నేతలు భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొన్ని పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరిస్థితి మారింది. దీంతో, కొత్త జాబితా కోసం పార్టీ నేతలు మళ్లీ కసరత్తు ప్రారంభించారు, మరో ఇద్దరి పేర్లు చర్చలోకి వచ్చాయి. రాష్ట్ర కేబినెట్‌లో ఆరు స్థానాలు ఖాళీగా ఉండగా, సామాజిక, ప్రాంతీయ సమీకరణల ఆధారంగా నలుగురిని ఎంపిక చేసేందుకు గత నెలలో ఢిల్లీలో నిర్ణయం జరిగింది. ఉగాది సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిగవర్నర్‌తో సమావేశంలో కూడా విస్తరణ గురించి సూచనలు ఇచ్చారు. కానీ, రాహుల్ గాంధీ కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పటికే కొమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండగా, ఆయన సోదరుడికి మరోసారి అవకాశం ఇవ్వడం ఎందుకని రాహుల్ ఆరా తీశారు. అయితే, రాజగోపాల్‌కు పార్టీలో చేరినప్పుడే మంత్రి పదవి హామీ ఇచ్చామని నేతలు వివరించినప్పటికీ, తుది నిర్ణయం కోసం వేచి చూడాలని రాహుల్ సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. సీనియర్ నేత జానారెడ్డి హైకమాండ్‌కు రాసిన లేఖ సంచలనంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్‌జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదని, వాటికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. సామాజికవర్గాల వారీగా కూడా పలువురు నేతలు ఢిల్లీలో లాబీయింగ్‌ను తీవ్రతరం చేశారు. ఇప్పటివరకు సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వట్టిక శ్రీహరి, వివేక్ పేర్లు ఖరారైనట్లు ప్రచారం జరిగినా, రాహుల్ అభ్యంతరంతో ఈ జాబితాలో మార్పులు సంభవించే సూచనలు కనిపిస్తున్నాయి. సీనియర్లు, సామాజిక అంశాలు, జిల్లాల ప్రాతినిధ్యం వంటి అంశాలు తెరపైకి రావడంతో విస్తరణ జరగడం అనుమానంగా మారింది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నేతలు ఢిల్లీలోనే ఉన్నారు. దీంతో, ఈ రోజు మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో కీలక నిర్ణయాలు జరిగే అవకాశం ఉంది.

భారత శక్తి
VOICE OF INDIAN

## ట్రంప్ అన్నంత పనిచేశారుగా...

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ వంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని పలు సందర్భాల్లో హెచ్చరించిన డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలను అమలులోకి తీసుకొచ్చారు. అమెరికా దేశ భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందని మరోసారి నొక్కి చెప్పారు. భారత్ సహా ఇతర దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో తాము సగమే విధిస్తున్నాని, ఆయా దేశాలపై జాలితోనే ఇలా సగం సుంకాలు ప్రకటించినట్లు ట్రంప్ తెలిపారు. వీటిని రాయితీ టారిఫ్‌లుగా పేర్కొన్నారు. అయితే, భారత్‌పై ఇక తాము 26 శాతం మేర సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి ప్రస్తావిస్తూ మోదీ తనకు గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైన విధంగా వ్యవహరించడం లేదన్నారు. అమెరికాపై 52 శాతం మేర సుంకాలు విధిస్తోందని మరోసారి గుర్తు చేశారు. మరోవైపు.. చైనాపై 34 శాతం మేర సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని దేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం సుంకాలు ఉంటాయని ప్రకటించారు. ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడం వల్ల ఫార్మా, వ్యవసాయం, రసాయనాలు, మెడికల్ డివైజెస్, ఎలక్ట్రికల్, మెషినరీ వంటి కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. వియత్నాం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏకంగా 46 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చెప్పారు ట్రంప్. స్విట్జర్లాండ్‌పై 31 శాతం, తైవాన్ పై 32 శాతం, బ్రిటన్ పై 10 శాతం, బ్రెజిల్ పై 10 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, సింగపూర్‌పై 10 శాతం, దక్షిణాఫ్రికాపై 30 శాతం మేర ప్రతీకార సుంకాలు ప్రకటించారు. భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది కూడా దాదాపు 18 శాతం ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. ఈ సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ఈ దిగుమతుల ధరలు పెరిగి, అమెరికా మార్కెట్‌లో వాటి పోటీదనాన్ని తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ క్రింది రంగాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించవచ్చు. భారతదేశం ప్రపంచానికి ప్రధానంగా జనరిక్ ఔషధాలను సరఫరా చేసే దేశంగా ఉంది. అమెరికా మార్కెట్‌లో భారతీయ ఔషధ కంపెనీలు గొప్ప స్థాయిలో పోటీ చేస్తున్నాయి. అయితే 26% సుంకం వల్ల ఈ ఉత్పత్తుల ఖర్చులు పెరిగి, వాటి ధరలు ఎక్కువయ్యే అవకాశముంది. ఫలితంగా, అమెరికాలో భారత ఔషధాల అమ్మకాలు తగ్గొచ్చు. భారతదేశం అమెరికాకు భారీగా వస్త్రాలను ఎగుమతి చేస్తుంది. భారతీయ కాటన్, రేష్మి, ఇతర వస్త్ర ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే, సుంకాల కారణంగా ధరలు పెరిగితే, ఇతర దేశాల పోటీ పెరిగి, భారత వస్త్ర వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు పెద్ద మొత్తంలో ఆటో విడిభాగాలను ఎగుమతి చేస్తోంది. ఈ కొత్త సుంకాలు భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రభావితం చేసి, అమెరికాలో భారతీయ ఆటో భాగాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల భారతదేశ ఆటోమొబైల్ కంపెనీలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు పెట్రోలియం ఉత్పత్తులు, రసాయన పదార్థాలు కూడా భారీగా ఎగుమతి అవుతున్నాయి. అయితే ఈ సుంకాల వల్ల, ఈ ఉత్పత్తులపై ఖర్చు పెరిగి, వాటి ఎగుమతికి ఆటంకం కలిగే అవకాశం ఉంది, భారతదేశం నుంచి అమెరికాకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఐటీ సంబంధిత హార్డ్‌వేర్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగంలో ఇప్పటికే చైనా వంటి దేశాలతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పుడు సుంకాల కారణంగా, భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పోటీదనం మరింత తగ్గే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది ఎగుమతి అయ్యే ఉత్పత్తులు గణనీయమైన భాగాన్ని కలిగి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు కలిపి) సుమారు 776 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో అమెరికా భారతదేశం నుంచి ఎగుమతి చేసుకునే వస్తువుల విలువ సుమారు 77.5 బిలియన్ డాలర్లు (వస్తువులు మాత్రమే). ఇది భారతదేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో (సుమారు 451 బిలియన్ డాలర్లు) దాదాపు 17-18% ఉంటుంది. అంటే భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది సుమారు 17-18% వస్తు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయని చెప్పవచ్చు. ఈ ఉత్పత్తుల్లో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటాయి. దీంతో అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. ఆ తర్వాత యూఏఈ, చైనా వంటి దేశాలు ఉన్నాయి. ఇక భారతదేశం విదేశాల నుంచి దిగుమతులు చేసుకునే వస్తువుల్లో అమెరికా కీలకమైన భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారత్ మొత్తం దిగుమతుల విలువ సుమారు 732 బిలియన్ డాలర్లు. ఇందులో అమెరికా నుంచి దిగుమతులు 42.12 బిలియన్ డాలర్లు, అంటే సుమారు 5.75%. అంటే, ప్రతి ఏడాది భారత్ దిగుమతులలో అమెరికా వాటా సుమారు 5-6%గా ఉంటుందిభారతదేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ప్రధాన వస్తువులలో క్రూడ్ పెట్రోలియం (ముడి చమురు), బొగ్గు ఉత్పత్తులు (కోల్ బ్రికెట్స్) ,గ్యాస్ టర్బైన్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు ఉన్నాయి. అమెరికా భారత్‌కు ముఖ్యమైన వ్యాపార భాగస్వామిగా ఉన్నప్పటికీ, చైనా (17%), రష్యా (9%) పెద్ద వాటా కలిగి ఉండటం విశేషం. అయినప్పటికీ, అమెరికా నుంచి వచ్చే టెక్నాలజీ ఉత్పత్తులు, ఖరీదైన రత్నాలు, ఇంధన వనరులు భారత మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

# జగన్‌లో ఎంత మార్పో...

విజయవాడ, ఏప్రిల్ 3,

అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తల్ని, స్థానిక నేతల్ని పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణ ఉంది. దానికి ఆయన ప్రవర్తనే ప్రత్యక్ష సాక్ష్యం. లోకల్ లీడర్స్ తో పెద్దగా కలిసేవారు కాదు జగన్, ఆ మాటకొస్తే మంత్రులకు కూడా అపాయింట్ మెంట్లు దక్కేవి కావు, ఇక ఎమ్మెల్యేల సంగతి సరేసరి. జగన్ అపాయింట్ మెంట్ దొరకాలంటే ఎమ్మెల్యేలు రోజుల తరబడి తాడేపల్లి ప్యాలెస్ ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్ అధికారం కోల్పోయాక పరిస్థితిలో మెల్ల మెల్లగా మార్పులొస్తున్నాయి. జగన్ కోటరీ ఒక్కొక్కరే దూరం జరిగారు. అధికారంలో ఉన్నప్పుడు గొంతు చించుకున్నవారు కూడా సైలెంట్ అయ్యారు. చివరకు మిగిలింది కార్యకర్తలు, స్థానిక నాయకులే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీకి లాయల్ గా ఉన్నవారు వైసీపీ పరువు కాపాడారు. అందుకే వారికి రేపు తాడేపల్లిలో ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు జగన్. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపీపీ, జడ్పీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని తప్పించుకుంది. గతంలో ఆయా సీట్లన్నీ వైసీపీకి చెందినవే. అయితే వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వైసీపీకి కాస్త అనుకూలంగా ఫలితాలొచ్చాయి. దీంతో జగన్ కి తత్వం బోధపడింది. తాను ఇన్నాళ్లూ దూరం పెట్టిన కార్యకర్తలు, స్థానిక నేతలే తనను వదిలిపెట్టలేదని అర్థమైంది. అధికారంలో ఉన్నప్పుడు తన చుట్టూ కోటరీగా తిరిగిన వాళ్లు, రాజ్యసభ స్థానాలు, ఎమ్మెల్సీలు తీసుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారనే విషయం స్పష్టమైంది. దీంతో జగన్ లో మార్పు మొదలైంది. కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అంటూ ఆమధ్య ట్వీట్ వేసిన ఆయన, తాజాగా స్థానిక నాయకులతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టారు. పార్టీ విజయానికి సహకరించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలను స్వయంగా కలుస్తానని కబురు పంపించారు జగన్. వారందర్నీ తాడేపల్లికి పిలిపిస్తున్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశానికి అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8 నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారు. వీరందరికీ జగన్ ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారట. అందరితో మాట్లాడి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అడిగి తెలుసుకుంటారట.

ఈ మార్పు సరిపోదు జగనూ..

జగన్ లో మార్పు మొదలవడం మంచిదే, కానీ ఈ మార్పు సరిపోదు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని పొరుగు రాష్ట్రం నేతలంటూ ఎగతాళి చేసిన జగన్.. అధికారం పోయాక తాను బెంగళూరులో ఎందుకు తలదాచుకుంటున్నారో చెప్పాల్సి ఉంది. కానీ జగన్ ఇప్లిపుడు అసలైన పొలిటికల్ టూరిస్ట్ లా మారిపోయారని సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నాయి. ఎప్పుడో ఎక్కడో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే మాత్రం పరామర్శలకు వస్తున్నారనే ఆరోపణ కూడా



ఉంది. కానీ ఈసారి లోకల్ లీడర్స్ కోసం బెంగళూరు నుంచి జగన్ వస్తున్నారు. ఇది మెచ్చుకోవాల్సిన విషయమే. కానీ ఈ మార్పు సరిపోదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన కళ్లకు గంతలు కట్టి ఆడించింది కోటరీయేనని ఆ పార్టీ నేతలు కొందరు బలంగా నమ్ముతున్నారు. ఆ గంతలు ఆయన విప్పుకోవాలి. ప్రజల మధ్యకు వచ్చినప్పుడే ఏదైనా ఫలితం ఉంటుంది. అది కూడా కూటమి చేసే తప్పుల్ని బట్టే ప్రజలు జగన్ దగ్గరకు చేరతారనే విషయాన్ని మరింతగా అర్థం చేసుకోవాలి. పాలనలో కూటమి సక్సెస్ అయితే నాలుగేళ్ల తర్వాత కూడా ప్రజలకు జగన్ అవసరం ఉండదు.

# సోషల్ మీడియాలో ప్రచారానికి హద్దే లేదా

రాజమండ్రి, ఏప్రిల్ 3,

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుంది ప్రస్తుత రాజకీయాలు. సోషల్ మీడియా జనరేషన్‌లో పాలిటిక్స్ మరింత దారుణంగా ఉంటున్నాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల డెత్ కేసులో ఎంత రచ్చ జరిగిందో అంతా చూస్తున్నారు. సీసీఫుటేజ్‌లో చిన్న అనుమానం కూడా లేదు. ప్రవీణ్ ఒంటిపై దాడి జరిగిన ఆనవాళు కూడా లేవు. కత్తి పోట్లు, దెబ్బలు, విష ప్రయోగం.. గట్రా ఎలాంటి డౌట్ లేదు. కానీ, చంపేశారు.. చంపేశారు.. అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. సొసైటీలో మత చిచ్చు రగిల్చే ప్రయత్నం చేశారు కొందరు. ఈ తరహా ప్రచారం వెనుక ఓ పార్టీ ప్రోద్బలం ఉందనే ఆరోపణ ఉంది. ఆ పార్టీ అనుకూల వర్గీయుల నుంచే ఎక్కువగా రెచ్చగొట్టే పోస్టులు, కామెంట్లు వచ్చాయని పోలీసులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకూ సిద్ధమవుతున్నారు. చనిపోయింది పాస్టర్ కాబట్టి.. ఎలా చనిపోయారో తెలీటం లేదు కాబట్టి.. చంపేశారు అంటే సరిపోతుందా? సున్నితమైన అంశం కావడం తమకు కలిసి వస్తుందని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు ఇంతలా రెచ్చగొట్టాలా? మతం రంగు పులిమేసి.. జనాల్లో విద్వేషాన్ని రగిలిచ్చి ఏం చేయాలనుకున్నారు? ఆ వేడిలో రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహం పన్నారా? మరీ, ఇంతటి ప్రమాదకరమైన క్రీడ ఆడటం కరెక్టేనా? హైదరాబాద్ నుంచి కొవ్వూరు వరకు.. దారి పొడవునా గంటల తరబడి సీసీకెమెరా ఫుటేజ్ దొరికింది కాబట్టి సరిపోయింది. లేదంటే పోలీసులు చెప్పిన విషయాల్ని అంత ఈజీగా ఎవరైనా నమ్మేవాళ్లా? పాస్టర్ ప్రవీణ్ పగడాల విజయవాడ చేరుకోవడం.. అక్కడ పార్కులో సేద తీరడం.. అప్పటికే ఆయన బుల్లెట్ బండి హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం.. చాలా నీరసించి ఉండటం.. ఆ తర్వాత దారి మధ్యలో లిక్కర్ కొనడం.. ఇలా మినిట్ టు మినిట్ కంప్లీట్ సీసీఫుటేజ్ బయటపెట్టారు ఏపీ పోలీసులు. అవన్నీ చూశాక కానీ.. ప్రవీణ్‌ది హత్య కాకపోవచ్చు.. యాక్సిడెంటో, అస్వస్థత వల్లో చనిపోయి ఉండొచ్చు అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఒకవేళ ఆ సీసీకెమెరా దృశ్యాలు లభించి ఉండకపోయి ఉంటే..? ప్రవీణ్‌ను చంపేశారని ప్రజలకు ఫిక్స్ చేసేవారే కదా? సోషల్ మీడియా రచ్చ ఇప్పట్లో ఆగి ఉండేదా? క్రిష్టియన్లకు మిగతా వర్గాలకు మధ్య చిచ్చు పెడితే.. రాష్ట్రం మతాల వారిగా విడిపోతే.. అది అందరికీ నష్టమే కానీ ఎవరికీ లాభం కాదు. చివరికి ఆ పార్టీకి కూడా. అందరికీ అన్ని వర్గాల మద్దతు కావాల్సిందేగా. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు? ఇప్పుడే కాదు గతంలోనూ ఇలాంటి డైవర్ట్ పాలిటిక్స్ చూశాం. వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా తల నరికి చంపారు. ఆయన డెడ్‌బాడీ రక్తపు మడుగులో పడి ఉంది. ఆ స్పాట్ చూస్తే చిన్నపిల్లాడైనా చెప్పేస్తాడు అది హత్య అని. కానీ, గుండెపోటు అని ప్రకటించి చావు తెలివితేటలు చూపించారు కొందరు. అలా కొన్నిగంటల సేపు మాత్రమే బుకాయించ గలిగారు. నిజం బయటకు రాకుండా సమాధి చేయలేక పోయారు. ఆ కేసుతో సంబంధం ఉన్న వాళ్లంతా ఇటీవల వరుసగా చనిపోతుండటం.. హత్యా రాజకీయాలు ఇంకా ఆపలేదనే అనుమానాన్ని బలపరుస్తోంది. వివేక కేసులో హత్యను గుండెపోటుగా చిత్రీకరిస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాంటి సెన్సిటివ్ కేసులో మర్డర్ ముసుగు వేసే ప్రయత్నం పక్కా ప్లాన్డ్‌గా జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది. అదే నిజమని తేలితే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# విజయనగరంలో వైసీపీ ఖాళీ...?

విజయనగరం, ఏప్రిల్ 3,

ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీ మరింత పుంజుకుంటోందా? అంటే అవుననే తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలోపు వైసీపీ పూర్తిగా ఖాళీ కాబోతుందా? అంటే కూడా అవుననే సమాధానం వినిపిస్తోంది. కురుపాం నుంచి ఎస్ కోట నియోజకవర్గం వరకూ ఎక్కడ చూసినా రాజకీయ వలసలు షరా మాములుగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డానికి కష్టించి పని చేసిన హార్డ్ కోర్ ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ కూడా ఇప్పుడు సైకిల్ బెల్లు కొట్టడానికి రెడీ అంటే రెడీ అంటున్నారట. ఒక్కో ఏరియాలో ఫలానా కావాలన్న షరతులు పెట్టకుండానే ఫ్యాన్ వదిలి సైకిలెక్కుతున్నారట. దీనంతటికీ కారణమేంటని చూస్తే.. అందరి నుంచి దాదాపు ఒకటే మాట వినిపిస్తోందట. ఇన్నాళ్ల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని పార్టీని అధికారంలోకి తెస్తే.. తమకు మిగిలింది ఏదీ లేదని వీరంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఆ మాటకొస్తే ఫ్యాను రెక్కలు ముక్కలయ్యాయి.. మీ కంటికి కనిపించడం లేదా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారట. ఇన్నాళ్ల పాటు జగన్ని నమ్ముకున్నందుకు తాము నట్టేట మునిగామనీ అంటున్నారట. ఆ పార్టీలాగే తమ జీవితాలు కూడా అలాగే ఛిన్నాభిన్నమైపోయిందనీ వీరంతా గుర్రుగా ఉన్నారట. దీంతో టీడీపీ, జనసేనకు జై కొడుతున్నారట. మరీ ముఖ్యంగా పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాల్టీల్లో అయితే అవిశ్వాసానికి సైతం సిద్ధమయ్యారంటే ఫ్యాను పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని అంటున్నారు. బొబ్బిలి మున్సిపాల్టీలో ఇప్పటికే ఒక తిరుగుబాటు మొదలైందట. అవిశ్వాస తీర్మానం పెట్టడమే ఆలస్యమట. స్వయంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఫోన్ చేసి బుజ్జగించినా కుదరదని తెగేసి చెబుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. గతంలో ఒక పార్టీ నుంచి మరొక పార్టీలో చేరాలంటే ఆయా ప్రాంతాల్లో పట్టున్న నాయకులతో రాయబారం నడిపించాలి. అదే ఇప్పుడు ఇందుకు రివర్స్ లో ఉందట వ్యవహారం. ఎవరూ ఏమీ అడక్కుండానే.. మేమే వచ్చేస్తున్నాం.. వద్దనకండి ప్లీజ్ అంటూ సైకిల్ బెల్ వారంతట వారే మోగిస్తున్నారట. చోటా మోటా నాయక గణం తమంత తాముగా వెళ్లి.. కూటమి పార్టీల కండువాలు కప్పేసుకుంటున్నారట. ఇక నెల్లిమర్ల నియోజకవర్గంలో అయితే వైసీపీని ఎప్పుడు ఖాళీ చేద్దామా? అన్నట్టుందట ఇక్కడి జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి జోరు. వారానికి కనీసం రెండు మూడు గ్రామాల వైసీపీ కార్యకర్తలను తమ గ్లాసు పార్టీలో చేర్పించందే నిద్రపోవడం లేదట ఎమ్మెల్యే మాధవి. భవిష్యత్తులో తమకు పదవులు వచ్చినా రాకపోయినా.. వైసీపీ అనేది ఉండకూడదు. ఎటు నుంచి ఎటు చూసినా జనసేన మాత్రమే కనిపించాలన్నంత కసితో పని చేస్తున్నారట ఈ మహిళా ఎమ్మెల్యే. అయితే జిల్లా కేంద్రంలో పరిస్థితి కాస్త భిన్నంగా ఉందంటున్నారు. కోరి వస్తామన్నా చేద్దాం- చూద్దాం అంటూ దాట వేస్తున్నారట ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు. వైసీపీలో అవినీతి మరక అంటని వారిని మాత్రమే తీసుకుంటున్నారట. ఇప్పటికే వైసీపీకి చెందిన కార్పొరేటర్లు వస్తామనీ.. కార్పొరేషన్ను టీడీపీ పరం చేస్తామని బంపరాఫర్లు ప్రకటిస్తున్నా.. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు వద్దంటే వద్దంటున్నారట. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎవరికి అధికారం ఇస్తే.. వారే పరిపాలించాలని హితబోధ చేస్తున్నారట. అందులోనూ ఎవరిని పడితే వారిని పార్టీలోకి తీసుకుంటే నష్టం తమకేనని.. వారిస్తున్నారట. దీంతో తండ్రి మాట జవదాటలేక మున్సిపల్ ఎన్నికలు వచ్చే వరకూ వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారటు ఎమ్మెల్యే. ఇక ఎస్ కోట, చీపురుపల్లి, సాలూరు, గజపతినగరం, కురుపాం నియోజకవర్గాలలో చేరికల పరంపర ఒక రేంజిలో కొనసాగుతోందట. రోజుకో నియోజకవర్గంలో భారీ స్థాయిలో చేరికలు కనిపిస్తున్నాయట. గ్రామాలకు గ్రామాలు సైకిల్ కి సై అంటున్నాయట. దీంతో వైసీపీ లీడర్లు బయటకు రావడానికే తటపటాయించాల్సి వస్తోందట. పార్టీ ఖాళీ అవుతుంటే ఇటు చూస్తూ ఊరుకోలేక, అటు అధినేతకు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారట. ఏది ఏమైనా.. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు వచ్చే నాటికి ఈ ప్రాంతాల్లో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయట.

# సినిమాల్లోకి దువ్వాడ...

శ్రీకాకుళం, ఏప్రిల్ 4,

దువ్వాడ శ్రీనివాస్-మాధురి.. ఏ తెలుగు న్యూస్ ఛానెల్ చూసినా, యూట్యూబ్ ఛానెల్ చూసినా వీరిద్దరి సందడి అంతా ఇంతా కాదు. మాధురి ఎపిసోడ్ కి టాప్ రేటింగ్స్ రావడంతో అప్పట్నుంచి ఆమెను మీడియా నీడలా అనుసరిస్తోంది. మాధురిని ఆకాశానికెత్తేయడం, ఆమెను హీరోయిన్ లా ఉన్నారని అనడం, అందులోనూ నగ్మాతో పోల్చడం.. ఆమెతో క్యాట్ వాక్ చేయించడం, పాటలు పాడించడం, డ్యాన్స్ చేయించడం.. అబ్బో ఇలాంటి సీన్స్ ఇంటర్వ్యూల్లో చాలానే ఉన్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా ఎంట్రీ విషయంపై మరోసారి క్లారిటీ ఇచ్చారు మాధురి. మాధురికి చాలా క్వాలిఫికేషన్లు ఉన్నాయని పొలిటీషియన్, వుమన్ ఎంటర్ ప్రెన్యూర్, ఇన్ ఫ్లూయెన్సర్, ఫైర్ బ్రాండ్.. ఇలా చాలా ఉన్నాయని, సినిమా హీరోయిన్ కూడా అందులో యాడ్ అవుతోందని యాంకర్ ఆమెను పొగడ్తల్లో ముంచెత్తారు. మాధురి కూడా తనకు చిన్నప్పటినుంచి యాక్టింగ్ అంటే ఆసక్తి ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాదు, గతంలో తనకు టైమ్ దొరకలేదని, ఛాన్స్ దొరకలేదని.. టైమ్ వచ్చినప్పుడు అది కూడా జరుగుతుందని చెప్పుకొచ్చారు మాధురి. మాధురి తనకు సినిమాల్లోకి వెళ్లాలనుంది అని అనగానే, పక్కనే ఉన్న దువ్వాడ శ్రీనివాస్ ఊరుకుంటారా..? ఆయన కూడా మాధురి టాలెంట్ ని బయటపెట్టారు. పాటలు పాడటం కంటే కంటే ఆమె డ్యాన్స్ బాగా చేస్తుందని చెప్పుకొచ్చారు. భరతనాట్యంలో ఆమెకు ప్రవేశం ఉందన్నారు. నెమలికి నేర్పిన నడకలివీ అనే పాటతోపాటు, చాలా పాటలకు ఆమె అద్భుతమైన పర్ఫామెన్స్ ఇస్తుందన్నారు. గతంలో దువ్వాడ కూడా మాధురిని అడిగి మరీ కొన్ని పాటలకు డ్యాన్స్ వేయించుకునేవారట. దువ్వాడ శ్రీనివాస్ తనకు సీనియర్ ఎన్టీఆర్ అంటే ఇష్టమని, ఆయనే తనకు రోల్ మోడల్ అని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ఆయన సినిమాల్ని తాను చూస్తుంటానని, హోమ్ థియేటర్లో ఆయన సినిమాలు చూస్తానన్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు తాను థియేటర్లకు వెళ్తుంటానన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ని కూడా తాను అభిమానిస్తానని, అయితే తాను సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్ అని చెప్పుకొచ్చారు దువ్వాడ. కార్ లో సీనియర్ ఎన్టీఆర్ పాటలు పెట్టుకుంటారని, అప్పుడప్పుడు ఆ పాటలకు అర్థాలు తనకు చెబుతుంటారని కోరస్ ఇచ్చారు మాధురి. శ్రీనివాస్ కి కూడా సినిమాలంటే బాగా ఇష్టం. ఆమధ్య మాధురి నిర్మాతగా ఆయన ఒక షార్ట్ ఫిల్మ్ లో కూడా నటించినట్టు వార్తలొచ్చాయి. నటించిన వీడియోలు కూడా బయటకొచ్చాయి. ఇక మాధురి కూడా తన



యాక్టింగ్ పెర్ఫామెన్స్ ని వెండితెరపై చూపించాలనుకుంటున్నారు. ఫైనల్ గా వీరిద్దరూ హీరో హీరోయిన్లుగా నటించే అవకాశం ఉందేమోనని అనిపిస్తోంది. దువ్వాడ-మాధురి కాంబినేషన్ ఇప్పటికే బుల్లితెరపై, యూట్యూబ్ లో సూపర్ హిట్ అయింది. వీరి ప్రోగ్రామ్ లకు మంచి ప్రేక్షకాదరణ ఉంది. ఇక వీరు సినీరంగంలోకి వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. షార్ట్ ఫిల్మ్ ల వరకు ఓకే, వెండితెరపై కనపడాలంటే అది కాస్త ఖర్చుతో కూడుకున్న పని, దానికి దువ్వాడ సిద్ధపడతారా..? మాధురి తెరంగేట్రానికి తానే నిర్మాత అవుతారా..? వేచి చూడాలి.

# నేడు ప్రపంచ ఎలుకల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

వినాయకుడి వాహనం. అయితేనేం.. ఇంట్లో అది చేసే అల్లరికి దాన్ని చూస్తేనే.. అంతెత్తున లేస్తారు. తిట్ల దండకం మొదలుపెడతారు. ఇక పిల్లి దాన్ని చూసిందంటే చాలు.. దాని అంతుచూసే దాకా వదలదు. మనుషులను ముప్పుతిప్పలు పెడుతున్నా.. 'మూషిక' మహారాజులను ప్రేమించే వారు , పూజించే వాళ్లు ఉన్నారు. ఇంతకీ ఏంటీ ఎలుక గోల అంటారా? ఈ రోజు ప్రపంచ ఎలుకల దినోత్సవం...

ప్రపంచంలో ప్రతిరోజు ఏదో ఓ మూల.. ఓ దినోత్సవం జరుగుతూనే ఉంటుంది. కానీ అందులో కొన్ని మాత్రమే ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకుంటాయి. ఈ 'వరల్డ్ ర్యాట్ డే' ఇప్పుడిప్పుడే ఆదరణ పొందుతోంది.




జంతుప్రేమికులతో పాటు, ఎలుకలను అల్లారుముద్దుగా పెంచుకునే వాళ్ల ర్యాట్ డే (ఏప్రిల్ 4)ను ఆనందంగా జరుపుకుంటున్నారు. ఎలుకల్లో అందంగా కనిపించే పప్పీ ర్యాట్స్‌కు ఎంతోమంది అభిమానులున్నారు. మనదేశంలో కాదు కానీ విదేశాల్లో వాటిని పెట్స్‌గా పెంచుకునే వాళ్ల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది.

మూషిక పూజలు:

రాజస్థాన్‌లోని దెష్నోక్‌లో ఉన్న కర్ణీమాత ఆలయంలో ఎలుకలను ప్రత్యేకంగా పూజిస్తారు. వాటికి ఇక్కడ మొక్కులు తీర్చడం విశేషం. ఈ గుడిలో ఎటు చూసినా వేలాది ఎలుకలు కనిపిస్తాయి. ఈ గుడికి వచ్చే భక్తులు వాటిని అమ్మవారి పిల్లలుగా భావించి ఎంతో భక్తితో పూజిస్తారు.

ర్యాట్ డే ఇలా చేసుకుంటారు:

ర్యాట్ లవర్స్.. తమ తమ పెంపుడు ఎలుకలను అందంగా ముస్తాబు చేస్తారు. వాటిని ఉంచే బోనులను కూడా అలంకరిస్తారు. ఎలుకలకు ఇష్టమైన ఆహారాన్ని ప్రిపేర్ చేస్తారు. ఇక ఎలుక ప్రేమికులంతా ఓ చోట కలుస్తారు. తమ ఎలుకలు చేసే అల్లరి గురించి ముచ్చటించుకుంటారు. కానుకలు ఇచ్చిపుచ్చుకుంటారు. సోషల్ వెబ్‌సైట్లో ర్యాట్ డే సెలబ్రేషన్స్ ఫొటోలను, అనుభూతులను తమ మిత్రులతో పంచుకుంటారు.

పద ప్రయోగం:

ఎలుక తోక తెచ్చి ఎన్నినాళ్లు ఉతికినా.. నలుపు నలుపే కానీ.. తెలుపు కాదు.

సామెతలు

పిల్లికి ఎలుక సాక్ష్యమట

పిల్లి గుడ్డిదైతే.. ఎలుక ఎక్కిరించిదట.

రక్షక ర్యాట్స్

వినాయకుడే కాదు.. తన వాహనమైన ఎలుక కూడా కాంబోడియా ప్రజల విఘ్నాలను తొలగిస్తుంది. కాంబోడియా నుంచి టాంజానియా వరకు అనేక చోట్ల మందుపాతర్లు ఉన్నాయి. కంబోడియన్ మైన్ యాక్షన్ సెంటర్ మందుపాతర్లను కనిపెట్టే పనిని మూషిక రాజుకు అప్పగించింది. ఈ రాక్షస ఎలుకలు(గెయింట్ ర్యాట్స్) వాసన చూసి మందుపాతర్లను కనిపెట్టడంలో దిట్ట. వీటికి తెలివి కూడా ఎక్కువే..

టాంజానియాలోని అపోపో అనే ఒక ఎన్‌జీవో సంస్థ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. శిక్షణ తీసుకున్న ఎలుకల్ని మందుపాతర్లు ఉన్న ప్రదేశంలో విడిచి పెడతారు. ఆర్మర్ ధరించిన బాంబ్ స్క్వాడ్ దళాలు ఎలుకలకు పెద్ద తాడును బిగించి, వాటిని పట్టుకుని మందుపాతర్లను కనిపెట్టడానికి రంగంలోకి దిగుతాయి. ఎలుకలు మందుపాతరలు ఉన్న ప్రదేశాన్ని కనిపెట్టగానే కంబోడియన్ మైన్ యాక్షన్ సెంటర్ రంగంలోకి దిగి వాటిని నాశనం చేస్తుంది.

# విజయవాడ రైతు బజార్ ను తనిఖీ చేసిన మంత్రి నాదెండ్ల

విజయవాడ, ఏప్రిల్ 2 వినియోగాలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బజార్ నిర్వహిస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

తనిఖీలలో భాగంగా ఈరోజు ఆటోనగర్ ంఖఎఅఅ లో ఉన్న రైతు బజార్ ను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు... అధికారులతో కలిసి ప్రతి షాప్ ను షాపులో ఉన్న సరుకులను పరిశీలించారు... వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.. రైతు బజార్లో ఉన్న బియ్యం షాప్ లో బియ్యం పరిశీలించి, 26 కేజీల గల బియ్యం బస్తాలు దాదాపు 204 బియ్యం బస్తాలను రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు..ప్రభుత్వం రైతు బజార్‌లలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రైతు బజార్‌ల నిర్వహణపై మరింత కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు నాణ్యమైన ఉత్పత్తులు పొందేలా అన్ని చర్యలు కొనసాగుతాయి.

# దేవాదాయశాఖలో ఇంటి దొంగలు

విజయవాడ, ఏప్రిల్ 3,

విజయవాడలో దేవాదాయ శాఖ భూములతో బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన వెలుగు చూసింది. నగరం నడిబొడ్డున ఉన్న దాదాపు ఆరెకరాల భూమి అన్యాక్రాంతమైనా? దేవాదాయ శాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇవే భూములకు నకిలీ పత్రాలను సృష్టించి వందల కోట్లకు బ్యాంకుల్ని మోసం చేశారు. దేవాదాయ శాఖకు దానపత్రం రాసిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా వాటిని రక్షించేందుకు చర్యలు చేపట్టకపోవడం వెనుక దేవాదాయ శాఖ బాధ్యతలు చూసిన మాజీ మంత్రి హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.విజయవాడ పటమటలో ఉన్న గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములు ఉన్నాయి. భూముల్ని దానం ఇచ్చిన దాతల కుటుంబానికి చెందిన మూడో తరం వారసులు భూముల విలువ పెరగడంతో అవి కుటుంబ ఆస్తులంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. ఆ భూముల్ని అమ్ముకోడానికి అనుమతివ్వాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ క్రమంలో భూములను దానం ఇచ్చిన సమయంలోనే వాటిని ధర్మకార్యక్రమాలలో దేనికి వినియోగించాలో స్పష్టం చేస్తూ రాసిన దాన పత్రం వెలుగు చూసింది. నగరం మధ్యలో ఉన్న వందల కోట్ల ఖరీదు చేసే ఈ భూమిని కాజేయడానికి కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ క్రమంలో దేవాదాయ శాఖకు సారథ్యం వహించిన మంత్రి అండతో భూముల్ని అమ్మేసే స్కెచ్ వేశారు. అంతకు ముందే ఇవే భూములపై ఓ జాతీయ బ్యాంకులో రుణాన్ని కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో 2023లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా గోవిందరాజులు ఈనాం ట్రస్ట్ భూముల వ్యవహారంపై 2023లో మచిలీపట్నం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో బి.సుబ్బారావు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక వెలుగు చూసింది.పబ్లిక్ ట్రస్ట్‌కు సంబంధించిన భూమిని ప్రైవేట్ ట్రస్టుగా భావిస్తూ ట్రస్టీ ఎప్పుడూ భూమికి యజమాని కాలేదని గతంలో సుప్రీం కోర్టు, హైకోర్టులు స్పష్టం చేశాయని, ఆ తీర్పులకు విరుద్ధంగా కింది కోర్టులు ఇచ్చిన డిక్రీలను అడ్డం పెట్టుకుని భూముల్ని అమ్మే ప్రయత్నాలు చేయడంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ట్రస్టు నిర్వహిస్తోన్న ట్రస్టీ దేవాదాయ చట్టం సెక్షన్ 30/87 ప్రకారం ఆస్తులను కాపాడలేకపోవడంతో చర్యలు తీసుకోవడంతో పాటు వారిని ట్రస్ట్ కార్యక్రమాల నుంచి తొలగించి వేరేవారిని నియమించడంతో పాటు ట్రస్ట్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలని సిఫార్సు చేశారు.విజయవాడ నగరంలో ఉన్న దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంపై హిందూ ధార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల విజయవాడ కనకదుర్గ దేవస్థానం భూముల్ని 50 ఏళ్లకు లీజుకిచ్చే అంశం వెలుగు చూసింది. ఈ క్రమంలోనే విజయవాడలో వందల కోట్ల దేవాదాయ శాఖ ఆస్తులు పరాధీనమైన వైనం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దేవాదాయ భూములను కాపాడాలని పోరాడుతున్న వారు వీటిని వెలుగులోకి తెస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో ఖరీదైన భూముల వ్యవహారంలో ఉదాసీనత బయటపడింది. సామాజిక, దైవిక కార్యక్రమాలకు చెందిన భూములను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే పటమటలో ఉన్న గోవిందరాజు ట్రస్టు ఈనాం భూముల్ని చూపి జాతీయ బ్యాంకులో రూ.100కోట్ల రుణం తీసుకోవడం గతంలోనే వెలుగులోకి వచ్చింది. ఏపీకి చెందిన జాతీయ బ్యాంకు మరో బ్యాంకులో విలీనమైన తర్వాత ఈ వ్యవహారం పూర్తిగా మరుగున పడిపోయింది. అసలు వడ్డీలతో కలిపి ఈ మోసం విలువ రూ.200కోట్లు వరకు ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి.గోవిందరాజు వంశానికి చెందిన వారు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన పటమటలోని సర్వే నెంబర్ 91/2లోని 5,92 ఎకరాల స్థలాన్ని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు దానం చేశారు. రిజిస్టర్డ్ డీడ్ ప్రకారం భూమిని జాగ్రత్తగా కాపాడాలని, ఈ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని నాలుగు బాగాలు చేసి ధార్మిక కార్యక్రమాలకు వాడాలని, ఏ భాగం ఎందుకు వాడాలో కూడా దాన పత్రంలో స్పష్టం చేశారు.గోవింద రాజులు ట్రస్టుకు సంబంధించిన భూముల్ని లీజుకు తీసుకున్న వారి వారసుడు పదేళ్ల క్రితమే ఈ భూముల్ని తనఖా పెట్టి రూ.100కోట్ల రుణాన్ని తీసుకుని వాటిని చెల్లించలేదు.వడ్డీలతో కలిపి రుణమొత్తం భారీగా పెరిగింది. ఈ క్రమంలో గోవింద రాజు ట్రస్టును శ్రీ గోవింద రాజు ట్రస్టు పేరుతో దేవాదాయ శాఖను ప్రతివాదిగా చేర్చకుండా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనికి విజయవాడకు చెందిన ఓ పార్టీ ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ మంత్రి ఒకరు సహకరించినట్టు తెలుస్తోంది.అసలైన ట్రస్టీలు ఉన్న సమయంలోనే ఆ భూముల్లో కొంత భాగాన్ని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించడంతో అక్కడ దశాబ్దాలుగా హైస్కూల్ నిర్వహిస్తున్నారు. స్కూల్ నిర్వహిస్తున్నభూమిని కార్పొరేషన్‌కు గతంలోనే రిజిస్ట్రేషన్ చేశారు. 5.90 ఎకరాల భూమి దేవాదాయ శాఖకు చెందినదేనని 2023లో నే విచారణాధికారి నివేదిక సమర్పించినా నాటి ప్రభుత్వం దానిని అమోదించకుండా తొక్కి పెట్టింది.భూమి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటే అసలు దొంగలు బయటపడతారు. దీంతో నివేదిక వెలుగు చూడకుండా విజయవాడకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ప్రజాప్రతినిధులు, అధికారులకు చిక్కులు తప్పవని హిందూ ధార్మిక సంఘాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారిస్తే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూస్తాయని చెబుతున్నారు.

# సంపదను సృష్టించడం నాయకుడి లక్షణం

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్**

బద్వేలుసంపదను సృష్టించడం నాయకుడి ప్రధాన లక్ష్యం అని, ఉన్నవూరు, సొంత ప్రాంతాన్ని చక్కబెడితే.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లే అని.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అభివర్ణించారు.

ప్రొద్దుటూరు మండలం కానపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయ ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా గ్రామ సచివాలయ భవనానికి జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ప్రారంభోత్సవం చేయగా, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం రైతు సేవాకేంద్రాన్ని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.

ఈ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పల్లెసీమల ప్రగతికి గ్రామ సచివాలయాలే ఆయువు పట్టు అని తెలుపుతూ.. సంపదను సృష్టించడం నాయకుడి ప్రధాన లక్ష్యం అన్నారు. అదే నిజాన్ని నమ్మిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ.. ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక స్థితిని ప్రస్తుతం 4వ స్థానంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. అదే బాటలో నడుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 విధానం ద్వారా.. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం.. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తల సమన్వయ సహకారంతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో.. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజల ఇంటి ముంగిటే గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని రకాల విస్తృతమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం సహకారంతో వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నమైన మార్పులను తీసుకొచ్చిందన్నారు. సేవలను మరింత విస్తృతం చేస్తూ.. ప్రజలకు ఆరోగ్య భద్రతను కల్పిస్తోందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరంగా తన వంతు సహకారాన్ని అందించడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు.చడంలో

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన, సంపన్నమైన పట్టణంగా ప్రొద్దుటూరు అభివృద్ధి చెందుతోందన్నారు. అలాంటి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను సంతృప్తికరంగా అందిస్తోందన్నారు. అన్నారు.

# అమల్లోకి రిజిస్ట్రేషన్ స్లాట్స్...

తిరుపతి, ఏప్రిల్ 2, (న్యూస్ పల్స్)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భూమి రిజిస్ట్రేషన్లకు కొత్త ప్రక్రియను తీసుకొచ్చింది. ఇది భూముల రిజిస్ట్రేషన్ సమయంలో అమ్మేవారు, కొనుగోలు చేసేవారు ఇబ్బందులకు పరిష్కారం కానుంది. రిజిస్ట్రేషన్లలో స్లాట్ బుకింగ్ అనే కొత్త ప్రక్రియను అమలు చేస్తోంది. ఏప్రిల్ 2 నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ చేసుకునేవారికి సౌకర్యంగా ఉంటుంది. అలాగే సమయం కూడా ఆదా అవుతోంది. మరి ముఖ్యంగా రిజిస్ట్రార్ కార్యాలయాల ఎదుట గంటల తరబడి వేచి ఉండనవసరం లేదు. భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, వివాహ ఇతరత్రా అన్ని రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్లాట్ బుకింగ్ వ్యవస్థ అమలు కాబోతుంది. రిజిస్ట్రేషన్ చేసుకుకోవాలనుకునేవారు ముందుగానే స్లాట్ బుక్ చేసుకుంటే, ఆ తేదీనే, ఆ సమయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. దీనివల్ల అలాగే కొనుగోలుదారుల, అమ్మకందారులు నచ్చిన తేదీని, నచ్చిన సమయాన్ని ఎంచుకుని తమ రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటు వచ్చింది. దీనివల్ల రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయనవసరం లేదు.ఇప్పటికే ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రస్తుతం కృష్ణా జిల్లా కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. ఈ విధానంలో రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం అయ్యాక ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్లాట్ రిజిస్ట్రేషన్లు చేస్తారు. గంటకు ఆరుగురి చొప్పున స్టాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. దీన్నే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేసింది.స్లాట్ బుకింగ్ విధానాన్ని ఎక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. జిల్లాల్లో ఎక్కువ రద్దీ ఉండే రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఐజీఆర్ఎస్‌లో పబ్లిక్ డేటా ఎంట్రీలో స్లాట్ బుకింగ్ ఆప్షన్ ద్వారా ఇంటి వద్ద నుంచే తమకు నచ్చిన తేదీని, సమయాన్ని ఎంపిక చేసుకోవచ్చు.ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా రిజిస్ట్రేషన్ చేస్తారు. అందుకోసం ముందు రోజుసాయంత్రం 5 గంటల లోపు స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ సౌకర్యం మొదట జిల్లా ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉంటుంది. డిమాండ్ ఆధారంగా ఆ సేవలను మండలాల్లో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు విస్తరిస్తారు. కాకపోతే సెలవు దినాల్లో రిజిస్ట్రేషన్ కోసం ఫీజు స్లాట్ బుకింగ్ ఫీజు రూ.5,000 ఉంటుంది.ప్రభుత్వ పని దినాల్లో స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఉచితంగా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే స్లాట్ బుక్ చేసుకున్న తరువాత, దాన్ని రద్దు చేసుకుంటే మాత్రం రూ.100 రుసుము వసూలు చేస్తారు. అపాయింట్‌మెంట్ (స్లాట్ బుకింగ్) సమయాన్ని మార్చాల్సిన సందర్భంలో రూ.200 రీషెడ్యూలింగ్ రుసుము వసూలు చేస్తారు. అపాయింట్‌మెంట్ సజావుగా జరిగేలా చూసుకోవడానికి అవసరమైన అన్ని పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. షెడ్యూల్ చేసిన అపాయింట్‌మెంట్‌కు కనీసం ఒక రోజు ముందు అవసరమైన రుసుమును చెల్లించాలి. అయితే ఈ విధానం అమలను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఎం.హరినారాయణ పర్యవేక్షిస్తారు.రాష్ట్ర రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్‌లు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ లోకి వెళ్లాలి. అందులోని ఆన్‌లైన్ సర్వీస్‌లో డాక్యుమెంట్ ఎంట్రీ అండ్ రిజిస్ట్రేషన్ అనే ఆప్షన్ క్లిక్ చేయాలి. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పేరును నమోదు చేయాలి. ఆ తరువాత ఓటీపీ కోసం ఈ మెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్ వాటిల్లో ఏదో ఒకటి ఇవ్వాలి. అప్పుడు సెండ్ ఓటీపీ అనే బటన్ క్లిక్ చేయాలి. ఓటీపీ మన ఇచ్చిన ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్‌కి వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది.ఇప్పుడు మళ్లీ లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. అందుకోసం మళ్లీ ఈ మెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్ వాటిల్లో ఏదో ఒకటి ఇవ్వాలి. దానికి ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే లాగిన్ అవుతుంది. అందులో పబ్లిక్ డేటా ఎంట్రీ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. అందులో బుక్ స్లాట్ అనే ఆప్షన్ క్లిక్ చేయాలి. అక్కడ అడిగిన వివరాలు, మనకు నచ్చిన సమయం నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవచ్చు.వివరాలను సమర్పించిన తరువాత, ఒక అప్లికేషన్ ఐడీ జనరేట్ అవుతుంది. ఇది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకోవడానికి పని చేస్తోంది. ఆ తరువాత వారు ఏ రిజిస్ట్రేషనో ఎంచుకోవల్సి ఉంటుంది. ధ్రువీకరణ కోసం క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేకమైన డిజిటల్ టోకెన్ మనకు కేటాయించబడుతుంది. ప్రతి టోకెన్ ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌తో లింక్ చేసి ఉంటుంది. ఇది సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయిస్తారు.

# బొత్సపై జనసేన ప్రత్యేక దృష్టి

విజయవాడ, ఏప్రిల్ 2

ఏపీలో ( రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఆ పార్టీకి కీలక నేతలు గుడ్ బై చెబుతూ వచ్చారు. పార్టీలో నెంబర్ 2 స్థాయి కలిగిన నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. గత ఐదేళ్లపాటు పదవులతో పాటు ఆ పార్టీలో గౌరవం పొందిన నేతలు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యులతో పాటు ఎమ్మెల్సీలు సైతం పదవులను వదులుకున్నారు. విజయసాయిరెడ్డి లాంటి నేత వైసిపికి గుడ్ బై చెప్పడం ఆందోళన కలిగించే అంశమే. అయితే ఇప్పుడు తాజాగా బొత్స సత్యనారాయణ పై సైతం అనుమానపు చూపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.వాస్తవానికి బొత్స సత్యనారాయణ పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. అందుకు అనుగుణంగా బొత్స పవన్ కళ్యాణ్ ను ఎక్కడ కలిసిన ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భిన్నంగా బొత్స వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణాల్లో ఎదురుపడినప్పుడు ఆప్యాయ పలకరింతలు, ఆ లింగనాలు చేసుకుంటున్నారు. దీంతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే తాజాగా పవన్ కళ్యాణ్ సైతం బొత్స విషయంలో పార్టీ శ్రేణులకు చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. బొత్సను పార్టీలోకి తెస్తే ఎలా ఉంటుంది అని పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించినట్లు సమాచారం. అయితే జనసేన నాయకుల నుంచి సానుకూలత రావడంతో పవన్ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అనేక కేసులు నమోదవుతున్నాయి. కొందరు అరెస్టులు కూడా అయ్యారు. కానీ బొత్స విషయంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేశారు బొత్స. కానీ ఎన్నడు రివేంజ్ రాజకీయాలు నడపలేదన్నది ఆయనపై ఉన్న మంచి ముద్ర. అందుకే కూటమి ప్రభుత్వంలో సైతం ఆయనకు సరైన గౌరవం దక్కుతోంది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ శాసనమండలిపక్ష నేతగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. పార్టీ తరఫున గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. అటువంటి నేతను జనసేనలోకి తెచ్చుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దెబ్బతీయవచ్చని పవన్ భావిస్తున్నారట. ఉత్తరాంధ్రలో పట్టున్న నాయకుడు బొత్స. విజయనగరం జిల్లాలో అయితే నాలుగు నియోజకవర్గాలు ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉంటాయి. మిగతా నియోజకవర్గంలో సైతం ప్రభావం చూపగలరు. ఉత్తరాంధ్రలో బలమైన తూర్పు కాపు సామాజిక వర్గంలో పట్టున్న నేత. అందుకే ఆయనను జనసేనలోకి రప్పించుకుంటే పార్టీ బలోపేతం అవుతుందని పవన్ భావిస్తున్నారట. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# గులాబీ నేతల్లో కొత్త జోష్..

హైదరాబాద్, ఏప్రిల్ 3

బీఆర్ఎస్ నేతల్లో ప్రస్తుతం ఆనందం కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని భావిస్తున్నారు. అందుకే నేతలతో పాటు రోడ్డు మీదకు క్యాడర్ చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తుంది. కాంగ్రెస్ ఇచ్చి ఆరు గ్యారంటీలే తమను ఈసారి అధికారానికి తెస్తాయని నమ్ముతున్నారు. గ్యారంటీలు అందరికీ అందకపోవడంతో పాటు కేసీఆర్ తన హయాంలో అమలు చేసిన పథకాలను ఇప్పటివరకూ అమలు చేయకపోవడం తమకు ప్లస్ పాయింట్ గామారుతుందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటివి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇంత వరకూ అమలు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని



గమనించింది. జిల్లాల్లో, మండలాల్లో బీఆర్ఎస్ నేతలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన ఇందుకు కారణమని చెప్పారు. కల్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు వాగ్దానం చేయడం, ఇప్పటికే అనేక పెళ్లిళ్లు జరిగిపోవడంతో వారు తమకు రావాల్సిన డబ్బులు రాలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక పథకాలు అమలు చేసినా అవి కొందరికే అమలుకావడం కూడా తమకు కలసి వస్తుందని నమ్ముతున్నారు ఇక హ్యాపీస్ సోషల్ మీడియాలో కూడా... దీంతో పాటు సోషల్ మీడియాలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ రెండు అడుగుల ముందే ఉంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తప్పుపడుతూ బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ పోస్టులు పెడుతుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వివాదంపై కూడా బీఆర్ఎస్ సోషల్ మీడియాదే పైచేయిగా మారింది. దీంతో పాటు ఇటీవల కొన్ని సర్వే సంస్థలు వెల్లడిస్తున్న నివేదికలు కూడా తమకు అనుకూలంగా ఉన్నాయని, తమ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందా? అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నెల 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం జరిగిన తర్వాత కేసీఆర్ కూడా ప్రజల్లోకి వచ్చే అవకాశముందని ఇక కాంగ్రెస్ పార్టీకి చుక్కలు కనిపిస్తాయంటున్నారు.

# పట్టా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్

తాడేపల్లి: ఏప్రిల్ 3, (

ఉండవల్లిలో రాజమండ్రి గోవిందు కుటుంబానికి మంత్రి నారా లోకేష్ శాశ్వత ఇళ్ళ పట్టా అందజేసారు. మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 3 వేల ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. గురువారం మంత్రి మొదటి పట్టా పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ గతంలో జేసిబి పాలన చూశాం. రాష్ట్రంలో ఎన్డీఏ పాలనలో మొదటి ఇళ్ల పట్టా ఉండవల్లి గ్రామంలో ఇవ్వడం జరిగింది. ప్రజలు తాము నివసిస్తున్న చోటే ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని ఆనాడు కోరారు. కోరిన విధంగానే బట్టలు పెట్టి పసుపుకుంకుమతో ఇళ్ళ పట్టాలు ఇస్తున్నాం. 2019 నుంచి 2024 వరకు సొంత నిధులతో మంగళగిరిలో 26 రకాల కార్యక్రమాలు చేపట్టాను. గడచిన ఎన్నికల్లో మంగళగిరిలో చరిత్ర



తిరగరాసీ గెలిచానని అన్నారు.

ఇండియాలోనే గొప్పగా మంగళగిరినీ అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. నా లక్ష్యం ఒక్కటే ఏపిలోనే అన్నీ రంగాల్లో మంగళగిరి మొదటి స్థానంలో ఉండాలి. హిందూపురంలా మంగళగిరిని టీడీపీకి కంచుకోటలా తయారు చేస్తా. నేను మంగళగిరిలో గెలిస్తే ఇళ్లు పికేస్తాను అని ప్రచారం చేశారు.. కానీ దానికి భిన్నంగా ఈరోజు ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసి ప్రజల పట్ల మా చిత్తశుద్ధి నిరూపించుకున్నాం. విజనరికి ప్రిజనరికి చాల తేడా ఉంటుంది. చంద్రబాబు విజనరితో హైద్రాబాద్ ను అభివృద్ధి చేశారు. పేదరికం నుంచి పేదలను ధనవంతులుగా చేయడమే ఖ4 యొక్క లక్ష్యం. దుష్ప్రచారాలు చేసి ప్రాజెక్టులను అడ్డుకుంటే రెడ్ బుక్ లో పేర్లు ఎక్కుతాయ్. కార్యకర్తలను కలిసే సమయం జగన్ కు లేదు.. జగన్ ఇంటి ముందు రోడ్డు కోసం పేదల నివాసాలు రాత్రికి రాత్రి ఖాళీ చేయించారు.రెడ్ బుక్ లో చట్టాన్ని ఉల్లంఘించిన వారి పేర్లు ఉంటాయ్.. వారికి తగిన విధంగా శిక్ష ఉంటుంది. రెడ్ బుక్ చూసి ఒకరికి గుండె పోటు, మరొకరికి చెయ్యి విరిగిందని అన్నారు. .

# వైసీపీ తాడేపల్లి ఆఫీస్ ఫర్ రెంట్...

విజయవాడ, ఏప్రిల్ 3

వైనాట్ 175. ముప్పై ఏళ్ల పాటు అధికారంలో మనమే ఉంటాం. జీవితాంతపు అధ్యక్షుడ్ని నేనే. నాకెవ్వరూ అక్కర్లేదు. నాకు నేనే రాజూ మంత్రి.. అంటూ ఇటు బంధు వర్గాన్ని అటు కార్యవర్గాన్ని లెక్కలేనట్టుగా వ్యవహరించిన వైసీపీ అధినేత జగన్ పరిస్థితి ఏంటో చెప్పడానికి ఇదొక్కటి చాలట.ఈ బిల్డింగ్ కి ఆ టూలెట్ బోర్డు పెట్టేశారు. ఇదీ ప్రస్తుతం వైసీపీ గురించి వినిపించే మాట. తాజాగా ఈ లిస్టులోకి మరో డైమండ్ లాంటి సీనొచ్చి చేరింది.. ఈ టూలెట్ బోర్డును గమనించారుగా.. ఇది సాదా సీదా బిల్డింగ్ కి వేలాడుతున్న టులెట్ బోర్డు కాదు. ఒకప్పుడు 151 సీట్లతో రాష్ట్ర రాజకీయాలనే శాసించిన ఫ్యాను పార్టీ కేంద్ర కార్యాలయంగా పని చేసిన భవనం. ఇదీ ప్రస్తుతం దీని ముందు కనిపిస్తోన్న దృశ్యం.అదేంటి అధికారంలో ఉండగా.. అంతా మాదే అన్నారుగా. ఇటు పార్టీకి పర్మినెంట్ అధ్యక్షుడ్ని నేనే అనడంతో పాటు, అటు రాష్ట్రాన్ని శాస్వతంగా పాలించేది కూడా నేనే.. అంటూ వీర ధీర శూర రేంజ్ లో పలికిన డైలాగులేమై పోయాయి? అంటూ ఒక్కొక్కరూ ఈ బోర్డు చూసినంతనే నోళ్లు నొక్కుకుంటున్నారట.151లోంచి ఐదు ఎగిరిపోయే సరికి.. ఏకంగా ఇక్కడి నుంచి పార్టీ కూడా ఎగిరిపోయిందా? ఇదెక్కడి విడ్డూరం. ఇది దేనికి సంకేతం? అయినా పార్టీ ఆఫీసు ను కూడా కొనసాగించలేక పోతే ఎలా? దీన్నెలా అర్థం చేసుకోవాలి? వచ్చే రోజుల్లో పార్టీకి కూడా ఇలాగే టులెట్ పెట్టేస్తారన్న అర్థం రాదా.. హవ్వ హవ్వ అంటూ ఈ సీన్ చూసిన వెంటనే.. ఘాటైన వ్యాఖ్యానాలే చేస్తున్నారట.తాడేపల్లి బైపాస్ లో మెయిన్ రోడ్డుపై ఉన్న ఈ ఆఫీసు వచ్చి పోయే కార్యకర్తలతో ఎంతో కోలాహలంగా ఉండేది. తమ తమ ఇబ్బందులు చెప్పుకునేందుకు ఇదొక వేదికగా నిలిచేది. పార్టీ ఓటమి తర్వాత వాస్తు కలసి రాలేదనో లేక అద్దె కట్టడం ఎందుకనుకున్నారో ఏమో తెలీదు కానీ.. ఇక్కడి నుంచి అధినేత జగన్ అయితే పార్టీ జెండా పీకేశారట. పార్టీ కార్యాలయం ఇక్కడి నుంచి ఖాళీ చేయించి.. క్యాంప్ ఆఫీసులో ఏర్పాటు చేశారట.మరికనేం.. పార్టీ ఆఫీసైతే ఎక్కడో ఒక చోట ఉండనైతే ఉందిగా అంటూ అనుకోడానికి వీలు లేకుండా పోతోందట. కారణం ఇక్కడికి వెళ్లాలంటేనే సెక్యూరిటీ ప్రాబ్లం. ఒక వేళ వెళ్లినా తమ గోడు వినేందుకు ఏ ఒక్కరూ ఉండరన్న నిర్వేదం.ఇక్కడి నుంచి జగన్ తన పార్టీ ఆఫీసు తీసెయ్యడంతో ఈ భవనానికి టులెట్ బోర్డు పెట్టారు యజమాని. అంతే కాదు.. అద్దె కూడా బకాయి పడ్డట్టు సమాచారం. మరి అధికారంలో ఉన్న ఇన్నాళ్ల పాటు వెనకేసింది ఏమై పోయింది? కనీసం పార్టీ ఆఫీసు రెంటు కూడా కట్టకుంటే పరిస్థితేంటి? కార్యకర్తల్లోకి ఇదెలాంటి సందేశాన్ని తీస్కుళుంది? మరీ ఇంత దివాలాకోరు తనమేంటని గుసగుసలాడుతోన్నారట ఫ్యాను పార్టీ కేడర్.పార్టీ అధికారం లేక పోవడంతో ఆఫీసు రెంటు కూడా కట్టినంత స్వార్ధ పరుడు జగన్. అలాంటివాడు తమకు ఇంకెలాంటి న్యాయం చేస్తారు? ఇవాళ పార్టీ ఆఫీసు తీసేశాడు. వచ్చే రోజుల్లో పార్టీ తీసెయ్యడన్న గ్యారంటీ ఏంటీ? అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారట.. కార్యకర్తలు.అధికారమున్న రోజుల్లో ముప్పై ఏళ్లు మనమే అధికారంలో ఉంటామని బీరాలు పలికిన జగన్.. నేడిలాంటి దుస్థితికి చేరుకోవడంతో ఏమనాలో అర్థం కావడం లేదట సగటు కార్యకర్తకు. ఔన్లే.. పార్టీ పేరు చూస్తే శివకుమార్ అనే ఒకరు పెట్టింది. కార్యాలయం చూస్తే అద్దెకున్నది. అంటే పార్టీ మనది కాదు. ఇక అదుండే భవనమూ మనది కాదు. ఇంకేముందిక్కడ.. ఏమున్నదన్నో.. అంటూ ఆర్ నారాయణమూర్తి పాట పాడుకుంటూ పోలోమని తిరిగెళ్లిపోతున్నారట కార్యకర్తలు..

# 8.7 లక్షల కోట్ల ఆస్తులతో వక్ఫ్ బోర్డు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3,

భారత్ లో అతి ఎక్కువ భూమి ఎవరి అధీనంలో ఉందో తెలుసా..? భారతీయ రైల్వే బోర్డు వద్ద..ఆ తర్వాతి స్థానం సాయుధ దళాలది.ఇక మూడో అతి పెద్ద భూస్వామిగా వక్ఫ్ బోర్డ్ ఉంది.వక్ఫ్ బోర్డ్ వద్ద మొత్తం 8.7 లక్షల స్థిర, చరాస్తులు ఉన్నాయి. వీటిలో 9.4 లక్షల ఎకరాల భూమి ఉంది. దీని మొత్తం విలువ రూ.1.2 లక్షల కోట్లు. అంత భారీ ఆస్తులున్న వక్ఫ్ బోర్డ్ విషయంలో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ చట్టానికి సవరణ తీసుకొస్తోంది. ఈ సవరణ విషయంలో ఇప్పుడు వివాదం నెలకొంది. సవరణ బిల్లు పార్లమెంట్ లో పాసవ్వడంతో వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు వస్తాయి.ప్రస్తుతం అమలులో ఉన్న వక్ఫ్ చట్టాన్ని 1995లో రూపొందించారు. ఆ తర్వాత ఇప్పుడు సవరణ చేపట్టారు. వక్ఫ్ నవరణ బిల్లు -2024 పార్లమెంట్ ముందుకొచ్చింది. సవరణ బిల్లు పాసయితే ముస్లిం సమాజానికి నష్టం జరుగుతుందని ఆయా సంఘాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ప్రతిపక్షాలు కూడా ఈ బిల్లుని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అసలు 1995 వక్ఫ్ చట్టంలో ఏముంది..ఇస్లాం సంప్రదాయం ప్రకారం ముస్లిం సమాజ ప్రయోజనం కోసం చేసే దానాన్ని, ఇచ్చే విరాళాన్ని వక్ఫ్ గా పరిగణిస్తారు. వక్ఫ్ ఆస్తులు భగవంతుడికి చెందుతాయని వారు నమ్ముతారు. ఢిల్లీ సుల్తానులనుంచి వక్ఫ్ సంప్రదాయం మొదలైంది. ఆ తర్వాత దాన్ని కొనసాగిస్తున్నారు. వక్ఫ్ భూముల్ని.. మసీదులు, మదర్సాలు, షాదీమంజిల్ లు, అనాథ ఆశ్రమాలు, శ్మశాన వాటికలకోసం వినియోగిస్తున్నారు. అయితే వక్ఫ్ ఆస్తులు చాలా వరకు అన్యాక్రాంతం అయ్యాయనేది ప్రధాన ఆరోపణ. వక్ఫ్ బోర్డ్ సమర్థంగా వాటిని నిర్వహించలేకపోవడం వల్లే అవి అన్యాక్రాంతం అయ్యాయని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సచార్ కమిటీ వేసింది. ఆ కమిటీ నివేదిక ప్రకారం సుమారు 58,889 వక్ఫ్ స్థలాలు ప్రస్తుతం అన్యాక్రాంతంలో ఉన్నాయి. 13వేల ఆస్తులపై కోర్టు కేసులున్నాయి. ఇక 4.35 లక్షల ఆస్తుల గురించి తగిన సమాచారమే లేదు. సో.. ఇంత నష్టం జరుగుతున్నా చూస్తూ ఊరుకోవాలా అనేది ఎన్డీఏ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్న. వక్ఫ్ ఆస్తుల్ని పరిరక్షించేందుకు కొత్త చట్టం పనికొస్తుందని అంటున్నారు నేతలుప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 వక్ఫ్ బోర్డ్ లు ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లోని బోర్డులు వక్ఫ్ ఆస్తులని నిర్వహిస్తుంటాయి. అయితే కొత్త చట్టం అమలులోకి వస్తే బోర్డు సభ్యుల నియామకంలో ప్రభుత్వ పాత్ర గణనీయంగా పెరుగుతుంది. ఇప్పటి వరకు సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సభ్యులందరూ ముస్లింలు ఉండేవారు. ఇకపై ఇద్దరు ముస్లిమేతరులకు సభ్యత్వం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సభ్యుల్లో ఇద్దరు ముస్లిం మహిళలు కూడా ఉండాలని ప్రభుత్వం బిల్లులో ప్రతిపాదించింది. ఈ సవరణలను ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.వక్ఫ్ వివాదాలపై ఇప్పటి వరకు వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పు అంతిమం. కానీ ఇకపై ఆ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జితో పాటు రాష్ట్ర ప్రభుత్వం నియమించే అధికారి కూడా ఉండాలని బిల్లులో ప్రతిపాదించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులను హైకోర్టులో సవాలు చేసే అవకాశం కూడా ఇచ్చారు. కొత్త చట్టంగా అమలులోకి వచ్చాక 6 నెలల లోపు దేశంలోని ప్రతి వక్ఫ్ ఆస్తినీ సెంట్రల్ పోర్టల్ లో విధిగా నమోదు చేయించాలి. ఇక వక్ఫ్ ఆస్తుల విషయంలో జిల్లా కలెక్టర్లకు కూడా అధికారాన్నిస్తోంది కొత్త బిల్లు.కొత్త బిల్లు వల్ల వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ పెత్తనం పెరిగిపోతుందని, ఆ ఆస్తుల్ని క్రమక్రమంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవి వట్టి అపోహలేనంటున్నారు కేంద్ర మంత్రులు. బిల్లుని సమగ్రంగా పరిశీలించాలంటున్నారు. ఇప్పటి వరకు వక్ఫ్ ఆస్తులు ముస్లింలలో కొంతమంది పెద్దవారి చేతుల్లో ఉన్నాయని, వాటిని పేదవారి దగ్గరకు తెచ్చేందుకే ఈ బిల్లు అని అంటున్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా వక్ఫ్ ఆస్తుల్ని అన్యాక్రాంతం చేసి వారి సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని, అలాంటి పనులకు ఇప్పుడు చెక్ పెట్టినట్టవుతుందని కేంద్రం వాదిస్తోంది.వక్ఫ్ బోర్డ్ ఆధీనంలో ఉన్న భూములను సరిగా వినియోగించుకుంటే వాటిపై ప్రతి ఏటా 1.2 లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందనేది సచార్ కమిటీ నివేదిక చెబుతోంది. కానీ ప్రస్తుతం కేవలం ఏడాదికి 200 కోట్ల రూపాయలు మాత్రమే ఆదాయం వస్తోందట. తాజా సవరణ వల్ల ముస్లిం సమాజానికి భారీ నష్టం తప్పదని విశ్లేషకులు అంటున్నారు. అందుకే, ప్రతిపక్షలు తమ వాదనను బలంగా వినిపిస్తున్నాయి.

# ఎయిమ్స్ అభివృద్ధికై పెమ్మసాని అడుగులు

**ఆస్పత్రి మౌలిక సదుపాయాలను పెంచాలి**

**1,054 పోస్టులను మంజూరు చేయాలి**

**కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ కు వివరించిన పెమ్మసాని**

**ఎయిమ్స్ కు ఏటా రూ. 250 కోట్లు కేంద్రం నుంచి అదనంగా అందే అవకాశం పెమ్మసాని**

గుంటూరు:

ఆచరణలో మెలకువ, మాటకు కట్టుబడే నిబద్ధత కలిగిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన నెక్స్ట్ డెవలప్మెంట్ టార్గెట్ ను ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (ఎయిమ్స్) వైపు గురి పెట్టారు. ఆర్ఓబి, రహదారులు, గుంటూరు ఛానల్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను నెలల వ్యవధిలోనే గుంటూరుకు సాధించుకు వచ్చిన ఆయన ఇప్పుడు తన లక్ష్యాన్ని ఎయిమ్స్ హాస్పిటల్ అభివృద్ధి వైపు మళ్ళించారు.

ఎయిమ్స్ సామర్ధ్యాన్ని పెంచే విధంగా 1,054 పోస్టులను భర్తీ చేయడంతో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పనను కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ నిర్మల సీతారామన్ గారిని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని బుధవారం ఢిల్లీ కార్యాలయంలో కలిసి వివరించారు. ప్రతిపాదనలను సావధానంగా ఆలకించిన తరువాత ఆమె సుముఖంగా స్పందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రయత్నం ద్వారా ఏటా సుమారు రూ. 250 కోట్లను ఎయిమ్స్ కు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అదనంగా భరిస్తుందని తెలిపారు.

# ఎస్వీ యూనివర్సిటీ పీఎస్ ను పరిశీలించిన ఎస్పీ

తిరుపతి

ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిటిషన్ లపై ఎలా స్పందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిటిషన్స్ విచారించడంలో జాప్యం



చేయవద్దన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిటిషన్ పై విచారించి త్వరితిగతిన న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషను లోని వివిధ కేసులు సంబంధించి వాటి స్టేటస్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో అన్ని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ లోని సిబ్బంది ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారనిఅడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులు నిమిత్తం ఎక్కడకు వెళ్ళిన వారికి తప్పనిసరిగా డ్యూటీ పాస్ పోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కే రవి మనోహర్ ఆచారి అదనపు ఎస్పీ శాంతి భద్రతలు, లత డిఎస్పి మహిళ మరియు తిరుపతి టౌన్, సుబ్రహ్మణ్యం సి. ఐ.డి.సి.ఆర్. బి, సాధిక్ ఆలి సీ.ఐ. స్పెషల్ బ్రాంచ్ రామయ్య సిఐ ఎస్వియు పి.ఎస్. మరియు సిబ్బంది పాల్గొన్నారు.

=====================

# ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.వెయ్యి కోట్లు

## మరో నెల గడువు పెంచిన ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 3, (

లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ గడువు ముగిసింది. ఎల్ఆర్ఎస్ ఆదాయం, అప్లికేషన్లపై అధికారులు ప్రకటన చేశారు. ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని ప్రకటించారు. 6.87 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రాసెస్ చేశామని తెలిపారు.అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అమలు చేస్తుంది. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారి 25 శాతం రాయితీ కూడా కల్పించింది. ఎల్ఆర్ఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను అధికారులు ప్రకటించారు. కాగా మరో నెల రోజుల పాటు ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించారు

ఎల్ఆర్ఎస్ వివరాలు

మున్సిపాలిటీలలో మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు- 15.27 లక్షలు

రిజెక్ట్ అయిన దరఖాస్తులు- 15,894

ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు- 6.87 లక్షలు

ఎల్ఆర్ఎస్ ఫీజు పెండింగ్ ఉన్న దరఖాస్తులు- 8.65 లక్షలు

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు- 2.6 లక్షలు

ప్రొసీడింగ్స్ ఇచ్చిన దరఖాస్తులు- 58,032

రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినా ఆశించినంత మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్న మేర స్పందన కూడా రాలేదు. దీనిలో భాగంగానే.. మరో సారి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించింది.ఇప్పటి వరకు 4 లక్షల మంది దరఖాస్తుదారులు రూ.1200 కోట్ల వరకు ఫీజు చెల్లించారు. పథకం అమలు తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఎదురయ్యాయి. దీనిని అధికారులు పరష్కరించేలోపే గడువు తేదీ సమీపించింది. దీంతో వరుసగా ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో చివరి రెండు రోజులు కార్యకలాపాలు సాగలేదు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తడంతో.. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఓటీఎస్‌ను మరో నెల రోజులు పొడిగించింది.2024-25 ఆర్థిక సంవత్సరం చివరి రోజున అంటే మార్చి 31న 43,700 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజు చెల్లించారు. ఆ ఒక్క రోజే ఫీజు కింద దాదాపు రూ.124 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారాలు తెలిపారు. అయితే ఈ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నేడు నిర్ణయం తీసుకోగా.. ఏప్రిల్ 1వ తేదీన కూడా ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని వర్తింపజేశారు.ఇదిలా ఉంటే లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) గడువు మార్చి 31తో ముగిసింది. దీంతో వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈసారి గడువు పెంచినప్పటికీ ఫీజులో రాయితీ 25 శాతం కాకుండా తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎల్ఆర్ఎస్ స్కీమ్ 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. గత ఉత్తర్వుల ఆధారంగా దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించేందుకు ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి



తెచ్చింది.ఈ పథకం అమలులో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. అధికారులు వీటిని పరిష్కరించే లోపు గడువు సమయం ముగిసింది. దీంతో గడువు పొడిగించాలని వినతులు వస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లోనూ పలువురు ఎమ్మెల్యేలు ఎల్ఆర్ఎస్ ఓటీఎస్ గడువును ఏప్రిల్ చివరి వరకూ పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో రెవెన్యూ రాకపోవటంతో గడువు మరోసారి పొడగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొన్ని పరిమితులతో గడువు మరోసారి పొడిగించారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నమోదుకు అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 3,

త్వరలో స్థానిక సంస్థల ఎన్నిక లకు నగారా మోగనుంది. ఎన్నికల సంఘం ఓటరు నమోదును నిరంతర ప్రక్రియగా చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి కటాఫ్ తేదీని ఖరారు చేసి తుది ఓటరు జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి 18 ఏళ్ళు నిండిన వారికి ఓటుగా నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు.గతంలో ఓటర్ల నమోదుకు జనవరి1 తేదీ మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. సదరు తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా అర్హత లభించేది. సదరు విధానానికి స్వస్తి పలికారు. జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను సైతం ప్రామాణికంగా తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. జాబితాలో లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తిస్థాయిలో సవరించాలని అధికారులను ఎన్నికల సంఘం ఆదేశించింది.ఏప్రిల్ లో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి యంత్రాంగం సిద్ధమై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు స్వీకరించడమే కాకుండా నమోదుకు సంబంధించిన నిబంధనలు వివరించారు. ఈ క్రమంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త ఓటర్లను నమోదు చేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామం, వార్డు, డివిజన్ స్థాయిలో ఉండే ఆయా పార్టీల నాయకులు తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఓట్ల నమోదుపై దృష్టి సారిస్తున్నారు.అరచేతిలోనే ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ముందుగా అధికారిక వెబ్ సైట్లోకి వెళ్లాలి. సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో మొబైల్ నంబర్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్లైన్లో కొత్త ఓటుకు రిజిస్ట్రేషన్ చేసు కోవడం, తప్పులను సరిచేసుకోవడానికి, ఓటు హక్కును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేసుకోవడానికి, జాబితాలో రెండు ఓట్లు ఉంటే ఒకదాన్ని తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి వేర్వేరుగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 కనిపిస్తాయి. వాటిలో మీకు కావాల్సిన దానిపై క్లిక్ చేసి అందులో పొందుపర్చాల్సిన వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు ఏఈఆర్వోకు వద్దకు వెళ్తాయి. పరిశీలించి ఆమోదిస్తారు.వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద ఉన్న మొబైల్లో ఫ్ఠబిబిజూబ: లనీబివతీబ. వఇతి. ఐనీల. తిని యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా లేదా చూసుకునే అవకాశం కల్పించారు.ఓటరు గుర్తింపు కార్డు కావాలనుకునేవారు వెబ్ సైట్ లోకి వెళ్లాలి. అందులో ఈ-ఎపిక్ కార్డు డౌన్లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే కాదు. ఫారం-8 ద్వారా ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత గుర్తింపు కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఏయే ఫారం.. ఎందుకంటే...

ఫారం-6: కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఈ దరఖాస్తును పూరించాలి. ఒక ఫొటో, వయసు నిర్ధారణ పత్రం(ఎస్సెస్సీ మెమో), చిరునామా ధ్రువీకరణ ఉండే కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, ఇంటి పన్ను వంటి వాటిని జతచేయాలి.

ఫారం-6ఏ: విదేశాల్లో ఉన్న వారి కోసం ప్రత్యేకంగా ఫార్మాట్ రూపొందించారు. ఎన్నారైలకు రాష్ట్ర ఎన్నికల సంఘం 2018 నుంచి ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఫారం-7: ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఈ ఫారంను పూరించాలి. ఓటరు మరణించినా, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డా వారిని జాబితా నుంచి తొలగించాలని ఈ పారం ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

ఫారం-8ఏ: పట్టణాల్లో చాలామంది ఒక కాలనీ నుంచి మరో కాలనీకి మారుతుంటారు. ఈ క్రమంలో ఓటు వేసేటప్పుడు ఇబ్బందులు పడుతుంటారు. వారి కోసం ఈ ఫారం ఉపయోగపడుతుంది. ఒక పోలింగ్ బూత్ నుంచి మరో సమీప పోలింగ్ బూత్ కు మారేందుకు దరఖాస్తు చేయాలి.ఇక ఓటరు నమోదు, ఎన్నికలకు సంబంధించి 1950 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఫిర్యాదు కూడా చేయొచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందిస్తారు. అంతేకాకుండా ఇంటర్ నెట్ నుంచి ఈమెయిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 5,30337 మంది పురుషులు, 5.52.358 మంది మహిళలు, 61 ట్రాన్స్ జెండర్స్ మొత్తం 10,82,751 ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జాబితాలో మహిళలే ఎక్కువగా నమోదయ్యారు. ఈసారి సైతం వారి సంఖ్య పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. యువత.. ఓటు నమోదుకు ముందుకు రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# పోలవరం ప్రాజెక్ట్ లో గ్యాప్ 1 రాక్ఫిల్ డ్యామ్ పనులకు శ్రీకారం

పోలవరం, ఏప్రిల్ 03:

పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన గ్యాప్ 1 రాక్ఫిల్ డ్యామ్ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. జలవనరుల శాఖ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీ పీ ఏ ), మేఘా ఇంజనీరింగ్ అండ్స్ట్రాక్ఛర్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్ ) అధికారులు ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతం లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాప్



1 రాక్ఫిల్ డ్యామ్ ను సుమారు 25 మీటర్ల ఎత్తుతో 540 మీటర్ల పొడవున నిర్మిస్తారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ, పీ పీ ఏ అధికారులు, ఎం ఏఐ ఆల్ ప్రతినిధులు మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేసి ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు సీఈ కే నరసింహమూర్తి, ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, ఈఈ కే బాలకృష్ణ, పీ పీ ఏ సీఈ రమేష్ కుమార్, ఎం ఈ ఐ ఎల్ జాయింట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, జీ ఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# . 4, 5 తేదీల్లో పిఠాపురంలో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన

పిఠాపురం

శాసన మండలి సభ్యుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు ఈ నెల 4, 5 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారు. పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతన నిర్మాణాలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్, పిఠాపురం ఇంచార్జి మర్రెడ్డి శ్రీనివాస్ హాజరు అవుతారు.

# టీడీఆర్ బాండ్ల జారీ కోసం స్పెషల్ డ్రైవ్

అమరావతి

తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీ కోసం శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లను త్వరితగతిన జారీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. శుక్రవారం ఉదయం నుంచి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ లో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత పాల్గొంటారు. టీడీఆర్ బాండ్ల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేయించడం,ఇతర సమస్యలు పరిష్కరించడం కోసం స్వయంగా డ్రైవ్ లో పాల్గొంటున్నారు. టీడీఆర్ బాండ్లు పొందాల్సిన వారు స్పెషల్ డ్రైవ్ కు తగిన డాక్యుమెంట్లతో హాజరుకావాలని మున్సిపల్ శాఖ సూచించింది.

# విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉంది

## రెండున్నర దశాబ్దాల కలను ఎన్డీయే ప్రభుత్వం నెరవేర్చింది : మంత్రి నారా లోకేష్

అమరావతి ఏప్రిల్ 3 ఎంటిఎంసిలో ఉన్న మిగిలిన గ్రామాలు, తాడేపల్లి, మంగళగిరి పట్టణాల్లో సిఆర్ డిఎ పరిధి కింద పనులు పూర్తి చేస్తామని ఎపిమంత్రి నారా లోకేష్ తెలిపారు. భూగర్భ డ్రెయినేజీ తాగునీరు, అండర్ గ్రౌండ్ విద్యుత్ అమరాతి మాస్టర్ ప్లాన్ కింద జరుగుతుందని అన్నారు. మంగళ గిరి నియోజక వర్గం ఉండవల్లిలో నారా లోకేష్ మాట్లాడారు.. దుగ్గిరాలకు వచ్చేసరికి ఆర్ డబ్ల్యూఎస్ కింద పనులు పూర్తవుతాయని తెలియజేశారు. అంతిమంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యమని వెల్లడించారు. రెండున్నర దశాబ్దాల కలను ఎన్డీయే ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు.విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉందని ఎద్దేవా చేశారు. మంగళ గిరి నియోజక వర్గం ఉండవల్లిలో ' మన ఇల్లు- మన లోకేష్' కార్యక్రమం చేపట్టారు. గోవిందు, సీతామహాలక్ష్మి దంపతులకు తొలి శాశ్వత ఇంటి పట్టా నారా లోకేష్ అందజేశారు. మంగళగిరిలో దశాబ్దాల సమస్యకు 10 నెలల్లో పరిష్కారం చూపించారు. మొదటి విడతలో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న 3 వేల మందికి శాశ్వత పట్టాలు అందజేశామన్నారు. స్వయంగా లబ్దిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసేలా నారా లోకేష్ ప్రణాళికలు చేపట్టారు.

# కుటుంబంపై యువకుల దాడి

మేడ్చల్కుటుంబంపై యువకులు దాడి చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది .స్థానికుల వివరాల ప్రకారం గత ఆదివారం మేడ్చల్ మండలం సోమారం గ్రామంలో ఓ డాబా కు బండ మైలారం చెందిన యువకులు ఆహారం ఇవ్వలేదని మొత్తం కుటుంబం పై దాదాపు 30 మంది యువకులు దాడి చేశారు. అంతేకాకుండా ఆ కుటుంబంలో ఉన్న యువతి అని చూడకుండా బండరాయితో తలపై తీవ్రంగా దాడి చేశారు.

# హెచ్ సీ యూలో ఏం జరుగుతోంది

హైదరాబాద్, ఏప్రిల్ 3, (

ప్రభుత్వం చాలా క్లియర్గా చెబుతోంది. కంచ గచ్చిబౌలిలోని ఆ 400 ఎకరాలు సర్కారువేనని. అయినా, ఊఅజ తిరకాసు పెడుతోంది. విద్యార్థి సంఘాలు రెచ్చిపోతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ మరింత అగ్గి రాజేస్తున్నాయి. మంగళవారం ఆందోళనలు, అరెస్టులతో వర్సిటీ ఉద్రిక్తంగా మారింది.ఊఅజ దగ్గరికి వెళ్లకుండా రాజకీయ పార్టీల నేతలను ఉదయం నుంచే పోలీసులు అడ్డుకున్నారు. హైదర్గూడ ఓఎం క్వార్టర్స్లోనే బీజేపీ ఎమ్మెల్యేలను హౌజ్ అరెస్ట్ చేశారు. మహేశ్వర్రెడ్డి, పాయల్ శంకర్ తదితరులు పోలీసులతో గొడవకు దిగినా.. వారిని కంట్రోల్ చేశారు. అటు.. కేటీఆర్, హరీశ్రావు ఇంటి దగ్గర కూడా పోలీసులు భారీగా మోహరించారు.బడా లీడర్లను ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నా.. ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రం ఊఅజ కు భారీ సంఖ్యలో చేరుకున్నారు. బీజేవైఎం నేతలు వర్సిటీ గేటు ముందు ఆందోళనకు దిగారు. జంతు ప్రేమికుడిని అంటూ బీజేపీ నేత చికోటి ప్రవీణ్ తన అనుచరులతో హెచ్సీయూ ముందు హంగామా చేశారు. పోలీసులు వారందరినీ అదుపులోకి తీసుకుని వేరే వేరే పోలీస్ స్టేషన్లకు తరలించారు. యూనివర్సిటీ ముందు పెద్ద సంఖ్యలో పోలీసులు కాపలా కాస్తున్నారు.మరోవైపు, 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం హైకోర్టును చేరింది. ఆ భూమిని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలంటూ 'వట ఫౌండేషన్' కోర్టులో పిల్ వేసింది. ఇలా.. ఆ భూములపై పెద్ద స్థాయిలో రచ్చ నడుస్తోంది.వరుస పరిణామాలపై కాంగ్రెస్ సర్కారు సీరియస్గా ఉంది. అభివృద్ధి కోసం, ఐటీ కంపెనీల కోసం ప్రభుత్వ భూమిని అమ్మితే ఇంతలా రచ్చ చేయడం ఏంటని ముఖ్యమంత్రి మండిపడుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు అమ్మలేదా? అని నిలదీస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ కేంద్రం పరిధిలో ఉంది కాబట్టి.. బీజేపీ పార్టీ ఈ ఇష్యూను కావాలనే రచ్చ చేస్తోందని తప్పుబడుతున్నారు. ఆ 400 ఎకరాలు గవర్నమెంట్




ల్యాండేనని పక్కాగా పత్రాలు, ఆధారాలు చూపిస్తున్నా ఇంకా ఈ గొడవేందని ఫైర్ అవుతున్నారు. సర్కారుకు సపోర్ట్గా కాంగ్రెస్ నేతలు సైతం గొంతు విప్పుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.2004లో ఉమ్మడి ఏపీకి సీఎంగా ఉన్న చంద్రబాబు ఆ 400 ఎకరాల భూమిని ఎఓఉ సంస్థకు కేటాయించారు. ముఖ్యమంత్రులు మారినా ఆ ల్యాండ్ ఎఓఉ వద్దే ఉంది. రేవంత్రెడ్డి సీఎం అయ్యాక.. సుప్రీంకోర్టులో పోరాడి ప్రభుత్వ భూమిని తిరిగి దక్కించుకున్నారు. 20 ఏళ్లుగా భూమి వివాదంలో ఉంది కాబట్టి అక్కడ చెట్లు పెరిగాయి. అంతే కానీ అవి అటవీ భూములు కాదని.. కావాలనే ప్రతిపక్ష పార్టీలు తప్పుదారి పట్టిస్తున్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. జింక చనిపోయిందని ఫేక్ పోస్టులు పెట్టి.. ఆ తర్వాత ట్వీట్లు డిలీట్ చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధిని ఆపే ప్రయత్నం చేస్తున్నారని.. పర్యావరణ వేత్తలను తప్పుదారి పట్టిస్తున్నారు ఆరోపించారు. హెచ్సీయూ కేంద్రం చేతిలో ఉంది కాబట్టి.. వర్సిటీ రిజిస్ట్రార్ బీజేపీ పెద్దలు చెప్పినట్టు చేస్తున్నారని ఎంపీ చామల విమర్శించారు. 400 ఎకరాల భూమిని యూనివర్సిటీ భూమిగా చెబుతూ విద్యార్థులను రెచ్చ గొడుతున్నారని మండిపడ్డారు.

# ఇన్ స్టంట్ బీర్ కేఫ్ లు...

హైదరాబాద్, ఏప్రిల్ 2,

లంగాణ ప్రభుత్వానికి 11 ఏళ్లుగా మద్యం అమ్మకాలు మంచి ఆదాయమార్గంగా మారాయి. దీంతో ఎంత తాగితే అంత మంచిది అన్నట్లు పాలకులు కూడా మద్యం షాపులు పెంచుతున్నారు. అన్నిరకాల మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. ఇక వేసవిలో బీర్ల ధరలు పెంచుతూ వస్తున్నాయి. దీంతో మద్యం అమ్మకాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్గా నిలిచింది. ఇక తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఇన్స్టంట్ బీర్ కేఫ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తోందని సమాచారం. ఈ ఆలోచన ఇన్స్టంట్ కాఫీ షాపుల తరహాలో ఉంటుం., అంటే వినియోగదారులు త్వరగా బీర్ను పొందే విధంగా ఈ కేఫ్లు రూపొందించబడతాయి. ఈ పథకం ద్వారా ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తోంది, ఎందుకంటే తెలంగాణలో బీర్ వినియోగం చాలా ఎక్కువగా ఉంది. నెలకు 45 లక్షల నుంచి 55 లక్షల కేసుల బీర్ అమ్ముడవుతుందని అధికారిక డేటా చెబుతోంది.ఈ కేఫ్లు సాధారణంగా రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇవి మైక్రో బ్రూవరీలకు భిన్నంగా ఉంటాయి. మైక్రో బ్రూవరీలు బీర్ను ఉత్పత్తి చేస్తాయి, కానీ ఇన్స్టంట్ బీర్ కేఫ్లు డ్రాఫ్ట్ బీర్ను వేగంగా సరఫరా చేయడంపై దృష్టి సారిస్తాయి. ఈ కేఫ్లు యువత మరియు బీర్ ప్రియులను ఆకర్షించేలా ఆధునిక వాతావరణంతో రూపొందించబడతాయని అంచనా. అలాగే, ఈ కేఫ్లు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఉపాధి అవకాశాలు, ఆతిథ్య రంగంలో వృద్ధి వంటి ప్రయోజనాలను తీసుకురావచ్చు.

2025 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం బీర్ ధరలను 15% పెంచింది. దీనివల్ల ఒక బాటిల్ ధర సుమారు రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగింది. ఈ నేపథ్యంలో ఇన్స్టంట్ బీర్ కేఫ్లు వస్తే, ధరలు సరసమైన స్థాయిలో ఉంచే అవకాశం ఉంది, తద్వారా ఎక్కువ మంది వినియోగదారులను ఆకర్షించవచ్చు. అయితే, ఈ కేఫ్ల ఏర్పాటుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

తెలంగాణలో ఇప్పటికే 9 డిస్టిలరీలు, 6 బీర్ ఫ్యాక్టరీలు ఉన్నాయి, 51 కంపెనీలు 1,031 రకాల లిక్కర్ మరియు బీర్లను విక్రయిస్తున్నాయి.

రాష్ట్రంలో 2,620 లిక్కర్ షాపులు, 1,117 బార్లు, పబ్లు ఉన్నాయి, ఇవి ఏటా రూ.36 వేల నుంచి రూ.40 వేల కోట్ల ఎక్సైజ్ రెవెన్యూను రాష్ట్రానికి అందిస్తున్నాయి.

? ఇన్స్టంట్ బీర్ కేఫ్లు వస్తే, వీటిలో స్థానికంగా తయారైన 50 బీర్ బ్రాండ్లు మరియు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే 36 బ్రాండ్లు అందుబాటులో ఉండవచ్చు.

==========================

# ప్రవీణ్ పగడాల మరణం పై సోషల్ మీడియా దమన నీతిని ఖండిస్తున్నాం -బాబురావు మాజీ పోలీస్ అధికారి

ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై క్రైస్తవ సమాజంలో అనేక అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి పరిచే దిశగా ప్రభుత్వము, పోలీసు యంత్రాంగం క్రైస్తవ సమాజానికి సంతృప్తికర దిశలోనే విచారణ కొనసాగించడం హర్షనీయమని మాజీ పోలీసు ఉన్నతాధికారి బాబురావు అన్నారు. సోమాజిగూడ,ప్రెస్ క్లబ్లో అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బాబురావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారాన్ని క్రైస్తవ సమాజం ఖండిస్తుంది అని అన్నారు. మృతిచెందిన వారిపై రాక్షస ప్రవృత్తితో సోషల్ మీడియాలో దొంగ వీడియోలు పోస్ట్ చేస్తున్న వారిపై ప్రభుత్వము పోలీసు యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వెంటనే ప్రవీణ్ పగడాల మృతిపై అందరికీ ఉన్న అనుమానాల నివృత్తికై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# మొదట బ్రెస్ట్ క్యాన్సర్ ను గుర్తించడం ముఖ్యం డీజీపీ జితేందర్

హైదరాబాద్

ప్రపంచంలో మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ అనే సమస్య ఆందోళనకరంగా ఉంది. మొదట బ్రెస్ట్ క్యాన్సర్ ను గుర్తించడం ముఖ్యమని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. ఏఐజీ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో అయన మాట్లాడారు. క్యాన్సర్ ను మొదటి దశలో గుర్తిస్తే 100 శాతం క్యాన్సర్ నుండి జయించవచ్చు. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఏడాదికి ఒకసారి ప్రతి ఒక్క మహిళ స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవాలి. హైదరాబాద్ నగరంలో ప్రపంచస్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. పోలీస్ శాఖలో పని చేస్తున్న మహిళల కోసం ఈ క్యాంప్ ను ఏఐజి హాస్పిటల్ ఏర్పాటు చేయడం పట్ల ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

# అప్పుడు స్పందించారు.. ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదు పవన్: ప్రకాశ్ రాజ్

అమరావతి ఏప్రిల్ 3

: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్ పై నటుడు ప్రకాశ్ రాజ్ విరుచుకుపడ్డాడు. ఓ ఇంటర్వ్యూలో తాజా రాజకీయాలు, జాతీయ అవార్డుల గురించి ఆయన స్పందించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లో అడుగుపెట్టినప్పుడు ప్రజా సమస్యల గురించి మాట్లాడేవారని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి అంతగా పట్టించుకోవడంలేదని చురకలంటించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించకుండా సమయం ఎందుకు వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు. సనాతన ధర్మానికి తాను ఎప్పుడు వ్యతిరేకంగా లేను అని, తిరుమల లడ్డూ అనేది చాలా సున్నితమైన అంశమని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయం కావడంతో చాలా జాగ్రత్త మాట్లాడాలని, రకరకాలుగా మాట్లాడుకోవడానికి సినిమా కాదు అని చురకలంటించారు. లడ్డూ తయారీలో నిజంగా కల్తీ జరిగితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో తిరుపతి లడ్డూ విషయంలో ప్రకాశ్ రాజ్ ట్విట్పై పవన్ కల్యాణ్ స్పందించిన విషయం తెలిసిందే.

# కంచ గచ్చిబౌలి భూములను ఎవరూ కొనద్దు

## బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక భూమిని తిరిగి తీసుకుంటాం

హైదరాబాద్ ఏప్రిల్ 3 బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక భూమిని తిరిగి తీసుకుంటామని అద్భుతమైన పార్క్ గా మార్చి హెచ్ సియూ



కి కానుకగా ఇస్తామని బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తెలిపారు. గురువారం ఉదయం తెలంగాణ భవన్ లో హెచ్ సియూ భూముల ఆందోళనపై కెటిఆర్ మాట్లాడారు. కంచ గచ్చిబౌలి భూములను ఎవరూ కొనద్దు అని సూచించారు. పేరుకే ప్రజాపాలన.. ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడా కనిపించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గక పోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇది హైదరాబాద్ భవిష్యత్ కోసం చేస్తున్న పోరాటమని కెటిఆర్ పేర్కొన్నారు.

# స్క్రాప్ తో 500 కోట్ల ఆదాయం

హైదరాబాద్,ఏప్రిల్ 2,

2024 ఆర్థిక సంవత్స రంలో స్క్రాప్ అమ్మకం ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మ ధ్య రైల్వే ఆదాయం గడించింది. రూ. 430 కోట్ల లక్ష్యాన్ని దాటి రికార్డు స్థాయిలో రూ.501.72 కోట్ల ఆదా యాన్ని పొందింది. గత ఆర్థిక సంవ త్సరంలో స్క్రాప్ అమ్మకం ద్వారా రూ.411.39 కోట్లు రాగా ఈ ఏడాది గణనీయ మార్పు కనిపించిందిఈహా ద్వారా ఆన్ లైన్‌లో నిర్వహించిన ఈ అత్యంత పారదర్శకంగా స్క్రాప్ అమ్మకాలు సాగించినట్లు ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపా రు. ద.మ. రైల్వే మెటీరియల్స్ మేనే జ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ మిషన్‌లో భాగంగా జీరో స్క్రాప్ ప్రాజెక్ట్ లక్ష్యా న్ని అమలు చేస్తోంది.ఇందులో భా గంగా తుక్కును వెంటనే గుర్తించ డంతో పాటు సాధ్యమైనంత త్వరగా ఒక ట్రక్ లోడ్ పరిమాణంలో స్క్రాప్ పేరుకుపోకుండా చర్యలు తీసుకొం టోంది. దీంతో పాటు స్క్రాప్ సామ గ్రి అమ్మకం ద్వారా ఖజానాకు ఆర్థిక వనరుగా దోహదపడుతున్నది.కేం ద్రం చేపట్టిన స్వచ్ఛ భారత్ అభి యాన్ ప్రాజెక్టుకు కూడా ఈ స్క్రాప్ విధానం ఎంతగానో దోహదపడిం దని జీఎం తెలిపారు. ఈ ఘనత సా ధించేందుకు కారణమైన మెటీ రియ ల్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ బృందం చేసిన కృషిని జీఎం ప్ర శంసించారు.

## ఆటో స్టార్టర్లు తొలగించుకొని నీరు, విద్యుత్ వృథా అరికట్టండి

### మెట్ పల్లి ఏడీఈ దురిశెట్టి మనోహర్

మెట్ పల్లి,

వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా, భూగర్భ జలమట్టాలు శీఘ్రంగా పడిపోతున్నాయని, విద్యుత్ వాడకం అనూహ్యంగా పెరుగుతుండడం రైతులు నీటిని పంటలకు అవసరం ఉన్నంత మేరకే వాడుకోవాలని ఆటో స్టార్టర్లతో వృథా చేయొద్దని మెట్ పల్లి ఏడీఈ దురిశెట్టి మనోహర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఈ మేరకు ఏడీఈ దురిశెట్టి మనోహర్ మాట్లాడుతూ

మరో రెండు వారాల్లో వరి పంట కోత దశకు చేరుకోనుందని ఎవరైనా రైతులు ఆటో స్టార్టర్లను వినియోగించి అవసరానికి మించి నీటిని తోడడం వలన నీరు వృథాగా కాలువల్లో, వాగుల్లో పడిపోవడం వల్ల అనవసరంగా నీటితో పాటు విద్యుత్ వృథా అవుతుందని భూగర్భ జలమట్టాలు కూడా అడుగంటి పోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియతో అవసరం ఉన్న రైతులకు నీరు అందకుండా పోతుందని, వారి పంటల పట్ల కూడా సామాజిక బాధ్యత వహించాలని రైతులకు మనవి చేశారు. ఏ ఒక్కరూ ఆటో స్టార్టర్ వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు. మెట్టుపల్లి, మల్లాపూర్ సబ్ డివిజన్ పరిధిలో 32 వేల వ్యవసాయ విద్యుత్ పంపుసెట్లు నడుస్తున్నాయని వాటికి నిరంతర ఉచిత విద్యుత్తు ప్రతిరోజు 11.22 లక్షల యూనిట్లు సరఫరా జరుగుతుందని తెలిపారు.

28 సబ్‌స్టేషన్ లు,122 11 కెవి ఫీడర్లు, 5 వేల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ల ద్వారా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి కృషి చేస్తున్నారని అన్నారు. ఏదైనా సరఫరాలో లోపం తలెత్తితే 1912 కు కాల్ చేయాలని సూచించారు. రైతులు పంటలు పూర్తిస్థాయిలో చేతికి అందేంతవరకు అప్రమత్తంగా ఉండాలని నీటిని, విద్యుత్ ను వృథా చేయకుండా పొదుపుగా వాడుకొని సహకరించాలని, భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరులు అందేలా చూడాలని

మెట్ పల్లి ఏడీఈ దురిశెట్టి మనోహర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

## మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిబా పూలే, బి ఆర్ అంబేద్కర్ జయంత్యోత్సవాలను విజయవంతం చేద్దాం

కోరుట్ల,భారత దేశ ఔన్నత్యాన్ని దశ దిశల విస్తరించి అనగారిన ప్రజల హక్కులు సాధించి దేశ పౌరుల మహోన్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయులు పూజ్య బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబా పూలే, డా.బి ఆర్ అంబేద్కర్ గార్ల జయంత్యోత్సవాలను ఘనంగా విజయవంతం చేద్దామని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్, అంబేద్కర్ సంఘాల రాష్ట్ర నాయకులు బలిజ రాజరెడ్డిలు పిలుపునిచ్చారు.గురువారం కోరుట్లలో పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5 న దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్, 11 న దేశ పౌరులకు విద్యానే ప్రధానమని తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్మ జ్యోతిబా పూలే, 14 న భారత రాజ్యాంగ నిర్మాత, విశ్వజ్ఞాని డా. బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ సంవత్సరం కూడా ఎలాంటి లోటు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఏప్రిల్ మాసమంతటే మహనీయుల జన్మదినోత్సవాల పండగలని వారి విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వమే గ్రామ గ్రామన నెలకొల్పాలని కోరుట్లతో పాటు జిల్లాలో అంగరంగవైభవంగా ఉత్సవాలను జరుపుకుందామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎలిశెట్టి గంగారెడ్డి, ఎస్ ఎఫ్ పట్టణ అధ్యక్షులు షాహిద్ మహ్మద్ షేక్, మాదిగ కుల సంఘం అధ్యక్షులు శనిగారపు రాజేష్, కార్యదర్శి మోర్తాడ్ రాజశేఖర్, మాల సంఘం అధ్యక్షులు పొట్ట లక్ష్మణ్, కార్యదర్శి బలిజ సంతోష్, నాయకులు సామల్ల వేణుగోపాల్, గొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ లో కొత్త విమానశ్రయం


అదిలాబాద్,ఏప్రిల్ 2

తెలంగాణలో మరో కొత్త విమానాశ్రయం రాబోతోంది. ఆదిలాబాద్ జిల్లాలో కొత్త ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. దీనిలో భాగంగానే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర కార్యకలాపాల కోసం అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వ శాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ అభ్యర్థనను పరిశీలించిన తర్వాత.. భారత వైమానిక దళం పౌర విమాన కార్యకలాపాలను అనుమతించడానికి అంగీకరించింది. అంతే కాకుండా.. ఆ ప్రదేశంలో శిక్షణ సంస్థను ఏర్పాటు చేయడానికి భవిష్యత్తు ప్రణాళికలను కూడా పరిశీలిస్తోంది.తెలంగాణ ప్రభుత్వ రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి రాసిన అధికారిక లేఖలో.. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి ఈ ఎయిర్‌ఫీల్డ్‌ను జాయింట్-యూజర్ విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సూచించింది. దీని వలన ౦౦౨ సివిల్ టెర్మినల్, ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, సహాయక మౌలిక సదుపాయాల కోసం పక్కనే ఉన్న భూమిని సేకరించాల్సి ఉంటుంది. నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయడానికి వివరణాత్మక ప్రతిపాదనను సమర్పించాలని సూచించబడింది. ఈ ఆమోదంతో.. విమానాశ్రయం వాయుసేన అవసరాలకు అనుగుణంగా ఉపయోగించబడే అవకాశాలు పెరగనున్నాయి. అంతే కాకుండా.. ఈ విమానాశ్రయం మరింత అభివృద్ధి చెందడానికి.. అవసరమైన మౌలిక సదుపాయాలు అందించబడతాయి.. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర విమానయానంతో పాటు.. జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం దీని కోసం ప్రత్యేక ప్రణాళిక కూడా సిద్ధం చేస్తోంది. నూతన టర్మినల్ నిర్మాణం, విమానాల నిలిపివేత, నియంత్రణ టవర్ వంటి నిర్మాణాలు.. ప్రయాణికుల కోసం ఆధునిక ఫెసిలిటీల కల్పన వంటి ఏర్పాట్లు చేయనున్నారు. ఈ పనులన్నీ త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఆదిలాబాద్ ప్రాంతం అనేక విధాలుగా ప్రయోజనాలు పొందనుంది. అలాగే ఇక్కడి స్థానిక ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడనున్నాయి. భూముల ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతం.. హైదరాబాద్ వంటి ప్రాంతాలతో పోటీ పడనుంది.కొత్త ఎయిర్ పోర్ట్ కార్యకలాపాలకు భారత వాయుసేన అనుమతి మంజూరు చేయడం గర్వకారణం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో అంతక ముందు.. మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతులు సాధించిన ప్రభుత్వం.. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు కీలక అడుగు పడింది. తెలంగాణలో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండు విమానాశ్రయాలకు అనుమతులు తెచ్చుకోవడం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అద్భుత కృషికి నిదర్శనం అన్నారు. విమానాశ్రయం కోసం ఆర్‌అం డ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులకు లేఖ రాయగా బుధవారం అక్కడి నుంచి సమాధానం వచ్చింది.ఆదిలాబాద్‌లో పౌరవిమా నాశ్రయానికి అనుమతి నేపథ్యంలో అక్కడ భవిష్యత్తులో ఎయిర్‌ఫోర్స్ ట్రెయినింగ్ సెం టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎయిర్ ఫోర్స్ డైరెక్టర్ సనప్ బాజీరావు రామ్‌నాథ్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర విమానయానం, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జా యింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. మరోవైపు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ వచ్చిన నేపథ్యంలో ఆదిలాబాద్ జి ల్లా ప్రజలతో పాటు, రాష్ట్ర ప్రజలకు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శు భాకాంక్షలు తెలిపారు. అనుమతుల మంజూరీలో సహకరిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి ధన్యవాదాలు తెలిపారు.

## సూర్జాపూర్ లో పోలీస్ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై అవగాహన

## నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు

## తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి



తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్జాపూర్ గ్రామంలో గురువారం రోజున నకిలీ పత్తి విత్తనాలపై పోలీసు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అక్కడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట యొక్క దిగుబడి తగ్గుతుందన్నారు. అదేవిధంగా పర్యావరణం పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. కౌలు రైతులు కూడా ఈ నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. ఈ నకిలీ విత్తనాలు వాడటం వల్ల రెండు మూడు క్వింటాళ్లు అధిక లాభం వస్తుందని ఆశపడితే పంట నష్టపోయిన తర్వాత కూడా మీకు ప్రభుత్వం నుండి ఎలాంటి నష్టపరిహారం వాటిల్లదు. నకిలీ పత్తి విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని ఒకవేళ గుట్టుచప్పుడు కాకుండా దొంగ చాటున వీటిని పంట పొలాల్లో విత్తనాలు నాటుతున్నారని సమాచారం అందిన వెంటనే అక్కడికి వచ్చి పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరైతు ఫెర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయానికి సంబంధించిన ఏ విత్తనాలు తీసుకున్న తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వారు చెప్పే సూచనలు పాటిస్తే మీకు అధిక దిగుబడి రావడంతో పాటు లాభాలు కూడా రావడం జరుగుతుందన్నారు.ఈ యొక్క గ్లైఫోసేట్ నకిలీ విత్తనాలు వాడడం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎవరు కూడా ఇలాంటి నకిలీ విత్తనాలు అమ్మడం, కొనడం కానీ చేయకూడదని అదే విధంగా ఏ గ్రామంలోనైనా ఈ యొక్క నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కన్నెపల్లి సబ్ ఇన్స్పెక్టర్ గంగారాం,మండల వ్యవసాయ అధికారి సాయి,పోలీస్ సిబ్బంది,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా సిటీకోసం సర్వే

యాచారం

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీకి సేకరించిన అసైన్డ్, పట్టా భూములను అధికారులు సర్వే చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులకు గురి చేయకుండా శాంతియుతం గా నచ్చజెప్పి సేకరించిన భూములను



సర్వే చేసి, ఫెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. 40 నుంచి 60 రోజుల్లోపు సర్వే పూర్తి చేసేలా అధికా రులు చర్యలు తీసుకుంటున్నారు. యాచారం తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో ఇద్దరు ఆర్ ఐలు, ఇద్దరు సర్వేయర్లు, మరో ఆరుగురు రెవెన్యూ, టీజీఐఐసీ సిబ్బంది సర్వేలో పాల్గొన నున్నారు. వీరే కాక ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనం త్రెడ్డితో పాటు ఏసీపీ కేపీవీ రాజు ఇతర ఉన్నతా ధికారుల బృందం సైతం సర్వే, ఫెన్సింగ్ వేసే విషయంలో భాగస్వాములు కానున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కాకుండా పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు.

## మహారాణిపేటలో మాక్ డ్రిల్

విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ,గుంటూరు పిలుపు మేరకు, విశాఖ మహారాణిపేట తహశీల్దార్ ఆధ్వర్యంలో జబ్బర తోట, చంగల్ రావు పేట, మత్యకార గ్రామంలో బుధవారం విపత్తుల నిర్వహణ పై మాక్ డ్రిల్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో తుఫానులు, అగ్ని ప్రమాదాలు, భవనాలు కూలినపుడు తీసుకోవల సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించబడింది. మాక్ డ్రిల్లో అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్, , మెడికల్, జీవీఎంసీ, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు-భవనాలు, ప్రజారో గ్య శాఖల భాగస్వామ్య అధికారులు లు పాల్గొన్నారు. 200 మంది అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో, విపత్తు సమయంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యల గురించి స్పష్టమైన అవగాహన కల్పించబడింది. అధికారులు సూచనలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రయోగాత్మక ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి.

## సింగరేణి ఎస్ఎంఎస్ ప్లాంట్ మెటీరియల్ షిప్పింగ్ లో తలెత్తిన అనుమానాలు నివృత్తి చేయాలి

భద్రాద్రి కొత్తగూడెంఏప్రిల్: 03సింగరేణి ఎస్ఎంఎస్ ప్లాంట్ మెటీరియల్ షిప్పింగ్ లో సింగరేణి సంస్థకు కాంట్రాక్టర్ నష్టం చేస్తున్నారన్న విషయంపై తలెత్తిన అనుమానాలు నివృత్తి చేయాలని కోరుతూ గురువారం నాడు ఏరియా ఎస్ ఓ టు జీఎం డి. శ్యాంసుందర్ కి వినతి పత్రం అందజేసినట్లు మణుగూరు సామాజిక సేవకులు కర్నే బాబురావు విలేకరులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఎస్ఎంఎస్ ప్లాంట్ లో నిర్దేశించిన గనులకు రోజుకో పది ట్రక్కుల మిక్సింగ్ మెటీరియల్ మందును సైట్ మిక్సింగ్ ప్లాంట్ (ఎస్ఎంఎస్) ప్లాంట్ నుండి ఎక్స్ ప్లోజివ్ క్యారియర్ల ద్వారా పంపిస్తున్నారు. దానితోపాటు ప్లాంట్లోనేతరు వందల లీటర్ల వాటర్ ను కూడా దొంగ చాటుగా నింపుకొని మొత్తం నీళ్లతో కలుపుకుని మెటీరియల్ గానే లెక్కలోకి చూపిస్తున్నారనడని బాబురావు అనుమానాన్ని వెలిబుచ్చారు. నిబంధనల ప్రకారం వే బ్రిడ్జి లో కాటా వేయకుండా వాటర్ పట్టొద్దని గతంలో ఉన్న డైరెక్టర్లు అన్ని ఏరియాల జీఎం లకు ఆదేశాలు ఇచ్చి ఉన్నారు కానీ అందుకు విరుద్ధంగా మణుగూరు ఎస్ఎంఎస్ ప్లాంట్ కాంట్రాక్టర్ అధికారుల కళ్ళుగప్పి లేదా వారితో అవగాహన కలిగి ఉన్నారో తెలియదు సింగరేణి సంస్థకు నష్టం చేస్తున్నారన్నారు. ఒక ట్రక్కు కొన్ని ఆరు వందల లీటర్లు అంటే సుమారుగా ఆరు టన్నులు ఆ విధంగా పది ట్రక్కులకు నెలకు రెండు లక్షల రూపాయల పైచిలుకు కాంట్రాక్టర్ కి లబ్ధి చేకూరుతున్నదన్నారు.అంటే ఆమేరకు కంపెనీకి కూడా నష్టం జరుగుతున్నదని అర్థం చేసుకోవాలన్నారు.

# ప్రజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే..

**-మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్**

**-శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి**

**-శాంతి చర్చల కమిటీకి,దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు విజ్ఞప్తి**

హైదరాబాద్ ఏప్రిల్ 3

ప్రజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమేనని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదన చేస్తున్నామన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యాకాండలను, నరసంహారాన్ని(జినోసైడ్) నిలిపివేయాలని , సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలని ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తే తాము తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తామని వెల్లడించారు. తాము చేస్తున్న ఈ ప్రతిపాదనల ఆధారంగా శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని శాంతి చర్చల కమిటీకి,దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు, ఆదివాసీ, దళిత సంఘాలకు, విద్యార్థియువజనులకు, పర్యావరణ కార్యకర్తలు తదితరులందరికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, నగరాల్లో, జిల్లా, తాలూకా కేంద్రాల్లో, యూనివర్సిటీల్లో ప్రచార క్యాంపెయిన్‌ను చేపట్టాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను కూలదోసి సమసమాజ స్థాపన కోసం పోరాడుతుంటే బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రజా పోరాటాలను నిర్మూలించడం కోసం తూర్పు, మధ్యభారతంలో కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయన్నారు.సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీ, పీడనల నుండి దేశాన్ని విముక్తి చేసే పోరాటంలో...ఎల్లపుడూ... పీడిత ప్రజల, పీడిత సాంఘిక సమూదాయాల, పీడిత జాతుల విముక్తి కోసం మా పార్టీ పోరాడుతుంటే ఆ పోరాటాలను అణిచివేయడానికి పట్టణాల్లో, మైదానాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయుధ పోలీసు బలగాల్ని, ఎన్ఐఏ లాంటి ఇంటలిజెన్స్ ఏజెన్సీలను ఉపయోగించి పోరాడే ప్రజానీకం పై దాడులు చేస్తున్నాయని సదరు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపక్ష మేధావులపై భీమాకోరేగాన్ కుట్ర కేసును మోపి జైళ్లో బంధించాయన్నారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో ఆదివాసీ యువతీయువకులను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకుని వారిచేతనే ఆదివాసులను హత్యలు చేయిస్తున్నాయని ప్రకటనలో వెల్లడించారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్‌లకే పరిమితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటు నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నింటా.. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయన్నారు.ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైబడిన సంఖ్యలో తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయిల కమాండర్లను, సభ్యులను, సాధారణ ఆదివాసీ ప్రజానీకాన్ని హత్య చేశాయన్నారు. ఇందులో 1/3 సంఖ్యలో సాధారణ ఆదివాసీ ప్రజలు హత్య చేయబడ్డారన్నారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్టులు చేసి అక్రమ కేసులు మోపి జైళ్ల పాల్జేస్తున్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో 'మధ్యభారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలి. భారత ప్రభుత్వంసిపిఐ(మావోయిస్టు) బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలి' అనే అంశంపై మార్చి 24న హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిందన్నారు. నేటి స్థితిలో శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, అది శాంతి కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శాంతి చర్చల పట్ల తమ పార్టీ వైఖరిని తెలియపరుస్తూ.. ప్రజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమేనని సదరు ప్రకటనలో పేర్కొన్నారు.

# సంపదను సృష్టించడం నాయకుడి లక్షణం: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్

-కానపల్లె గ్రామ సచివాలయ నూతన భవన సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు






కడప, ఏప్రిల్ 2(భారత శక్తి) : సంపదను సృష్టించడం నాయకుడి ప్రధాన లక్ష్యం అని, ఉన్నవూరు, సొంత ప్రాంతాన్ని చక్కబెడితే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లే అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అభివర్ణించారు. బుధవారం ప్రొద్దుటూరు మండలం కానపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయ ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా గ్రామ సచివాలయ భవనానికి జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ప్రారంభోత్సవం చేయగా, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం రైతు సేవాకేంద్రాన్ని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతికి గ్రామ సచివాలయాలే ఆయువు పట్టు అని తెలుపుతూ సంపదను సృష్టించడం నాయకుడి ప్రధాన లక్ష్యం అన్నారు. అదే నిజాన్ని నమ్మిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక స్థితిని ప్రస్తుతం 4వ స్థానంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. అదే బాటలో నడుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 విధానం ద్వారా. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తల సమన్వయ సహకారంతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజల ఇంటి ముంగిటే గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని రకాల విస్తృతమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం సహకారంతో వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నమైన మార్పులను తీసుకొచ్చిందన్నారు. సేవలను మరింత విస్తృతం చేస్తూ ప్రజలకు ఆరోగ్య భద్రతను కల్పిస్తోందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరంగా తన వంతు సహకారాన్ని అందించడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు.చడంలో రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన, సంపన్నమైన పట్టణంగా ప్రొద్దుటూరు అభివృద్ధి చెందుతోందన్నారు. అలాంటి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను సంతృప్తికరంగా అందిస్తోందన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 విధానం ద్వారా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఇంకనూ పేదలుగా మిగిలి ఉన్న కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి, అధికారి, ఆర్థిక సంపన్నులు తమవంతు బాధ్యతను తీసుకోవాలన్నారు. సమాజంలోని ఉన్నత స్థాయి వ్యక్తులు ఎంతో కొంత శక్తి సామర్థ్యాలను అవసరమున్న మేరకు ఇతరులకు అనుసంధానం చేసి పీ 4 విధానాన్ని సఫలీకృతం చేయాలన్నారు. విద్య ఆరోగ్య ఆర్థిక జీవనోపాధిలో వృద్ధి సాధించి పేదరికం నిర్మూలించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రొద్దుటూరు నియోజకవర్గం ముందంజలో నడుస్తోందని చెప్పడానికి గర్విస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా గ్రామ సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పని చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు రాష్ట్రాభివృద్ధికి ప్రమాణికాలుగా నిలిచాయన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఒకే ప్రాంగణంలో గ్రామీణ ప్రజలకు అన్ని రకాల సేవలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోనే అత్యంత అధునాతన వసతులతో ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవనాలను ప్రభుత్వ నిధులతో నిర్మించి, ప్రస్తుతం ప్రారంభానికి నోచుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ భవనాలు ప్రభుత్వ ప్రజా సేవలకు ప్రమాణికాలుగా సచివాలయ భవనాలు నిలిచాయని చెప్పుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా పబ్లిక్, ప్రజలు, దాతలు పార్టనర్‌షిప్ తో అట్టడుగునున్న 20 శాతం పేదలను, అత్యున్నతంగా వున్న 10 శాతం సంపన్నుల ద్వారా అభివృద్ధి చేయడం పి4 కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం "జీరో పావర్టీ పి4 పాలసీ" అమలుకు కృషి చేస్తోందన్నారు. వెనుకబడిన కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ఈ పి4 పాలసీ ఎంతో ఉపయుక్తం ఆవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలనే భావనతో, ఏదో విధంగా సహాయ సహకారాలు అందించి పేద కుటుంబాలను అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు.

అలాగే ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో ఎప్పటినుండో పరిష్కారానికి నోచుకోలేని మడూరు కాలువ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేయపడతామని, కానపల్లె గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సమస్యను కూడా శాస్వితంగా పరిష్కరిస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా.. ఉన్న ఊర్లలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు పొందే అవకాశం కలుగుతోందన్నారు. విద్యాభివృద్ధికోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు అభినందనీయం అన్నారు. ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, వరదరాజు రెడ్డిలు మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలు, మేధావులు, నిపుణులు, ప్రజలు తమ సహకారాలు అందించి ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని పేదరహితం చేయాలని కోరారు. పేదరిక స్థాయిని తగ్గిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి మన పరిధిలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సుకు దోహదపదాలన్నారు. గ్రామాల్లో అసమానతలు తగ్గించి వనరులను సద్వినియోగం చేసుకొని పేదరికాన్ని నిర్మూలించాలన్నారు. సమాజంలోని ఉన్నత స్థాయి వ్యక్తులు ఎంతో కొంత శక్తి సామర్థ్యాలను అవసరమున్న మేరకు ఇతరులకు అనుసంధానం చేసి వారి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో వృద్ధిలోకి తీసుకురావాలన్నారు. పేద కుటుంబాల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల సంక్షేమ పథకాలను అందించి, వారి ఆర్థిక జీవన పరిస్థితిని మెరుగుపరుస్తున్నాయన్నారు. అన్ని రకాల ప్రభుత్వ సేవలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందజేయాలని, అర్హతవున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా విధులు నిర్వహించే బాధ్యత.. సచివాలయ సిబ్బందికి, ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్ర సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచులు సంఘం అధ్యక్షులు, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొండ్రెడ్డి శివచంద్రారెడ్డి, తెదేపా నాయకులు ముక్తియర్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు డిఎస్పీ భావన, డిఎంహెచ్ఓ డా. నాగరాజు, స్థానిక తహసీల్దార్ గంగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకే వన్నెతెచ్చిన గానుగపెంట!!

-అభినందన సభలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ప్రశంస



కడప, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 03:ప్రముఖ సాహితీవేత్త, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్, డాక్టర్ ,గానుగపెంట హనుమంతరావు వైయస్సార్ కడప జిల్లాకే వన్నె తెచ్చారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు ప్రశంసించారు. బుధవారం క డప కలెక్టరేట్ లోని డిఆర్వో కార్యాలయంలో, విశ్వావసు నామ ఉగాది రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని హనుమంతరావు అందుకున్న సందర్భంగా, ఆయనను సత్కరించి, అభినందించారు.

డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, హనుమంతరావు ఉత్తమ ఉపాధ్యాయునిగా, రచయితగా, పాత్రికేయునిగా, కవయిత్రి మొల్ల సాహితీ సేవా దురంధరునిగా, వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులుగా వివిధ కోణాలలో సేవలు చేసి, గతంలో రాష్ట్రపతిచే, ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిచే సత్కారం పొందడం జిల్లాకే గర్వకారణం అన్నారు.

హనుమంతరావు మాట్లాడుతూ, నా నిరంతర తపన నన్ను ఈ స్థాయికి చేర్చిందనీ, రక్తబంధువుల కంటే ,సాహితీ బంధువులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎక్కువ మందిని పొందానన్నారు. వారి ఆశీస్సులే నాకు శ్రీరామరక్ష అని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో బీసీ సంఘ అధ్యక్ష కార్యదర్శులు లింగమూర్తి, గోవింద నాగరాజు, కార్యవర్గ సభ్యుడు అంజి, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ ,రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనె నాగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి, ఉపాధ్యక్షులు పెండ్లిమర్రి మల్లయ్య, రాధాకృష్ణ, మొల్ల సాహిత్య పీఠం మహిళా విభాగం కార్యదర్శి కొండూరు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. హనుమంతరావును, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పూలమాల, శాలువా ,జ్ఞాపికలతో సత్కరించారు.

# భూస్వాములను,పెత్తందారులను ఎదురించి తెలంగాణ సాయుధ పోరాటం లో తొలి అమరుడై న దొడ్డి కొమురయ్య అడుగు జాడల్లో నడవాలి: జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్త ఏప్రిల్03:

నేడు మనం స్వేచ్ఛగా బ్రతుకుతున్నమంటే వీరుల త్యాగాల ఫలితమే అని వారి త్యాగాలకి వెలకట్టలేనిదని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి దొడ్డి కొమరయ్య ఫోటోకి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికి తెలంగాణ ప్రాంతం నైజాం పాలను కింద ఉండేదని,అప్పట్లో ప్రజలు మహిళలు బయట తిరిగే పరిస్థితి లేదని,అట్టి సమయంలో ఎందరో మహానుభావులు నైజం అరాచక పాలనకు,వెట్టి చాకిరికి వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు. అట్టి తెలంగాణ సాయుధ పోరాటంలో అప్పటి నల్గొండ నేటి జనగామ జిల్లా కడవేండి గ్రామంలో 19 సంవత్సరాలకే దొడ్డి కొమురయ్య పాలిత ప్రజలను వేధిస్తున్న భూస్వాములను, పెత్తందారులను ఎదురించి, బలహీన వర్గాల ప్రజల కోసం తొలి అమరుడైనాడు. స్వాతంత్రం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడి స్వాతంత్రం సాధించారు.అలాంటి మహనీయుల చరిత్ర మనతోపాటు రాబోయే తరాలు తెలుసుకోవాలని వారి అడుగు జాడల్లో నడవాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో డి ఆర్ డి ఎ పిడి వివి అప్పారావు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ నాయక్, డి డబ్ల్యూ ఓ నరసింహారావు,సంక్షేమ అధికారులు లత, శంకర్, జగదీశ్వర్ రెడ్డి, కుల సంఘం పెద్దలు వజ్జే వీరయ్య, డాక్టర్ రామ్మూర్తి, పోలేబోయిన నరసయ్య,పుల్లయ్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# యూనివర్సిటీ భూములు అమ్మొద్దు

## సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మే ఆలోచనని ప్రభుత్వం విరమించుకోవాలి.....

## యూనివర్సిటీ విద్యార్థుల పైన పోలీసులు నిర్బంధం ఆపాలి....

## సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు.....

నర్సంపేట హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మే ఆలోచనన ప్రభుత్వం విరమించుకోని, సిపిఎం విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి యూనియన్ నాయకుల మీద పోలీసుల నిర్బంధాన్ని అపాలని,సీపీఎం నర్సంపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమం చేశారు.

ఈ సందర్బంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు మాట్లాడుతూ,

హెచ్.సీ.యు భూముల రక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థుల పై లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిచారు.అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి నాయకులను,సీపీఎం నాయకులను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద, నాయకుల మీద నిర్బంధం పెరిగిందని వారు విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ వారు అనేక మాయ మాటలు చెప్పారని ఇప్పుడు అధికారం చేపట్టాక గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఈ ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు.తమ ప్రభుత్వ మనుగడ కోసం ప్రభుత్వ భూములను అమ్ముకోవడం ఎంతవరకు సమాంజసమని ప్రశ్నించారు.400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వము ఇప్పటికైనా విరమించుకోవాలని డిమాండ్ చేశారు.విశ్వవిద్యాలయాలను, విద్యా వ్యవస్థను బలోపేతం చేయవలసిన దశలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకొని అమ్మకానికి పెట్టిందని ఇప్పటికైనా విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమిని అమ్మకానికి పెట్టవద్దని, యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని అన్నారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎస్ఎఫ్ఐ నాయకత్వంలో గత కొద్ది రోజులుగా విద్యార్థులు పోరాడుతున్నారని అన్నారు.ఐదు రోజుల నుండి పెద్ద ఎత్తున పోలీసులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తూర్పు క్యాంపస్‌లోకి బుల్డోజర్లతో ప్రవేశించడాన్ని , ప్రభుత్వం ఎంపిక చేసిన 400 ఎకరాల స్థలం దాటి తూర్పు క్యాంపస్ స్థలంలో కూడా చదును చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. అమ్మొద్దని ప్రశ్నిస్తున్నా విద్యార్థులను అరెస్టు చేయడం, పోలీస్ స్టేషన్లల్లో నిర్బంధించారని కొంతమంది విద్యార్థులను రిమాండ్ చేసారని అన్నారు. పైగా మరోసారి ఆందోళన చేయబోమని అంగీకరిస్తూ వీడియో చేస్తేనే విడుదల చేస్తామని ఒత్తిడి చేయడం అనేది సిగ్గుమాలిన చర్యగా బావించారు.ఈ రకమైన పద్ధతులలో ఇబ్బందులకు గురిచేయడం అప్రజాస్వామికమని దీనిని అందరూ ఖండించాలని అన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ తన ఏడవ గ్యారెంటీగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత అప్రజాస్వామికంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామని, 400 ఎకరాల భూమి అమ్మకం ప్రయత్నాలను విరమించాలని, విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, పట్టణ నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, ఇప్ప సతీష్ బుర్రి ఆంజనేయులు,హన్మకొండ సంజీవ కలకోట అనిల్ వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, గణిపాక ఇంద్ర యాక లక్ష్మి, లక్క రాజు, ఐటిపాముల వెంకన్న పైస గణేష్, నాగరాజు నర్సింహా రాములు,ఎల్లయ్య, వీరన్న, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

==========================

# ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై విచారణ..

## తుది తీర్పును రిజర్వ్ చేసిన 'సుప్రీం కోర్టు'

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 3ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ బెంచ్ ఎదుట స్పీకర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధింపుపై ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవన్నారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైందని.. ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని తెలిపారు. రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైందని.. ప్రస్తుత అంశానికి సరిపోదని సింఘ్వి పేర్కొన్నారు. అయితే, జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ రాణా కేసులో జోక్యం చేసుకొని అనర్హత విధించిందని ప్రస్తావించారు.మీ దృష్టిలో 'రీజనబుల్ టైమ్' అంటే ఏంటని సింఘ్విని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతుందని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన వ్యాఖ్యలను మరోసారి ధర్మాసనం ఎదుట పాడి కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచైనా రక్షణ ఉంటుందని భావించారని న్యాయవాది సుందరం పేర్కొన్నారు. కనీసం సీఎం స్వీయ నియంత్రణ పాటించలేరా?.. గతంలో ఎలాంటి ఘనే జరిగిన తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా? అని అంటూ సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.

# సాగుకు, తాగుకు నీటి గండం

కరీంనగర్ ఎల్లంపల్లి జలాశయంలో రోజురోజుకు నీటి మట్టం తగ్గిపోతోంది. ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం రోజుకు 1,094 క్యూసెక్కుల నీటిని వివిధ అవసరాలకు విడుదల చేస్తున్నారు. దీంతోపాటు వరి పంటకు అవసరమైన నీటిని ఇక్కడి నుంచి నందిమేడారం, లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌లకు తరలిస్తే ఉన్న నీరు కాస్తా అడుగంటడం ఖాయం.

కరీంనగర్ తలాపున ఉన్న ఎల్ఎండీలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో తాగునీరు అందించడం కష్టం కానుంది. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు ఇప్పటికీ నిత్యం 2,779 క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువల ద్వారా వదులుతున్నారు. నెలాఖరులోగా మరో రెండు తడులకు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వేసవిలో 3 లేదా 4 టీఎంసీల నిల్వకు పరిమితమయ్యే అవకాశముంది.

మధ్య మానేరు జలాశయం కళ తప్పింది. దిగువ మానేరుతోపాటు మిషన్ భగీరథ తదితర అవసరాలకు రోజు 2,395 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ జలాశయం నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాజెక్టులకు ఈ నెలలో నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. పైన ఉన్న ప్రాజెక్టులు, కాళేశ్వరం జలాలు రాకపోవడం వల్ల జలాశయంలో నీటి నిల్వ క్రమంగా పడిపోతోంది.



ఉమ్మడి జిల్లాలో సాగైన దాదాపు 12 లక్షల ఎకరాల వంటలకు సంబంధించి దాదాపుగా 25శాతం నీరు పై మూడు జలాశయాల నుంచి అందుతోంది. పంట కోతకొచ్చే దశలో కచ్చితంగా మరో రెండు తడులకు నీటిని ఇవ్వాలని అధికారులు భావించారు. దీంతో ఇప్పుడున్న నీటి నుంచి ఈ నెలాఖరులోగా దాదాపుగా సగం ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

వరి పంటను ఎక్కువగా సాగు చేయడంతోపాటు పలు గ్రామాల్లోని చెరువులకు, పొలాలకు ఈ ప్రాజెక్టుల నీరే ఆధారం. రోజులో 143 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాలకు ఒక్క ఎల్ఎండీ నుంచే వాడుతున్నారు. ఎల్లంపల్లి, మధ్య మానేరు కలిపితే మరో 210 క్యూసెక్కులు అవసరం. ప్రణాళిక ప్రకారంగా వినియోగిస్తేనే ప్రజల దాహార్తి తీరడానికి, పంట చేళ్లకు నీరందే పరిస్థితి ఉంది.

వర్షాలు పడేదాకా..!

ఇప్పుడున్న పరిస్థితుల్లో వేసవి గండం దాటినా వర్షాలు సమృద్ధిగా కురిసే వరకు ఈ జలాశయాల్లో నీరుండటం అవసరం. పంటలకే పూర్తిగా నీటిని విడుదల చేస్తే తాగునీటికి కటకట ఎదురవనుంది.

కరీంనగర్‌లాంటి పట్టణానికి ఎల్ఎండీ నీరే ఆధారం. ప్రస్తుతం 5.8 టీఎంసీలుండగా ఇందులో నుంచి 2 టీఎంసీలను మాత్రమే వాడటానికి వీలుంటుంది.

అంతకన్నా తక్కువగా 3 టీఎంసీల లోపు నిల్వ ఉంటే డెడ్ స్టోరేజ్ నుంచి తాగునీటిని పంపింగ్ చేయడం కుదరదు. ఇదే విధంగా ఎల్లంపల్లిలో మరో 4 టీఎంసీలు, మధ్యమానేరులో మరో 6 టీఎంసీలను మాత్రమే ఈ వేసవి నాటికి ప్రణాళిక ప్రకారం వాడితేనే ప్రయోజనం. లేదంటే నీటికి ఇబ్బందులు తప్పవు.

# ఎట్టకేలకు మోక్షం

మంచిర్యాల, ఏప్రిల్ 3: గోదావరి వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో కరకట్టలు కట్టాలనే ప్రతిపాదనకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లా కేంద్రంలోని రాళ్లవాగులో కరకట్టల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. కరకట్టల నిర్మాణం పూర్తయితే ఇన్నేళ్లుగా ముంపు బాధలు పడుతున్న జిల్లా కేంద్రంలోని పలు కాలనీల ప్రజలకు ఆ బాధలు తప్పుతాయి. వర్షాకాలంలో



రాళ్లవాగు ఉప్పొంగి ఏడెనిమిది కాలనీలు నీట మునుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న నీటిపారుదలశాఖ అధికారులు వాగుకు ఇరువైపులా కరకట్టల నిర్మాణానికి ప్రతిపాదనలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అందజేశారు. వరద రక్షణ గోడల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు, భూసేకరణ అవసరం అవుతుండగా తలకు మించిన భారంగా భావించిన కేసీఆర్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది.

వరుసగా రెండు సంవత్సరాలుగా జూలైలో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలో జనజీవనం అతలాకుతలం అవుతోంది. 2022 జూలై 13న కుండపోతగా వర్షం కురవడంతో జిల్లా కేంద్రంలోని వాగులు పొంగిపొర్లి గోదావరి ఉప్పొంగింది. వాగుల్లో నీరు ఎదురెక్కి గృహాల్లోకి చేరింది. అర్ధరాత్రి ఒక్కసారిగా వరదలు రావడంతో ప్రజలు తేరుకొనేలోపే కాలనీలు నీట మునిగాయి. భారీ వరదల కారణంగా ఏడెనిమిది కాలనీలు 48 గంటల పాటు నీటిలోనే మగ్గాయి. తిరిగి గత సంవత్సరం జూలైలో కురిసిన వర్షాలకు మళ్లీ ఆయా కాలనీలు నీట మునిగాయి. దీంతో ముందస్తుగా ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న అధికార యంత్రాంగం పునరావాస కాలనీలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

భారీ వర్షాల కారణంగా గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో పరివాహక ప్రాంతాలు నీట మునిగాయి. నదిలో చేరే అవకాశం లేక రాళ్ల వాగు, తోళ్లవాగుల్లో వరదనీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి, పోటు కమ్మాయి. జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా పాత మంచిర్యాల, రెడ్డి కాలనీ, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో పెద్దమొత్తంలో ఇళ్లు మొదటి అంతస్తు వరకు నీట మునిగాయి. అలాగే తోళ్లవాగు నీరు కూడా నివాస గృహాల దరిదాపుల్లోకి చేరింది. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు గత సంవత్సరం ఆగస్టు 22, 23 తేదీల్లో సర్వే జరిపి నీటి ప్రవాహాన్ని అంచనా వేశారు. కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో పుట్టిన రాళ్లవాగు అటవీ ప్రాంతం గుండా ప్రవహించి జిల్లా కేంద్రానికి చేరుకుంటుంది. స్థానిక ఆర్ఆర్ నగర్, కార్మెల్ హైస్కూల్, గౌతమీనగర్, రెడ్డి కాలనీ, పాత మంచిర్యాల, రాంనగర్, ఎన్టీఆర్ కాలనీల మీదుగా ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. గత జూలైలో కురిసిన వర్షాల కారణంగా రాళ్లవాగులో 139.20 మీటర్ల ఎత్తున నీరు ప్రవహించినట్లు అధికారులు గుర్తించారు. పాత మంచిర్యాల వంతెన వద్ద 48006.35 క్యూసెక్కుల నీరు వాగు గుండా ప్రవహించినట్లు నిర్ధారణకు వచ్చారు. అలాగే తోళ్లవాగుపై ఉన్న చింతల చెరువు నుంచి వరద తాకిడి పెరగడంతో నివాస గృహాల్లోకి నీరు చేరింది.

మంచిర్యాల పట్టణంలోని రాళ్లవాగుకు కరకట్టల నిర్మాణం చేపట్టడం ద్వారా వరదను నివారించడానికి పట్టణంలోని కార్మెల్ స్కూల్ బ్రిడ్జి నుంచి 5.7 కిలోమీటర్ల పొడవున 140 మీటర్ల ఎత్తుతో ఇరువైపులా కరకట్టలు నిర్మించాలని.. అలాగే గోదావరి నది ఎడమవైపు ఒడ్డున రాళ్లవాగు కలిచే చోట రెండు కిలోమీటర్ల పొడవున కూడా కరకట్ట నిర్మాణం చేపట్టవలసి ఉండగా, ఆ మేరకు నివేదిక తయారు చేశారు. ఇందు కోసం ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం సుమారు రూ. 234 కోట్ల 86 లక్షల 33 వేలు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో కరకట్టల నిర్మాణానికి అవసరమైన పట్టా భూముల సేకరణకు సుమారు రూ. 200 కోట్ల 86 లక్షలు వెచ్చించాల్సి రాగా, కరకట్టల నిర్మాణానికి రూ. 20 కోట్ల 21 లక్షల 31వేలు, సీపోటీ ఎక్స్‌వేషన్, పూడిక ఖర్చు రూ. 2 కోట్ల 48 లక్షల 43 వేలు, కరకట్ట రివిట్‌మెంట్‌కు రూ. 5 కోట్ల 25 లక్షల 51 వేలు, జీఎస్టీ, సీనరేజ్ చార్జీలు, డీఎంఎఫ్టీ, ఎన్ఏసీ, తదితరాలకు రూ. 6 కోట్ల 91 లక్షల 44 వేలు ఖర్చవుతుందని అంచనా వేశారు. వాగు మధ్య నుంచి ఇరువైపులా 65 ఫీట్ల వెడల్పుతో కరకట్టలు నిర్మించాల్సి ఉంది. ఇదిలా ఉండగా తోళ్లవాగులో రూ. 25 లక్షల అంచనా వ్యయంతో పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా కరకట్టలు నిర్మించాల్సిన అవసరం లేకుండానే పరిస్థితిని చక్కదిద్దవచ్చునని అధికారులు ప్రతిపాదించారు.

రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా మంచిర్యాల పట్టణం నీట మునుగుతుండటంతో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కరకట్టల నిర్మాణం చేపట్టవలసిందిగా గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలనలోకి తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత అధికారుల నుంచి నివేదికను తెప్పించుకుంది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 250 కోట్లను కేటాయించారు. దీంతో కరకట్టల నిర్మాణానికి మార్గం సుగమం కాగా, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కరీంనగర్‌లోని మానేరు డ్యాం కరకట్టలు నిర్మించిన కాంట్రాక్టర్‌కే మంచిర్యాల పనులు అప్పగించినట్లు తెలుస్తోంది. కరకట్టల నిర్మాణం కోసం రాళ్లవాగులో ప్రస్తుతం మట్టిని చదును చేస్తున్నారు. గరిష్ఠంగా సంవత్సరం కాలపరిమితితో కరకట్టల నిర్మాణం పూర్తి కానుండగా, జిల్లా కేంద్రంలోని ముంపు ప్రజలకు బాధలు తప్పనున్నాయి.

# పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

కన్నెపల్లి, ఏప్రిల్ 3 పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీని ప్రారంభించారు. కన్నెపల్లి మండల కేంద్రంతో పాటు జన్కాపూర్, జజ్జరవెల్లి, టేకులపల్లి, వీరాపూర్, ముత్తాపూర్, నాయకునిపేట, మెట్‌పల్లి, లింగాల గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అంకూస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయి, మాజీ సర్పంచు చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

: వేమనపల్లి, నీల్వాయి, కేతనపల్లి, ముల్కలపేట, దస్నాపూర్, సుంపుటం, జిల్లెడ , లక్ష్మీపూర్ గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కు మార్, కాంగ్రెస్ నాయకులు సాబీర్ ఆలీ, ముల్కల సత్యనారాయణ, గాలి



మధు, ఒడిల రాజన్న, తోకల రాంచందర్, పూర్ణచంద్రరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

మండలంలో గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అధికారులు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాధం లక్ష్మీనారాయణ, తహసీల్దార్ బిక్షర్ దాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాధవరపు నర్సింగరావు, కన్నెపల్లి మండల అధ్యక్షుడు రామాంజనే యులు, మాజీ ఎంపీటీసీ దుర్గం ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 13 రేషన్ షాపులు ఉండగా కొత్తపల్లి గ్రామంలోని రేషన్ మినహా 12 రేషన్ షాపుల్లో బుధవారం సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైందని తహసీల్దార్ సదానందం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అంజమ్మ, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి, మాజీ సర్పంచు గద్దె రాంరెడ్డి పాల్గొన్నారు.

# పట్టణాల్లోని ఇళ్లకు కొలతలు

కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు మున్సిపాలిటీల్లో ఉన్న ఇళ్లకు కొలతలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. రెండేళ్ల కిందట భువన్ యాప్‌తో సర్వే చేపట్టగా ఆ సమయంలో 75 శాతం ఇళ్లను లెక్కించారు. 2018 సంవత్సరంలో విలీనమైన గ్రామాలతోపాటు నగరంలో నూతన భవనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వీటికి సరైన విధంగా పన్ను మదింపు జరగకపోవడం, అదనపు అంతస్తులు నిర్మించుకోవడం, ఆస్తిపన్ను పరిధిలోకి రాకపోవడం, అక్రమ నిర్మాణాలు కట్టడం, ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు తీసుకోవడంతో కొలతల విషయంలో తేడాలు ఉంటున్నాయి.

ఆస్తిపన్ను మదింపు

నగర, పురపాలికల్లో భువన్ యాప్ ద్వారా భవనాల చిత్రాలు, కొలతలను అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అంతర్జాలంలో నమోదు చేశారు. దీనిద్వారానే ఆస్తిపన్ను మదింపు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే ఆస్తిపన్ను సర్దుబాటు కావాల్సి ఉండగా పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన మొత్తంతో డిమాండ్ నోటీసులు వచ్చే అవకాశముంది.

అదనపు కట్టడాలకు నోటీసులు

ఆస్తిపన్ను మదింపులో తేడాలు ఉండటంతో ఒక్కో ఇంటికి సర్వే చేస్తూ అదనపు కట్టడాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వార్డు అధికారులకు డివిజన్లు, వార్డులు అప్పగించి తక్కువ ఆస్తిపన్ను చెల్లిస్తున్న జాబితాను తీసుకొని మళ్లీ కొలతలు వేయడంతున్నారు. ప్రధానంగా అదనపు అంతస్తులు నిర్మించుకోవడం, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని వదలడం లేదు. వాణిజ్య సంస్థ ఆస్తిపన్ను ఏవిధంగా వస్తుందో నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# పడకేసిన పల్లె పాలన

జగిత్యాల గ్రామీణం: పల్లెలపై అధికారుల పట్టింపు లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పారిశుద్ధ్యం గాడితప్పుతోంది. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విడుదలలో జాప్యంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా జీవిస్తున్నారు. పల్లెల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాక పంచాయతీలలో నిధులు లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. పంచాయతీ కార్యదర్శులు ఉన్న నిధులతో చిన్న చిన్న పనులు చేస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు ఏడాదికిపైగా ప్రభుత్వం నుంచి నిధులు రాక జిల్లాలోని పల్లెల్లో అభివృద్ధి కానరావటంలేదు. పెద్ద గ్రామ పంచాయతీలకు నిధులు మెండుగా ఉండగా చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పల్లెలకు ప్రత్యేకాధికారులు వెళ్లకపోవటంతో పారిశుద్ధ్యం లోపించింది.

పారిశుద్ధ్య కార్మికులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి వేతనాలు కూడా రావటంలేదు. వేతనాలు రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏప్రిల్ నెలలోనైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచులైన తమ సమస్యలు పట్టించుకుంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

విధుల్లో చేరని జిల్లా పంచాయతీ అధికారి

పల్లె పాలనను పట్టించుకోవటంలేదనటానికి మరో నిదర్శనం జిల్లా పంచాయతీ అధికారి లేకపోవటం. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ బదిలీ అయిన తర్వాత డీఆర్డీవో పీడీ మదన్‌మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రెండు విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారింది. నిజామాబాద్ డీఎల్పీవోగా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు.

# 'ఆసరా'కు నిరీక్షణ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3): ఆసరా పెన్షన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు కళ్లలో వత్తులు వేసుకుని నిరీక్షిస్తున్నారు. 2022 జూలై నుంచి ఆసరా పెన్షన్ల సైట్ ఓపెన్ చేయక పోవడంతో అర్హులైన అనేక మంది మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయాలు,



గ్రామపంచాయతీల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గత ప్రభుత్వం 57 ఏళ్ల వయసుపై వారికి పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించడంతో చాలా మంది పెన్షన్లపై ఆశలు పెట్టుకున్నారు. అర్హులైన అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కాక పోవడంతో వారందరికి పెన్షన్ అంద లేదు.

పెరగని పెన్షన్లు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఆసరా పెన్షన్లను పెంచి చేయూత పథకాన్ని అమల్లోకి తెస్తామని ప్రకటించింది. అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పెన్షన్ల విషయాన్ని ఊసెత్త లేదు. గత ఏడాది, ఈ యేడాది బడ్జెట్‌లో పెన్షన్లకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు పెంచలేదు. దీంతో పెన్షనర్ల ఆశలు అడియాశలయ్యాయి. మూడేళ్లుగా కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికిపోవటం ప్రస్తుతం ఆసరా పథకం ద్వారా పింఛన్లు పొందుతున్న వారు కూడా పెన్షన్ల మొత్తాన్ని పెంచక పోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని దాదాపు 6వేల మంది ఆసరా పెన్షన్లకు అర్హులుగా పేర్కొంటూ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినా పింఛన్ మంజూరు చేయలేదు. దీనితో వారంతా మున్సిపల్ కార్యాలయం చుట్టూ, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది చనిపోగా, ప్రస్తుతం ఆసరా పింఛన్లు పొందుతున్న వారిలో కూడా కొంత మంది వారి ఆశలు నెరవేరకుండానే కళ్లు మూశారు. 2022 జూలై నుంచి ఆసరా పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారుడు మృతిచెందితే వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి పింఛన్ మంజూరు చేస్తున్నారు. పెన్షన్ల మొత్తాన్ని పెంచుతామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అర్హులైన వారందరికి కొత్త పించన్లు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కబ్జాల లెక్క తేలుతోంది

పెద్దపల్లి : జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు కలెక్టర్ శ్రీహర్ష శ్రీకారం చుట్టారు. కబ్జా కోరల్లో చిక్కుకున్న విలువైన భూముల లెక్క తేలుస్తున్నారు. పది రోజులుగా రెవెన్యూ, సర్వే భూ కొలతల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల గుర్తింపు జరుగుతుండగా హద్దులు పాతి, బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. భూ దస్త్రాల శుద్ధీకరణలో చోటు చేసుకున్న తప్పులను సరిదిద్దుతున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వ భూములపై సంయుక్త సర్వే నిర్వహిస్తున్నారు.

కమిటీ ఆమోదం లేకుండానే నమోదు

భూ దస్త్రాల శుద్ధీకరణలో భాగంగా జిల్లాలో 33,334.14 ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నట్లు గుర్తించారు. పరిశ్రమలు, రాజీవ్ రహదారితో పాటు ప్రధాన రహదారుల వెంట, పట్టణాలు, గ్రామాల్లో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. కొందరు రాజకీయ పలుకుబడితో దస్త్రాలు మార్చేస్తున్నారు. అసైన్డ్ కమిటీ ఆమోదం లేకుండానే ఆన్‌లైన్‌లో



నమోదు చేశారు. సేత్వార్ కంటే అధిక విస్తీర్ణంలో బినామీ పట్టాలు సృష్టించి క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. రోజురోజుకూ భూముల ధరలు పెరగడంతో ఆక్రమణలు సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వ అవసరాలకు భూమి అందుబాటులో లేకుండా పోతోంది.

# ఆట పైనే మా దృష్టి.. శబ్దం మీద కాదు: కోహ్లీకి గిల్ కౌంటర్



: బెంగళూరును తన సొంత మైదానంలో మట్టికరిపించిన గుజరాత్ పాయింట్ల పట్టికలో టాప్-4లోకి దూసుకొచ్చింది. ఈసందర్భంగా గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. భారత స్టార్ ఆటగాడు, ఆర్సీబీ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ కి కౌంటర్‌గా అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అసలు ఇంతకీ ఏం పోస్టు పెట్టాడంటే?

చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీపై గుజరాత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్ 2025 సీజన్‌ను ఘనంగా ప్రారంభించిన బెంగళూరుకు సొంత మైదానంలోనే షాక్ తగిలింది. ఇక్కడ ఆడే ప్రతి మ్యాచ్ సమయంలోనూ విరాట్ కోహ్లీ అభిమానులను ఉత్సాహపరుస్తూ ఉంటాడు. అదే సమయంలో గిల్ ( వికెట్ పడినప్పుడూ ఆ స్థాయిలోనే సంబరాలు చేసుకున్నాడు. ఆ మ్యాచ్‌లో గుజరాత్ గెలిచాక.. గిల్ సోషల్ మీడియాలో “ వేం గేమ్‌పై దృష్టిపెడతాం. శబ్దం మీద కాదు” అని పోస్టు పెట్టాడు. దీనికి అభిమానులు ప్రతిస్పందించారు.

“మ్యాచ్ సమయంలో విరాట్ కోహ్లీ చేసిన దానికి శుభ్‌మన్ గిల్ కౌంటర్ ఇచ్చాడు”

“మాకు తెలుసు. ఎవరి గురించి గిల్ పోస్టు పెట్టాడో అర్థమైంది. అయితే, ఇక్కడ నిన్ను (గిల్) తక్కువ చేసే ఉద్దేశం లేదు కానీ, దేశంలో అత్యంత ఓవర్‌రేటెడ్ ప్లేయర్‌వి నువ్వే”

“ఇలాంటి కామెంట్లు చేయడం వల్ల వచ్చిన లాభం ఏంటి? ఎవరైనా నిన్ను హేళన చేశారా? ఏ మ్యాచ్‌లోనైనా సొంత జట్టుకే ఫ్యాన్స్ మద్దతుగా నిలుస్తారు. నిన్ను ఓ బ్యాటర్‌గా అభిమానిస్తా. ఇప్పుడు నీపై ఉన్న గౌరవం పోయింది”

“ఫస్ట్ భారత్ తరపున టీ20 జట్టులో స్థానం సంపాదించు. ఆ తర్వాత ఇలాంటివి పోస్టు చేయొచ్చు”

# నా జీవితం అతడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది..



రేడియో జాకీ మహ్‌వశ్ ( సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది. దీనికి భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ లైక్ కొట్టడంతో ఫ్యాన్స్ తమ కామెంట్లతో హోరెత్తించారు. గత ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ సమయంలో వీరిద్దరూ మైదానంలో సందడి చేసిన సంగతి తెలిసిందే. చాహల్ - మహ్‌వశ్ ప్రేమలో ఉన్నారని అప్పటి నుంచి రూమర్లు వచ్చాయి. ఇక తన భార్య ధన్యశ్రీ నుంచి చాహల్ ఇటీవలే విడాకులు తీసుకోవడంతో ఆ వార్తలకు బలం చేకూరింది. తాజాగా మహ్‌వశ్ ‘హస్బెండ్’ వీడియో పోస్టు చేయడం గమనార్హం.

“నా జీవితంలోకి ఏ అబ్బాయి అయితే వస్తాడో.. అతనే ఏకైక వ్యక్తి అవుతాడు. అతడే నాకు స్నేహితుడు. అతనే నా ప్రియుడు. అతనే నా భర్త. నా జీవితం అతడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. నాకు అవసరం లేని వ్యక్తులు వద్దు. ఆ సమయంలో నేను ఇతర అబ్బాయిలతో మాట్లాడలేను” అని వీడియోను మహ్‌వశ్ షేర్ చేసింది. దానికి చాహల్ లైక్ చేశాడు. దీంతో ఓ అభిమాని స్పందిస్తూ.. “యుజీ భాయ్ ఆ మూల నుంచి నవ్వుతున్నాడు” అంటూ కామెంట్ పెట్టాడు. ‘ప్రతిదీ తాత్కాలికమే. చాహల్ ఇచ్చిన లైక్ శాశ్వతం’ అంటూ మరొకరు స్పందించారు.

# సిరాజ్ ‘ఫైర్’ కేవలం ఆర్సీబీపైనే కాదు..: సెహ్వాగ్ కీలక వ్యాఖ్యలు



గత సీజన్ వరకూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున మహ్మద్ సిరాజ్ ఆడాడు. ప్రస్తుత ఐపీఎల్ నుంచి గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తాజాగా ఆర్సీబీపైనే మూడు వికెట్లు (3/19) తీసి గుజరాత్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ఈక్రమంలో అతడిపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, కివీస్ సీనియర్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ అభినందించారు. కొత్త బంతితో సిరాజ్ ప్రభావవంతంగా కనిపిస్తున్నాడని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు. ఈసారి ఐపీఎల్‌లో దూకుడు కేవలం ప్రత్యర్థి జట్లపైనా కాకుండా.. తనను జాతీయ జట్టు నుంచి పక్కన పెట్టడంపై గురిపెట్టినట్లు ఉందని తెలిపాడు.

“చిన్నస్వామి స్టేడియంలో సిరాజ్ కొత్త బంతితో అదరగొట్టాడు. తన రికార్డును కొనసాగిస్తూ తొలి మూడు ఓవర్లలో కేవలం 13 పరుగులే ఇచ్చాడు. నాలుగో ఓవర్ కూడా అప్పుడే వేసి ఉంటే తప్పకుండా మరొక వికెట్ తీసి ఉండేవాడు. కొత్త బంతిని సూపర్‌గా స్వింగ్ చేశాడు. పిచ్ నుంచి అతడికి సహకారం లభించింది. ఇప్పుడు సిరాజ్ ‘ఫైర్’తో కనిపించాడు. కేవలం ఆర్సీబీ మీదనే కాదు. గత ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే అవకాశం ఇవ్వకుండా అతడిని పక్కన పెట్టినప్పటినుంచే హర్ట్ అయి ఉంటాడు. ఆ ఫైర్‌ను ఇప్పుడు అతడిలో చూస్తున్నా.

ఓ యంగ్ పేసర్ నుంచి మనం ఇలాంటి ప్రదర్శన ఆశిస్తాం. ‘మీరు నన్ను తీసుకోలేదుగా? ఇప్పుడు చూడండి నా సత్తా’ అని చెప్పినట్లుంది. మళ్లీ జాతీయజట్టులోకి వచ్చే వరకూ ఇదే దూకుడు కొనసాగిస్తాడని ఆశిస్తున్నా” అని సెహ్వాగ్ తెలిపాడు.



# ‘ఉపాధి హామీ’ నిధుల మోసం.. షమీ సోదరి అత్తే సూత్రధారి..

టీమ్ఇండియా స్టార్ పేసర్ షమీ ప్రస్తుతం ఐపీఎల్ ఆడుతున్నాడు. కానీ, అతడి కుటుంబానికి చెందిన వార్తలతో హాట్ టాపిక్‌గా మారాడు. తన సోదరి పేరు ఉపాధి హామీ పథకం లబ్ధిదారుల జాబితాలో ఉండటమే దానికి కారణం. ఆమె భర్త కూడా కూలి డబ్బులను తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే, దీనింతటికీ షమీ సోదరి అత్త గులె ఆయేషానే కారణమని ప్రచారం సాగుతోంది. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోరా గ్రామ పెద్దగా వ్యవహరిస్తున్నారు. ఆయేషానే ముందుండి తన కుటుంబసభ్యుల పేర్లను జాతీయ ఉపాధి హామీ పథకం లబ్ధిదారుల జాబితాలో పొందుపరిచినట్లు ప్రాథమిక విచారణలోనూ తేలిందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే జిల్లా స్థాయి విచారణ జరుగుతోందని.. జాబితాలోని పేర్లను తొలగించినట్లు జిల్లా మెజిస్ట్రేట్ నిధి గుప్తా వెల్లడించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

“స్థానిక అధికారులతో కూడిన బృందం విచారణ చేస్తోంది. ఎలాంటి పని చేయకుండానే 18 మంది ఉపాధి పథకం ద్వారా వేతనాలు తీసుకున్నట్లు గుర్తించాం. అందులో షమీ సోదరి షబీనా, ఆమె భర్త ఘజ్నావి, అతడి సోదరులు ఆమిర్ సుహైల్, నస్రుద్దీన్, షేఖు ఉన్నారు. వీరితోపాటు గ్రామపెద్ద గులే ఆయేషా పేరు కూడా ఉంది. వారి కుమారులు, కుమార్తెలను ఇందులో చేర్చినట్లు తెలుస్తోంది” అని డీఎం నిధి గుప్తా తెలిపారు.

స్పందించని కుటుంబసభ్యులు

ఉపాధి హామీ పథకంలో 2021 నుంచి 2024 వరకు షమీ సోదరి కుటుంబసభ్యులు డబ్బులు తీసుకున్నారని కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలపై షమీ గానీ, అతడి కుటుంబసభ్యుల నుంచి గానీ ఎలాంటి స్పందన రాలేదు. అయితే వాస్తవంగా వీరే తమ పేర్లు నమోదు చేసుకున్నారా, లేక ఇతరులు ఇలా చేసి మోసాలకు పాల్పడుతున్నారా అన్నది తొలుత తెలియరాలేదు. అయితే, విచారణ నేపథ్యంలో గ్రామపెద్దగా ఉన్న షమీ సోదరి అత్తే వీరి పేర్లను జత చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

# ఇక్కడే ఏడేళ్లు ఆడా..: ఆర్సీబీతో మ్యాచ్‌పై సిరాజ్ ఎమోషనల్

FONT SIZE



: గత సీజన్ వరకూ ఆ జట్టుతోనే కలిసి ఆడాడు. ఈ మైదానంలోనే ప్రాక్టీస్‌తో పాటు వికెట్లను తీశాడు. ఇప్పుడు ప్రత్యర్థిగా బరిలోకి దిగాడు. ఇప్పటికే అర్థమై ఉంటుందిగా ఆ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఆ ప్లేయర్ మహ్మద్ సిరాజ్ ఇప్పుడు అతడు గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తాజాగా చిన్నస్వామి స్టేడియం వేదికగానే బెంగళూరుతో గుజరాత్ తలపడింది. ఈ మ్యాచ్‌లో జీటీ విజయం సాధించింది. సిరాజ్ 4 ఓవర్ల కోటాలో 3 వికెట్లు తీసి సత్తా చాటాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకొన్నాడు. ఈసందర్భంగా కాస్త భావోద్వేగానికి గురయ్యాడు.

“నేను ఇక్కడ ఏడేళ్లు ఆడా. నా జెర్సీ రెడ్ నుంచి బ్లూకి మారిపోయింది. ఇక్కడికి వచ్చాక కాస్త భావోద్వేగానికి గురయ్యా. కానీ, బంతి అందుకొన్నాక మాత్రం ఇవేవీ ఆలోచించను. నేను రొనాల్డో అభిమానిని. అందుకే, వికెట్ వచ్చిన సమయంలో నా సంబరాలు అలా చేసుకుంటున్నా. అంతర్జాతీయ క్రికెట్‌కు విరామం వచ్చినప్పుడు నా తప్పులు ఏంటో తెలుసుకున్నా. ఫిట్‌నెస్‌పై వర్కౌట్ చేశా. గుజరాత్ టైటాన్స్ ( నన్ను తీసుకున్నప్పుడు ఆశిశ్‌తో మాట్లాడా. బౌలింగ్‌ను ఆస్వాదించమని సూచించాడు. ఇక సీనియర్ ఇషాంత్ శర్మ లైన్ అండ్ లెంగ్త్ గురించి చెప్పాడు. నేను పిచ్ గురించి పెద్దగా పట్టించుకోను. సానుకూల దృక్పథంతో ముందుకుసాగుతున్నా'' అని సిరాజ్ వెల్లడించాడు.

పిచ్ ఒక్కోలా స్పందిస్తుంటుంది: గిల్


“ఈ మైదానంలో ఆర్సీబీని 170 పరుగుల్లోపే కట్టడి చేయడం బాగుంది. పిచ్ కూడా ఒక్కోసారి ఒక్కోలా స్పందిస్తుంటుంది. 250ం స్కోరును కూడా చేసే అవకాశం లేకపోలేదు. అయితే, త్వరగా వికెట్లు తీస్తేనే ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు వీలు కలుగుతుంది. తొలి 8 ఓవర్లలో ఫాస్ట్ బౌలర్లకు మంచి ఆరంభం దక్కింది. త్వరగా ఆర్సీబీ వికెట్లు తీస్తేనే మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు అవకాశం దొరుకుతుందని భావించాం. అలాగే మా బౌలర్లు శ్రమించారు. పిచ్‌ను బట్టి మా బ్యాటింగ్‌లో మార్పులు చేసుకున్నాం” అని గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ) వ్యాఖ్యానించాడు.

కనీసం 190 వరకైనా చేయాలనుకున్నాం: రజత్

''వేం ఇక్కడ 200 స్కోరుపై దృష్టిపెట్టలేదు. కనీసం 190 పరుగులకు తగ్గకుండా గుజరాత్‌కు లక్ష్యాన్ని నిర్దేశించాలని అనుకున్నాం. త్వరగా వికెట్లను కోల్పోవడంతో నష్టపోయాం. వేం ఆడాలనుకొనే విధానం సరైందే. కానీ, పవర్‌ప్లేలో మూడు వికెట్లు పడటంతో స్కోరు బోర్డు నెమ్మదించింది. ఆఖర్లో జితేశ్, లివింగ్‌స్టన్, టిమ్ డేవిడ్ దూకుడుగా ఆడి గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆ తర్వాత లక్ష్యం తక్కువైనా మా బౌలర్లు కాపాడేందుకు చాలా కష్టపడ్డారు'' అని బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ వెల్లడించాడు.

## సెమీస్‌లో జదుమణి

దిల్లీ: భారత బాక్సర్ జదుమణి మండెంగ్బామ్ (50కేజీ) ప్రపంచకప్ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. 20 ఏళ్ల ఈ జాతీయ ఛాంపియన్ క్వార్టర్‌ఫైనల్ బౌట్లో 3-2తో బ్రిటన్‌కు చెందిన ఎలిస్ ట్రోబిడ్జ్‌పై విజయం సాధించాడు. జదుమణి సెమీస్‌లో అసిల్బెక్ జలిలోవ్ (ఉస్బెకిస్థాన్)తో తలపడతాడు. మరో ముగ్గురు భారత బాక్సర్లు నరేందర్ బెర్వాల్ ((90ంకేజీ), నిఖిల్ దూబె (75కేజీ), జుగ్నూ (85కేజీ) క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలయ్యారు. నరేందర్ 2-3తో సపార్‌బే (ఉజ్బెకిస్థాన్) చేతిలో, నిఖిల్ 0-5తో బెలిని (బ్రెజిల్) చేతిలో ఓడారు.



# టారిఫ్‌లతో భారత్‌కు ఎడ్జ్..

## ఆ రెండు రంగాలకు బూస్ట్

: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుగా ప్రకటించినట్లే ప్రతీకార సుంకాలతో విరుచుకుపడ్డారు. చిన్నా, పెద్దా, పేద, ధనిక దేశాలతో సంబంధం లేకుండా సుంకాల మోత మోగించారు. మనతో పాటు చైనా, వియత్నాం, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ తదితర ఆసియా, యూరప్ దేశాలపై టారిఫ్‌లు విధించారు. ఒక్కో దేశంపై ఒక్కోరీతిన టారిఫ్‌లు విధించడం వల్ల ఓవిధంగా భారత్‌కు మేలు చేకూరునున్నందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. టారిఫ్‌ల రూపంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలే గానీ ప్రపంచ వాణిజ్యం, తయారీలో భారత్‌కు ఎడ్జ్ లభిస్తుందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

భారత్ నుంచి ఎగుమతి అయ్యే స్టీల్, అల్యూమినియం, ఆటో మొబైల్ ఉత్పత్తులపై అమెరికా 25 శాతం సుంకం విధించనుంది. ఫార్మా, సెమీకండక్టర్, కాపర్, ఎనర్జీ ఉత్పత్తులపై సుంకాలను పూర్తిగా మినహాయించింది. ఇవి మినహా మిగిలిన ఉత్పత్తులపై 27 శాతం (శ్వేతసౌధం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం) టారిఫ్ వర్తిస్తుంది. విలేకరుల సమావేశంలో ట్రంప్ ఈ మొత్తం 26 శాతంగా పేర్కొనడం గమనార్హం. అదే సమయంయలో చైనాపై 54 శాతం, వియత్నాంపై 46 శాతం, బంగ్లాదేశ్‌పై 37 శాతం, థాయ్‌లాండ్‌పై 36 శాతం చొప్పున టారిఫ్‌లు విధించారు. కొన్ని రంగాల్లో భారత ఉత్పత్తులకు ఈ టారిఫ్‌లే ఎడ్జ్ ఇస్తున్నాయని శ్రీవాస్తవ తెలిపారు.

ఆ రంగాలకు బూస్ట్

ట్రంప్ టారిఫ్‌ల రూపంలో టెక్స్‌టైల్, గార్మెంట్ ఇండస్ట్రీకి అవకాశం లభించినట్లు అవుతుంది. చైనా, బంగ్లాదేశ్‌పై అమెరికా విధించిన అధిక సుంకాలు భారత్ ఎగుమతులు పెంచుకునేందుకు దోహదపడనున్నాయి. తద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవడానికి ఉపయోగపడనుంది. ఉత్పత్తి కేంద్రాలను ఆయా దేశాల నుంచి ఆకర్షించడం, అమెరికాకు ఎగుమతులు పెంచుకోవడం ద్వారా లబ్ధి పొందొచ్చని శ్రీవాస్తవ విశ్లేషించారు. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చిత పరిస్థితికి ముందు అమెరికాకు ఆ దేశం ప్రధాన ఎగుమతిదారుగా ఉంది. చైనా 30 శాతం, వియత్నాం 13 శాతం, భారత్ 8 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఇక ట్రంప్ టారిఫ్‌ల వల్ల లబ్ధి పొందేందుకు అవకాశం ఉన్న మరో రంగం ఎలక్ట్రానిక్స్ తయారీ. ఇప్పటికే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం వర్తింపజేయడం వల్ల పలు కంపెనీలు భారత్‌లో తయారీ చేపట్టాయి. స్మార్ట్‌ఫోన్ తయారీలో ప్రస్తుతం భారత్ దూసుకెళుతోంది. ఎలక్ట్రానిక్స్ తయారీలో అగ్రగామిగా ఉన్న వియత్నాం, తైవాన్ దేశాలు సుంకాల మూలంగా కాస్ట్ అడ్వాంటేజీని కోల్పోయే అవకాశం ఉందని శ్రీవాస్తవ తెలిపారు. తైవాన్‌పై 32 శాతం సుంకాలు విధించడం వల్ల సెమీ కండక్టర్ తయారీని ఆయా కంపెనీలు తమ కార్యకలాపాలను భారత్‌కు తరలించే అవకాశం ఉందన్నారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన మద్దతు అవసరం ఉందన్నారు. తద్వారా అమెరికా వాణిజ్య విధానాలను మనకు అనుకూలంగా మార్చుకొని గ్లోబల్ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యాన్ని పెంచుకునేంద్నుకు వీలుంటుందని పేర్కొన్నారు.

# ట్రంప్ టారిఫ్ బాంబ్..

## భారత్‌లో ఈ రంగాలపై ఎఫెక్ట్

అంచనాలను మించి భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. న్యూఢిల్లీ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. సుంకాల మోత మోగించారు. అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 27% సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోకి కొన్ని రంగాలపై కీలక ప్రభావం పడనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ, ఫార్మా ఉత్పత్తులపై ఎఫెక్ట్ ఉండనున్నట్లు పేర్కొంటున్నారు. మరి ఆ రంగాలు ఏంటంటే..?



వ్యవసాయం, డెయిరీ, సీఫుడ్..

గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ శ్లేషణ ప్రకారం.. ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమతులపై అత్యధిక ప్రభావం ఉండనున్నట్లు తెలుస్తోంది. భారత రొయ్యలు, ఇతర సీఫుడ్ ఉత్పత్తులకు యూఎస్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అగ్రరాజ్య మార్కెట్లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో గిరాకీ ఆశించిన మేర ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం.

రంగాల వారీగా ఉత్పత్తులపై సుంకాలు భిన్నంగా ఉంటాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో మన డెయిరీ ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరనున్నాయి. దీంతో అగ్రరాజ్యంలో మన వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు కూడా పెరుగుతాయి. భారత్ నుంచి అమెరికాకు 181.49 మిలియన్ డాలర్ల డెయిరీ ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది.

టెక్స్‌టైల్స్, బంగారం..

భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. తాజా పెంపుతో వీటిపై సుంకం 13.32 శాతానికి చేరనుంది. దీంతో అమెరికాలో ఆభరణాల ధరలు పెరగనున్నాయి. ఇక, జౌళి పరిశ్రమ పైనా అధిక ప్రభావమే పడనుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. మనం చేసే మొత్తం టెక్స్‌టైల్ ఎగుమతుల్లో 28 శాతం అమెరికాకే వెళుతున్నాయి

చెప్పులపైనా..

పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం ఉండనుంది. మన దేశం నుంచి 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు యూఎస్‌కు ఎగమతి అవుతున్నాయి. వీటిపై అమెరికా-భారత్ మధ్య సుంకాల వ్యత్యాసం 15.56 శాతంగా ఉంది. దీంతో అగ్రరాజ్య మార్కెట్లో మన చెప్పుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దీంతో కస్టమర్లు ఇతర దేశాల ఉత్పత్తులను ప్రత్యామ్నాయంగా ఎంచుకునే అవకాశం ఉంది.


ఎలక్ట్రానిక్స్..

ఎలక్ట్రానిక్స్, టెలికాం రంగాన్ని చూస్తే.. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యాయి. ఇప్పుడు సుంకాల పెంపుతో యూఎస్ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ఇక, బాయిలర్లు, టర్బైన్స్, కంప్యూటర్ల వంటి ధరలు కూడా ప్రియమవుతాయి.

# జీబ్లీ స్టైల్‌లో మహీంద్రా ఫొటో..

## స్పందించిన వ్యాపార దిగ్గజం

సోషల్‌మీడియా ఓపెన్ చేయగానే జీబ్లీ ఇమేజ్‌లు దర్శనమిస్తున్నాయి. ఓపెన్ ఏఐ సంస్థ ఇటీవల చాట్‌జీపీటీలో జీబ్లీ స్టూడియోను ప్రవేశపెట్టినప్పటినుంచి ఈ సదుపాయాన్ని నెటిజన్లు ఎక్కువగా వినియోగిస్తున్నారు. దేశాధినేతలు, నాయకుల చిత్రాలకు యానిమేషన్ రూపం ఇస్తూ కార్టూన్ తరహా ఫొటోలను సృష్టిస్తున్నారు. తాజాగా ఓ యూజర్ ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఫొటోను జీబ్లీ స్టైల్‌లో క్రియేట్ చేసి 'ఎక్స్' వేదికగా పంచుకున్నాడు. దీన్ని చూసి అవాక్కైన మహీంద్రా ఆ ఫొటోను తన పోస్ట్‌లో షేర్ చేశారు. 'ఈ జీబ్లీ ఇమేజ్‌లను ఎలా రూపొందించాలో నేర్చుకోవాలి' అని వ్యాఖ్యలు జోడించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారుతోంది.



# పీపీఎఫ్‌లో నామినీ మార్పునకు

## ఛార్జీలుండవ్.. ఆర్థిక మంత్రి ప్రకటన

చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఒకటైన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ) ఖాతాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఓ నోటిఫికేషన్ ఇచ్చింది. పీపీఎఫ్‌లో నామినీ మార్పునకు ఇకపై ఛార్జీలుండవని అందులో పేర్కొంది. "పీపీఎఫ్ ఖాతాలకు సంబంధించి నామినీ వివరాలను మార్చుకోవడానికి ఆర్థిక సంస్థలు రుసుము వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ ఛార్జీలను తొలగించేందుకు జీవో తీసుకువచ్చాం. ఇటీవల ఆమోదం పొందిన బ్యాకింగ్ సవరణ బిల్లు ప్రకారం.. నలుగురు నామినీలను చేర్చుకునేందుకు వీలుంది" అని కేంద్రమంత్రి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పోస్టు పెట్టారు.




# ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్..

## నష్టాల్లో భారత మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో కొనసాగుతున్నాయి. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించారు. భారత్‌పై 27 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రకటనతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 500 పాయింట్లు నష్టంతో.. నిఫ్టీ 23,200 కింద ట్రేడింగ్ మొదలుపెట్టింది. ప్రస్తుతం ఆ నష్టాల నుంచి కొంత బయటపడినా.. ఇంకా ఒత్తిడిని ఎదుర్కొంటూనే ఉన్నాయి.

ఉదయం 10.43 గంటల సమయంలో సెన్సెక్స్ 204 పాయింట్లు నష్టంతో 76,412.87 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ ( 852.85 పాయింట్ల నష్టంతో 23,280.85 వద్ద కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఎంఅండ్ఎం, జొమాటో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు మాత్రమే లాభాల్లో కదలాడుతున్నాయి.

ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఆసియా మార్కెట్లపై తీవ్రంగా పడింది. గురువారం ఉదయం జపాన్ నిక్కీ ఏకంగా 3.4 శాతానికి పైగా కుంగింది. ప్రస్తుతం 2.95 శాతం నష్టంతో ట్రేడవుతోంది. ఈ దేశంపై అమెరికా అధ్యక్షుడు 24 శాతం సుంకాలు విధించారు. ఇక ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ సూచీ 1.03 శాతం, హాంకాంగ్ హాంగెసెంగ్ 1.62 శాతం, షాంఘై 0.34 మేర నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ట్రంప్ ప్రకటనకు ముందు అమెరికా మార్కెట్లు స్వల్ప లాభాలు దక్కించుకున్నాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.7శాతం, డోజోన్స్ 0.6శాతం, నాస్‌డాక్ 0.9శాతం మేర లాభపడ్డాయి. అయితే, టారిఫ్‌లపై నిర్ణయం వెల్లడించగా.. అమెరికా ఫ్యూచర్ మార్కెట్లు కుదేలయ్యాయి.



అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 73.31 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 3,172 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు ( బుధవారం నికరంగా రూ. 1,539 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు (నికరంగా రూ. 2,809 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.

## ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచ మార్కెట్లు షేక్.. గోల్డ్ కొత్త రికార్డ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై సుంకాలతో విరుచుకుపడ్డారు. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టంచేశారు. ట్రంప్ ప్రకటన)తో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా సహా అన్ని ప్రధాన మార్కెట్లు పతనమవుతున్నాయి.

ఆసియా మార్కెట్లు షేక్..

ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఆసియా మార్కెట్లపై తీవ్రంగా పడింది. గురువారం ఉదయం జపాన్ నిక్కీ ఏకంగా 3.4 శాతానికి పైగా కుంగింది. ఈ దేశంపై అమెరికా అధ్యక్షుడు 24శాతం సుంకాలు విధించారు. ఇక, దక్షిణకొరియా కోస్పీ 1.9శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ సూచీ 1.8శాతం మేర నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. భారత మార్కెట్లు కూడా గురువారం నష్టాలతో ప్రారంభమయ్యే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

అమెరికా మార్కెట్ల పరిస్థితి ఇలా..

ట్రంప్ ప్రకటనకు ముందు అమెరికా మార్కెట్లు స్వల్ప లాభాలు దక్కించుకున్నాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.7శాతం, డోజోన్స్ 0.6శాతం, నాస్‌డాక్ 0.9శాతం మేర లాభపడ్డాయి. అయితే, టారిఫ్‌లపై నిర్ణయం వెల్లడించగా.. అమెరికా ఫ్యూచర్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఎస్అండ్‌పీ 500 ఫ్యూచర్స్ సూచీ 3 శాతం మేర పడిపోయింది. ఫ్యూచర్స్‌లో డోజోన్స్ 2 శాతం, నాస్‌డాక్ 4శాతం మేర కుంగాయి. దీంతో గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) నాటి ట్రేడింగ్‌లో అక్కడి మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకుంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

కొత్త రికార్డుకు పసిడి..

టారిఫ్‌ల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా ప్రపంచ మార్కెట్లు తీవ్ర ఊగిసలాడుతున్నాయి. దీంతో బంగారం లో పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు.

భారత శక్తి



# ‘మీరు త్వరగా కోలుకోవాలి’..: అగ్ర హీరో ఫ్యాన్స్‌పై నిర్మాత సతీమణి ఫైర్



%ముంబయి: బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘సికందర్’ ). ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈద్ కానుకగా విడుదలై మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. దీంతో చిత్ర నిర్మాత సాజిద్ నదియావాలాపై సల్మాన్ ఖాన్ ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ హీరో కెరీర్‌ను నిర్మాత నాశనం చేస్తున్నారంటూ విమర్శలు చేస్తున్నారు. దీనిపై సాజిద్ నదియావాలా సతీమణి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. అభిమానుల తీరును ప్రశ్నించారు.

సల్మాన్ నటించిన గత చిత్రాలు పరాజయం అందుకోవడంతో అభిమానులందరూ ‘సికందర్’పై నమ్మకాలు పెట్టుకున్నారు. ఈ సినిమా అయినా తమ హీరోకు బ్లాక్ బస్టర్ ఇస్తుందని భావించారు. ‘సికందర్’ తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందని సాజిద్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పడంతో అభిమానుల ఆశలు మరింత పెరిగాయి. తీరా సినిమా విడుదలయ్యాక వారికి నిరాశే మిగిలింది. కథ, కథనం, దర్శకత్వం సరిగ్గా లేదని సినీ విశ్లేషకులు విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే వారు ఎక్స్ వేదికగా సాజిద్‌ను తిడుతూ పోస్టులు పెడుతున్నారు. ఆయన సతీమణి వార్దాఖాన్ స్పందిస్తూ.. అభిమానుల పోస్టులను రీపోస్ట్ చేశారు. అంతేకాకుండా, వారిని తిడుతూ కామెంట్స్ కూడా పెట్టారు. ‘విమర్శలను ఈవిధంగా రీపోస్ట్ చేస్తున్నందుకు మీకు ఏమాత్రం సిగ్గుగా లేదా?’ అని ఓ నెటిజన్ ప్రశ్నించగా.. ‘మీరు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా’ అని రిప్లై ఇచ్చారు. అనంతరం ఆమె ఆయా కామెంట్స్‌ను డిలీట్ చేశారు.

బీటౌన్‌లోని స్టార్ నిర్మాతల్లో సాజిద్ నదియావాలా ఒకరు. అక్షయ్‌కుమార్, సల్మాన్‌ఖాన్, టైగర్ ష్రాఫ్ వంటి హీరోల చిత్రాలను ఆయన ఎక్కువగా నిర్మిస్తుంటారు. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన ‘జుడ్వా’, ‘హర్ దిల్ జో ప్యార్ కరేగా’, ‘కిక్’ చిత్రాలను నిర్మించింది ఆయనే. ‘సికందర్’ చిత్రంలో సల్మాన్‌కు జంటగా రష్మిక నటించారు. కాజల్, సత్యరాజ్ కీలకపాత్రలు పోషించారు.

# నవ్వించిన సినిమాదే విజయం





విరామం ఎప్పుడొచ్చిందో గుర్తు లేనట్టుగా... శుభం కార్డు అప్పుడే పడిపోయిందా అని ఆశ్చర్యపోయేట్టుగా చేస్తుంటాయి కొన్ని సినిమాలు. మరికొన్ని మాత్రం ఎంతకీ పూర్తవ్వడం లేదేమిటి అనిపిస్తూ... శుభం కార్డు కోసం థియేటర్‌లో నిరీక్షించేలా చేస్తుంటాయి. హిట్ సినిమాకీ... ఫ్లాప్ సినిమాకీ మధ్య తేడా అదే! కాలానిది మాత్రం ఎప్పుడూ హిట్ సినిమా పంథానే. చూస్తుండగానే గిర్రున తిరిగిపోతూ... రోజుల్ని ఇట్టే కరిగించేస్తుంది. సంక్రాంతి సినిమాల ఊసులు నిన్న మొన్ననే మాట్లాడుకున్నట్టుంది. అప్పుడే వేసవి సీజన్ షురూ అయ్యింది. ఈ మధ్యలో మూడు నెలలు ఉఫ్! ఎలా గడిచిపోయిందో చిత్రసీమ వెనక్కి తిరిగి చూసుకునే సమయం రానే వచ్చింది.

ఒకొక్క నెలలో పదుల సంఖ్యలో సినిమాలు... అందులో ఒకట్రెండు మాత్రమే విజయాలు. దాదాపు ప్రతి నెలా ఈ రకమైన ఫలితాలే! ఏటా పది శాతానికి మించి విజయాలు సాధించని తెలుగు చిత్రసీమ ప్రయాణం ఎప్పట్లాగే కొనసాగుతోందని చెప్పడానికి నిదర్శనం ఇదే! అనువాదాలతో కలుపుకుంటే ఈ మూడు నెలల కాలంలో డెబ్బైకి పైగా సినిమాలు విడుదలయ్యాయి. నిర్మాతలకి, పంపిణీదారులకి లాభాల్ని తెచ్చిపెట్టిన సినిమాలు మాత్రం ఐదులోపే!

వసూళ్లే వసూళ్లు...

సంక్రాంతి అంటే సినిమాలకీ పండగే. కొత్త చిత్రాలు వరుస కడతాయి. బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల జోరు కొనసాగుతుంది. ఈసారి కూడా భారీ అంచనాల మధ్య సంక్రాంతి సీజన్ షురూ అయ్యింది. అగ్ర కథానాయకుల చిత్రాలు విడుదలయ్యాయి. అంచనాలకు తగ్గట్టే దాదాపు రూ.600 కోట్లు వసూలు చేశాయి ఆయా సినిమాలు. తెలుగు సినీ ప్రేమికుడి అభిరుచికి అద్దం పట్టేవే ఈ లెక్కలు. అయితే భారీ నిర్మాణ వ్యయాల కారణంగా విజయాలు మాత్రం అన్ని సినిమాలకీ దక్కలేదు. జనవరి నెలలో దాదాపు 25 సినిమాలు విడుదలయ్యాయి. అనువాదాలతో కలుపుకుంటే ఆ లెక్క ఎక్కువే. తొలి వారం నుంచే కొత్త సినిమాలు విడుదలైనా, రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం ‘గేమ్ ఛేంజర్’ నుంచే అసలైన సందడి మొదలైంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, అదే స్థాయి అంచనాల మధ్య విడుదలైంది. క్రేజ్‌కి తగ్గట్టుగా ప్రారంభ వసూళ్లు వచ్చాయి కానీ, ఆ తర్వాత సినిమా ఏ రకంగానూ ప్రేక్షకుల్ని మెప్పించలేక పరాజయాన్ని చవిచూసింది. ఈసారి సంక్రాంతికి విడుదలైన రెండో చిత్రం బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన ‘డాకు మహారాజ్’. భారీ బడ్జెట్‌తోనే రూపొందిన ఈ సినిమా స్టైలిష్ మేకింగ్‌తో ప్రేక్షకుల్ని మెప్పించింది. సంక్రాంతి సినిమాల్లో చివరిగా వచ్చి, వసూళ్లు కొల్లగొట్టిన చిత్రం... ‘సంక్రాంతికి వస్తున్నాం’( ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించి, అసలైన పండగ సినిమా అనిపించింది. రూ.300 కోట్లకుపైగా వసూళ్లు సాధించి, అగ్ర కథానాయకుడు వెంకటేశ్ (%ఎవఅన్ఖ్వంష్త్ర%) కెరీర్‌లోనే అతి పెద్ద విజయంగా నిలిచింది. అనిల్ రావిపూడి ఈ చిత్రానికి దర్శకుడు. ఓవర్సీస్ మార్కెట్‌లో 3 మిలియన్ల డాలర్లు కొల్లగొట్టి లాభాల పంట పండించింది. సంక్రాంతి సినిమాల జోరుతో ఈ నెలలో ఆ తర్వాత చెప్పుకోదగ్గ సినిమాలు రాలేదు. చివర్లో విశాల్ నటించిన అనువాద చిత్రం ‘మదగజరాజా’ విడుదలైనా, సరైన ప్రచారం లేక పెద్దగా ఫలితాల్ని రాబట్టలేకపోయింది.

‘తండేల్’ జోరు...

ప్రేమికుల రోజుని పురస్కరించుకుని కొన్ని సినిమాలు విడుదలవుతాయి తప్ప, అగ్ర తారల సినిమాలు అరుదుగానే వస్తుంటాయి. ఈసారి దాదాపు 14 చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. తొలి నెలలో మామ వెంకటేశ్ మెరిపించగా, రెండో నెలలో ఆయన మేనల్లుడు నాగచైతన్యఆ బాధ్యతని తీసుకున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన ‘తండేల్’ ( ఫిబ్రవరి 7న విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించింది. రూ.వంద కోట్లు వసూళ్ల మైలురాయిని అందుకుంది. మూడో వారంలో విడుదలైన ప్రదీప్ రంగనాథన్ నటించిన ‘డ్రాగన్’ యువతరాన్ని ఆకట్టుకుంది. ‘లైలా’, ‘బ్రహ్మా ఆనందం’, ‘మజాకా’ తదితర చిత్రాలు మంచి ప్రచారం మధ్య విడుదలైనా ఫలితాల్ని మాత్రం రాబట్టలేకపోయాయి.

రెండు హిట్లొచ్చాయి...

మార్చి నెల నుంచే టాలీవుడ్‌లో వేసవి సీజన్ మొదలవుతుంది. ‘సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు’, ‘ఎవడే సుబ్రమణ్యం?’ చిత్రాల రీ రిలీజ్‌లు సహా, అనువాదాలతో కలుపుకుంటే 30కిపైగా సినిమాలు విడుదలయ్యాయి. అంటే రోజుకొక సినిమా విడుదలైనట్టు. అందులో ‘రాబిన్‌హుడ్’, ‘మ్యాడ్ స్క్వేర్’, ‘కోర్ట్’, ‘దిల్‌రూబా’, ‘షణ్ముఖ’, ‘పెళ్లికాని ప్రసాద్’ తదితర చిత్రాలు కీలకంగా కనిపించాయి. కానీ బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లని సొంత చేసుకున్నవి ‘మ్యాడ్ స్క్వేర్’, ‘కోర్ట్’ చిత్రాలు మాత్రమే. విజయవంతమైన ‘మ్యాడ్’కి కొనసాగింపుగా సితార సంస్థ నుంచి వచ్చిన చిత్రమే ‘మ్యాడ్ స్క్వేర్’ ). లాజిక్ లేకుండా నవ్విస్తున్న ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. పోక్సో చట్టంతో ముడిపడిన ప్రేమకథతో రూపొందిన ‘కోర్ట్’ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. కథానాయకుడు నాని సమర్పించిన చిత్రమిది. ప్రియదర్శి కథానాయకుడిగా, రామ్ జగదీశ్ దర్శకత్వంలో తెరకెక్కింది. జీవీ ప్రకాశ్ ‘కింగ్‌స్టన్’, మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్‌ల ‘ఎల్2 ఎంపురాన్’, విక్రమ్ ‘వీర ధీర శూర’ తదితర అనువాద చిత్రాలు ఈ నెలలోనే విడుదలయ్యాయి.



# తక్కువ సినిమాలు చేయడానికి కారణమిదే: బొమ్మరిల్లు భాస్కర్

: సిద్ధూ జొన్నలగడ్డ ప్రధాన పాత్రలో బొమ్మరిల్లు భాస్కర్ తెరకెక్కిస్తోన్న చిత్రం ‘జాక్’ . వైష్ణవి చైతన్య కథానాయిక. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో మూవీ టీమ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ విశేషాలు మీకోసం..

జాక్ పాత్ర గురించి ఆడియన్స్‌కు చెప్పండి?

సిద్ధూ: టిల్లును ఆదరించినట్లే జాక్‌ను కూడా ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఇందులో నా శైలిలో చాలా డైలాగులు చెప్పాను. టిల్లుని మర్చిపోతారని చెప్పలేను. కానీ.. జాక్ మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోతాడు. కొన్ని సన్నివేశాలు హాలీవుడ్ రేంజ్‌లో ఉంటాయి.

బేబీలో మీ పాత్ర బాగా కనెక్ట్ అయింది.. ఇందులో ఎలా ఉంటుంది?

వైష్ణవి: ఆసక్తిగా ఉంటుంది. బేబీలో ఉన్నట్లు హీరోను ఏడిపించే పాత్ర కాదు.

మీ సినిమాల్లో జీవితానికి సంబంధించిన ఓ లైన్ ఉంటుంది? ఇందులో కూడా ఏమైనా చెప్పారా?

భాస్కర్: కచ్చితంగా ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు లైఫ్‌కు సంబంధించిన డైలాగులు కూడా ఉంటాయి. ఈ స్క్రిప్ట్‌లో సిద్ధూ కూడా భాగమయ్యారు.

సిద్ధూతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

భాస్కర్: ఆయనతో వర్క్ చేయడం ఏ దర్శకుడికైనా చాలా సులభం. త్వరగా అర్థం చేసుకుంటాడు. మల్టీ టాలెంటెడ్ హీరో.

ట్రైలర్‌లో చూస్తే సినిమాలో అసభ్య పదాలు ఉన్నాయనిపిస్తోంది.. ఉన్నాయా?

సిద్ధూ: డైలాగులకు అవసరం కాబట్టి వాడాం. హీరోకు బాగా కోపం వచ్చినప్పుడు చెప్పే డైలాగుల్లో కొన్ని పదాలు వాడాం.

ఈ సినిమాకు ముగ్గురు మ్యూజిక్ డైరెక్టర్స్‌తో ఎందుకు వర్క్ చేశారు?

భాస్కర్: నాకుసంగీతం అంటే ఇష్టం. ప్రతి సినిమాకు సంగీత దర్శకుడిని మారుస్తాను. అందరితో చేయాలనిపిస్తుంది. అందుకే ఈ సినిమాకు ముగ్గురితో వర్క్ చేశాను.

సిద్ధూతో వర్క్ చేయడానికి కష్టపడ్డారా?

వైష్ణవి: జాక్‌లో అవకాశం రాగానే భయపడ్డాను. సిద్ధూ ఎనర్జీతో పోటీ పడడానికి చాలా కష్టపడ్డాను.

ఫ్యామిలీతో కలిసి ఈ సినిమా చూడొచ్చా?

భాస్కర్: ఒకటి, రెండు పదాలు మినహాయిస్తే పూర్తి వినోదాత్మక చిత్రమిది. ప్రతిఒక్కరిలో జాక్ ఉంటాడు. అందుకే ఇది అందరికీ కనెక్ట్ అవుతుంది.

ఆరెంజ్ సినిమా సమయానికి ఇప్పటికీ సిద్ధూలో ఏమైనా మార్పులు వచ్చాయా?

భాస్కర్: ఆయన టాలెంట్ ‘ఆరెంజ్’ సమయంలోనే అర్థమైంది. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానానికి వెళ్తాడు.

ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్లు అవుతోంది. చాలా తక్కువ సినిమాలు చేయడానికి కారణం?

భాస్కర్: నేను రైటింగ్‌కు ఎక్కువ సమయం తీసుకుంటాను. అందుకే ఆలస్యం అవుతుంది.

దీనికి సీక్వెల్ వస్తుందా?

భాస్కర్: కంటెంట్ అయితే సిద్ధంగా ఉంది.

సిద్ధూ: జాక్, జాక్ ప్రో, జాక్‌ప్రో మాక్స్.. ఇలా రాశారు.

# పెళ్లి వార్తలపై యాంకర్ ప్రదీప్ క్లారిటీ



హైదరాబాద్: బుల్లితెర వేదికగా ప్రసారమయ్యే ఎన్నో కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరించి తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు ప్రదీప్ మాచిరాజు . ఆయన పెళ్లి గురించి గత కొన్ని రోజులుగా నెట్టింట ప్రచారం జరుగుతోంది. ఓ ప్రజాప్రతినిధితో ఆయన పెళ్లి జరగనుందని ఇటీవల వార్తలు వచ్చాయి. ఆయా కథనాలను ఉద్దేశించి తాజాగా ప్రదీప్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సమయం వచ్చినప్పుడు తాను పెళ్లి చేసుకుంటానని అన్నారు.


“పెళ్లికి సంబంధించి ఏమీ ప్లాన్ చేయలేదు. జీవితంలో సెటిల్ కావాలనుకున్నా. నాకంటూ కొన్ని డ్రీమ్స్, టార్గెట్స్ ఉన్నాయి. ముందు వాటిని సాధించాలని నిర్ణయించుకున్నా. అవి కాస్త ఆలస్యం కావడంతో మిగిలిన విషయలు కూడా కాస్త టైమ్ పడుతూ వచ్చాయి. కాకపోతే, అవన్నీ సరైన సమయానికే పూర్తి అవుతాయని నమ్ముతున్నా” అని ప్రదీప్ తెలిపారు. అనంతరం రాజకీయ నాయకురాలితో తన పెళ్లి అంటూ జరిగిన ప్రచారంపై మాట్లాడుతూ.. “ఆ వార్తలు నేనూ విన్నా. అంతకుముందు రియల్ ఎస్టేట్ కుటుంబానికి చెందిన అమ్మాయితో పెళ్లి అన్నారు. త్వరలో క్రికెటర్‌తో పెళ్లి అంటారేమో. అవన్నీ సరదా ప్రచారాలు మాత్రమే” అని బదులిచ్చారు.

ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రదీప్ నటించిన తాజా చిత్రం ‘అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి’. నితిన్– భరత్ దర్శకత్వం వహించిన ఈ మూవీ ఏప్రిల్ 11న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేశారు. తన తల్లి చేతులమీదుగా ట్రైలర్ విడుదల చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ప్రదీప్ తెలిపారు. “ట్రైలర్ విడుదల గురించి అమ్మకు ముందే చెప్పాను. కాకపోతే ఆమె అందుకు అంగీకరించలేదు. ఆమె ఎప్పుడూ కెమెరా ముందుకురాలేదు. నా ఇష్టాన్ని కాదనలేక చివరకు అంగీకరించారు. మా ట్రైలర్ ఇప్పుడు ట్రెండింగ్‌లో దూసుకెళ్తోంది” అని చెప్పారు. తమ చిత్రానికి పవన్‌కల్యాణ్ సినిమా టైటిల్ పెట్టడంపై స్పందిస్తూ.. కథకు అనుగుణంగానే టైటిల్ పెట్టామన్నారు. టైటిల్ తనపై బాధ్యతను పెంచిందని చెప్పారు.

## జీవితమంతా పని చేయాలని అనుకుంటున్నా: కరీనా కపూర్

వయసు అనేది ఒక సంఖ్య మాత్రమేనన్నారు బాలీవుడ్ నటి కరీనాకపూర్. జీవితమంతా పని చేయాలనుందన్నారు. తాజాగా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె నటనను, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేయడం గురించి మాట్లాడారు. ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటేనే చిత్ర పరిశ్రమలో అవకాశాలు వస్తాయని చెప్పారు.

“నా దృష్టిలో వయసు ఓ సంఖ్య మాత్రమే. వృద్ధాప్యం వల్ల ఎదురయ్యే ఏ సమస్యనైనా ఎదుర్కోవడానికి నేను ఫిట్‌గా ఉండాలనుకుంటున్నాను. 75 ఏళ్ల వయసులో సెట్స్‌కు వెళ్లాల్సి వచ్చినా ఆలోచించకుండా వెళ్లగలగాలి. నా మనవరాళ్లను ఎత్తుకోవడానికి వంగ గలగాలి. నా జీవితమంతా పని చేయాలి. అందంగా ఉండడానికి ట్రీట్‌మెంట్లు తీసుకొనే బదులు ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకుంటూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటే సరిపోతుంది. ఇష్టమైన ఆహారం తీసుకోవడంలో వెనకడుగు వేయను. నా టీనేజ్‌లో అసలు డైట్ పాటించలేదు. ఇప్పటికీ మూడు రోజులకు మించి కిచిడి తినకుండా ఉండలేను. దానికి తగినట్లు వ్యాయామం చేస్తాను. ప్రతి స్త్రీ తన జీవితాన్ని తనకు నచ్చినట్లు జీవించాలి. ఆత్మవిశ్వాసంతో ఉండాలి. భరోసాతో ముందుకుసాగాలి. మనపై మనకు నమ్మకం ఉంటేనే ఇతరులకు మార్గదర్శకంగా ఉంటాం” అని చెప్పారు.



# శుక్లాల ఆపరేషనా? జాగ్రత్తలు పాటించాలి

శు క్లాల సమస్య గలవారికి మబ్బుగా అయిన కంటి సహజ కటకాన్ని (కాటరాక్ట్) తొలగించి దాని స్థానంలో కృత్రిమ కటకాన్ని (ఇంట్రాఆక్యులర్ లెన్స్) అమర్చుతారు. చాలామంది దీన్నుంచి త్వరగానే కోలుకుంటారు. అయినప్పటికీ సర్జరీ అనంతరం కొన్ని రోజుల పాటు తగు జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.

కంటి సంరక్షణ: చేతులతో కంటిని రుద్దొద్దు. తెలిసో తెలియకో కంటిని రుద్దితే కుట్లు వదలవ్వొచ్చు. కుట్లు లేని సర్జరీ అయినా కూడా చేత్తో రుద్దితే నయం కావటం ఆలస్యం కావొచ్చు. ఇది ఇన్‌ఫెక్షన్‌కూ దారితీయొచ్చు. ఒకవేళ కంటి నుంచి నీరు కారుతున్నా, దురద పెడుతున్నా శుభ్రమైన గుడ్డతో లేదా తడి దూది ఉండతో నెమ్మదిగా తుడుచుకోవాలి. ప్రకాశవంతమైన వెలుగు, ఎండ, దుమ్ముధూళి కంట్లో పడకుండా చలువ కళ్లద్దాలు ధరించాలి. నిద్రిస్తున్నప్పుడు తెలియకుండా కంటిని రుద్దుకోకుండా చూడటానికి వారం వరకూ కంటి మీద రక్షణ షీల్డ్ పెట్టుకోవాలి.

తల స్నానం వద్దు: సర్జరీ అయ్యాక తొలి 10 రోజుల వరకూ తల స్నానం చేయొద్దు. చుబుకం కింది నుంచే స్నానం చేయాలి. తడి తువ్వాలుతో ముఖం తుడుచుకోవాలి. తొలి పది రోజుల వరకూ మామూలు నీటితో ముఖం కడుక్కోవద్దు. నేరుగా కళ్లలోకి సబ్బు, షాంపూ, నీరు వెళ్లకుండా చూసుకోవాలి. సర్జరీ అయిన కంటిని నేరుగా తాకొద్దు.

దెబ్బ తగలనీయొద్దు: కంటిని దెబ్బతీయగల పనులేవీ చేయొద్దు. దెబ్బలు తగలటం, ఇన్‌ఫెక్షన్లు తలెత్తకుండా చూసుకోవటానికి నెల వరకూ పిల్లలతో ఆడుకోవటం, ఈత కొట్టటం వంటి వాటికి దూరంగా ఉండాలి.

బరువులు ఎత్తొద్దు: నెల వరకూ మరీ బరువైన వస్తువులు ఎత్తొద్దు. వీలున్నంతవరకూ గట్టిగా దగ్గటం, తుమ్మటం, విసర్జన సమయంలో ముక్కటం, ముందుకు వంగటం వంటివి చేయొద్దు. ఇలాంటివి కంట్లో ఒత్తిడి పెరిగేలా చేస్తాయి.

మందులు సక్రమంగా: చూపు మెరుగుపడినట్టు అనిపించినా కూడా డాక్టర్ చెప్పినట్టుగా కంటి చుక్కల మందును క్రమం తప్పకుండా వాడుకోవాలి.

సమస్యలను గమనించాలి: తీవ్రమైన నొప్పి, చూపులో మార్పులు, కంట్లో మిరుమిట్లు, ఎరుపు ఎక్కువగా అవటం, వికారం, వాంతి, దగ్గు మరీ ఎక్కువగా రావటం వంటివి గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

డాక్టర్ సలహా తర్వాతే డ్రైవింగ్: సర్జరీ నుంచి కోలుకున్నాక డాక్టర్‌ను సంప్రదించిన తర్వాతే వాహనం నడపాలి. శుక్లాల ఆపరేషన్ అనంతరం ప్రపంచం కాస్త ప్రకాశవంతంగా కనిపించొచ్చు. చలువ కళ్లద్దాలు, డ్రైవింగ్ కళ్లద్దాలు ధరించటం ద్వారా హెడ్‌లైట్ల వెలుగు అంతగా కళ్లలోకి వెళ్లకుండా చూసుకోవచ్చు.

చేసుకోదగినవివి

శుక్లాల సర్జరీ అయిన మూడు రోజుల తర్వాత షేవింగ్ చేసుకోవటం మొదలెట్టొచ్చు.

టీవీ చూడటం వంటి పనులను రెండు, మూడు రోజుల తర్వాత చేయొచ్చు. వారం అనంతరం తేలికైన ఇంటి పనులన్నీ చేసుకోవచ్చు.

చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలి. సబ్బు, నీటితో చేతులను కడుక్కోకుండా కళ్లను తాకొద్దు.


శుభ్రమైన వేడి నీటిలో దూదిని అద్ది రోజుకు రెండు మూడు సార్లు కళ్లను శుభ్రం చేసుకోవాలి.

# కొన్ని రకాల రొమ్ముక్యాన్సర్లకు సర్జరీ ఆలస్యమైతే ప్రమాదమే

సాధారణంగా హార్మోన్ రిసెప్టర్-పాజిటివ్, హెచ్ఈఆర్2 నెగెటివ్ రకం రొమ్ము క్యాన్సర్లకు ముందుగా సర్జరీ చేస్తుంటారు. వీటికి సర్జరీని వాయిదా వేయొద్దని, ఆలస్యమైనకొద్దీ క్యాన్సర్‌తో మరణించే ముప్పు పెరుగుతోందని యూనివర్సిటీ ఆఫ్ ఓక్లహామా కాలేజ్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు గుర్తించారు. ఈ ముప్పు 42 రోజుల నుంచి మొదలవుతుండగా.. 60 రోజులు గడిచేసరికి 21%, 90 రోజులకు 79%, 120 రోజులకు 183% వరకూ ఎగబాకుతుండటం గమనార్హం. ఇది చాలా ముఖ్యమైన విషయమని అధ్యయనానికి నేతృత్వం వహించిన టేక్‌మీ టనక చెబుతున్నారు. ఎందుకంటే 42 రోజులు చాలా త్వరగా గడచిపోతాయి. అయితే ఈ క్యాన్సర్లకు చికిత్స ఆలస్యం కావటం పెరుగుతున్నట్టు ఇటీవలి అధ్యయనాలు చెబుతుండటం ఆందోళనకరమని వివరిస్తున్నారు. కొన్నిసార్లు క్యాన్సర్ నిర్ధరణ అయ్యాక ఆపరేషన్ ముందు ప్రక్రియకు చాలా రోజులు పట్టొచ్చు. ఇంటి పనులు, కుటుంబ బాధ్యతల పేరుతో క్యాన్సర్ బాధితులు సర్జరీ తేదీని వాయిదా వేయొచ్చు. కొందరు మరో డాక్టర్ సలహా తీసుకోవటానికి సమయం తీసుకోవచ్చు. ఒకవేళ సర్జరీ అనంతరం కీమోథెరపీ అవసరమైతే సంతానాన్ని కనే వయసులో



ఉన్నవారు అండాలను భద్రపరచుకోవాలని అనుకోవచ్చు. అయితే ఇలాంటి క్యాన్సర్లకు వీలైనంత త్వరగా సర్జరీ చేయటమే మంచిదని తాజా అధ్యయనం సూచిస్తోంది. రొమ్ముక్యాన్సర్ గలవారిలో చాలామందికి 60 రోజుల్లోపే సర్జరీ చేయాలని కమిషన్ ఆన్ క్యాన్సర్ 2022లో సిఫారసు చేసిందని, కానీ కొందరికి అంతకన్నా ముందే సర్జరీ అవసరపడొచ్చని టనక చెబుతున్నారు. చికిత్స ఆలస్యం కావటం వల్ల తలెత్తే విపరీత పరిణామాలను ప్రజలు అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇంతకీ ఇలాంటి రకం క్యాన్సర్లకు చికిత్స ఆలస్యమైతే మరణించే ముప్పు ఎందుకు పెరుగుతోంది? అప్పటికే లోపలికి చొచ్చుకెళ్లిన క్యాన్సర్ల మాదిరిగా కాకుండా ఇవి నెమ్మదిగా వృద్ధి చెందటం, మార్పు చెందటానికి మరింత ఎక్కువ అవకాశముండటం ఒక కారణం కావొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. బయాప్సీ మూలంగా తలెత్తిన వాపు ప్రక్రియ ప్రతిస్పందన కణితిని వృద్ధి చెందేలా చేయొచ్చనీ అనుకుంటున్నారు. బయాప్సీ అనంతరం ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులు వాపు ప్రక్రియను అణచి పెడుతున్నట్టు టనక గత సంవత్సరం ఎలుకల మీద నిర్వహించిన ప్రయోగంలో నిరూపించారు.



# పక్షవాతం బాధితులకు ప్రచోదన హుషారు




మెదడులో ఆయా భాగాలను పుర్రె వెలుపలి నుంచి విద్యుత్ ప్రచోదనంతో ప్రేరేపించటం ద్వారా కొన్ని పక్షవాత అనంతర లక్షణాలు తగ్గే అవకాశముందని సిరాకస్ యూనివర్సిటీ అధ్యయనంలో బయటపడింది. పక్షవాతం తర్వాత మాట్లాడటం, అర్థం చేసుకోవటం, చదవటం, రాయటంలో ఇబ్బంది పడుతున్నవారిని పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. వీరికి కనీసం మూడు రోజుల విరామం చొప్పున రెండు సెషన్ల పాటు ట్రాన్స్‌క్రేనియల్ డైరెక్ట్ కరెంట్ స్టిమ్యులేషన్ (టీడీసీఎస్) పరికరంతో విద్యుత్ ప్రచోదనాన్ని ప్రసారం చేశారు. ఈ పరికరం నొప్పి లేకుండా, కోత అవసరం లేకుండానే మెదడులోకి ప్రచోదనాన్ని పంపిస్తుంది. ముందుగా వీరికి ఏకాగ్రత పరీక్ష పెట్టి ఈ చికిత్స చేశారు. ఈఈజీ పరికరంతో మెదడు పనితీరును నమోదు చేశారు. కంటిపాప సైజును పరిశీలించారు. చికిత్స తర్వాత మరోసారి ఏకాగ్రత పరీక్ష నిర్వహించారు. జ్ఞాపకశక్తి, భాష, ప్రణాళిక వంటి కార్య నిర్వహణ సామర్థ్యానికి ఏకాగ్రతే కీలకం. కంటిపాప బాగా పెద్దగా అయితే ఏకాగ్రత మెరుగుపడినట్టు భావించొచ్చు. అయితే చాలామందికి పెద్దగా ఏకాగ్రత మెరుగవలేదు. కానీ అలసట తగ్గినట్టు తేలింది. టీడీసీఎస్ మెదడులోని ఆయా మార్గాలను ప్రభావితం చేయటం ద్వారా నిస్సత్తువ తగ్గటానికి తోడ్పడుతున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

# మూత్ర ఇన్‌ఫెక్షన్లకు కొత్త మందు

%మహిళలు, 12 ఏళ్లలోపు అమ్మాయిల్లో మామూలు మూత్రకోశ ఇన్‌ఫెక్షన్ల చికిత్స కోసం అమెరికాలోని ఎఫ్‌డీఏ కొత్త మందుకు అనుతించింది. ఇలాంటి సమస్యకు ఒక కొత్తరకం యాంటీబయాటిక్ మాత్రకు ఆమోదం లభించటం దాదాపు 30 ఏళ్లలో ఇదే మొదటిసారి. మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లు తరచూ కనిపిస్తుంటాయి. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువ. ఇతరత్రా సమస్యలేవీ లేకపోయినా వీటి బారినపడుతుంటారు. మహిళల్లో దాదాపు సగం మంది తమ జీవితంలో ఎప్పుడో అప్పుడు ఈ ఇన్‌ఫెక్షన్లకు గురవుతారన్నా అతిశయోక్తి కాదు. కొందరికివి మళ్లీ మళ్లీ వస్తుంటాయి. చికిత్స చేయటమూ కాస్త సవాల్‌తో కూడుకున్నదే. ఎందుకంటే బ్యాక్టీరియా మందులను తట్టుకునే సామర్థ్యం సంతరించుకుంటూ వస్తుండటం వల్ల ప్రామాణిక యాంటీబయాటిక్ మందులు అంతగా పనిచేయటం లేదు. దీంతో కొత్త చికిత్సల అవసరం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో జెపోటిడాసిన్ అనే మందుకు ఆమోదం తెలిపారు. ఇది బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడే రెండు కీలక ఎంజైమ్‌లను అడ్డుకోవటం ద్వారా పనిచేస్తుంది. రెండు ఎంజైమ్‌ల మీద దాడి చేస్తుండటం వల్ల బ్యాక్టీరియా అంత త్వరగా మందును తట్టుకునే సామర్థ్యాన్ని సంతరించుకోలేదు. కాబట్టి ప్రామాణిక యాంటీబయాటిక్ మందులకు లొంగని మూత్ర ఇన్‌ఫెక్షన్లకు జెపోటిడాసిన్ మంచి అవకాశంగా కనిపిస్తోంది. ఒక మాదిరి మూత్ర ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న 3వేలకు పైగా మహిళలు, అమ్మాయిల మీద దీన్ని పరీక్షించగా మామూలుగా వాడే యాంటీబయాటిక్ మందు కన్నా మెరుగ్గా పనిచేస్తున్నట్టు వెల్లడైంది. దుష్ప్రభావాలూ పెద్దగా కనిపించలేదు.

# శాక ప్రొటీన్

వయసు, బరువు, శారీరక శ్రమను బట్టి మనకు ప్రొటీన్ అవసరం ఆధారపడి ఉంటుంది. సాధారణంగా కిలో శరీర బరువుకు రోజుకు సుమారు ఒక గ్రాము ప్రొటీన్ కావాలి. అంటే 60 కిలోల బరువు గలవారికి రోజుకు 60 గ్రాముల ప్రొటీన్ అవసరమన్నమాట.

ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఇటీవల శాకాహారానికి ప్రాధాన్యం పెరుగుతోంది. అయితే దీంతో ప్రొటీన్ అంతగా లభించదని చాలామంది భావిస్తుంటారు. నిజానికి శాకాహారంలోనూ మంచి ప్రొటీన్ అందించే పదార్థాలు చాలానే ఉన్నాయి.

గింజపప్పులు (నట్స్): వీటిల్లో ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు నాణ్యమైన ప్రొటీన్ కూడా లభిస్తుంది. ఉదాహరణకు- 100 గ్రాముల బాదంతో 21 గ్రాముల ప్రొటీన్ అందుతుంది. అదే పిస్తాల్లో 20 గ్రాములు, జీడిపప్పులో 18 గ్రాములు, అక్రోట్లలో 15 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. మనకు విరివిగా అందుబాటులో ఉండే వేరుశనగలో ప్రతి వంద గ్రాములకు 25 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది. సాంకేతికంగా ఇది పప్పుల జాతికి చెందినదే అయినా చాలామంది నట్స్‌గానే భావిస్తారు.

పప్పులు: మనదగ్గర బొబ్బర్లు, శనగలు, కందులు, ఉలవలు, రాజ్మా వంటి 20 రకాలకు పైగా పప్పు దినుసులున్నాయి. ఇవి మంచి ప్రొటీన్ గనులు. ఉదాహరణకు- 100 గ్రాముల శనగలతో 20 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది.

సోయా: ఇది గొప్ప ప్రొటీన్ వనరు. సోయా గింజలు, సోయా చిక్కుడులో 40% వరకు ప్రొటీన్ ఉంటుంది. సోయా పొడితో చేసే నగెట్స్, సోయా పాలతో చేసే టోఫు సైతం మంచి ప్రొటీన్ కలిగుంటాయి. సోయా నగెట్స్ చవక కూడా.

కూరగాయలు: ప్రొటీన్ విషయంలో కొన్నిరకాల కూరగాయలూ మంచివే. ప్రతి 100 గ్రాముల బ్రోకలీలో సుమారు 3 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఉడికిస్తే దీని మోతాదు మరింత పెరుగుతుంది. పుట్టగొడుగులతో సుమారు 4 గ్రాములు, పచ్చి బటానీలతో 5 గ్రాములు, పాలకూరతో 3 గ్రాములు లభిస్తుంది.

నిండు గింజ ధాన్యాలు: తవుడుతో కూడిన నిండు గింజ ధాన్యాలూ మేలే. ప్రతి 100 గ్రాముల దంపుడు బియ్యంలో దాదాపు 3 గ్రాములు, గోధుమలో 13 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇక క్వినోవాతో 4 గ్రాములు, ఓట్స్‌తో 13 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది.

# ఒత్తిడి, ఊబకాయంతో క్లోమ క్యాన్సర్ ముప్పు

%క్లోమ (పాంక్రియాస్) క్యాన్సర్ బారినపడకూడదని అనుకుంటున్నారా? అయితే జీవనశైలి మీద శ్రద్ధ వహించండి. అనారోగ్యకర ఆహారం, దీర్ఘకాల మానసిక ఒత్తిడి రెండూ కలిసి పాంక్రియాస్ క్యాన్సర్ త్వరగా ముంచుకురావటానికి దోహదం చేస్తున్నట్టు యూసీఎల్ఏ తాజా అధ్యయనం సూచిస్తోంది మరి. ఒత్తిడి, ఊబకాయం మూలంగా క్లోమ కణాల్లో తలెత్తే మార్పులు క్యాన్సర్‌కు దారితీస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఒత్తిడితో ముడిపడిన నాడీ సమాచార వాహకాలు, ఊబకాయానికి సంబంధించిన హార్మోన్లు సీఆర్ఈబీ అనే ప్రోటీన్‌ను ప్రేరేపిస్తున్నట్టు కనుగొన్నారు. ఈ ప్రొటీన్ క్యాన్సర్ వృద్ధి కావటంతో ముడిపడి ఉండటం గమనార్హం. ఒత్తిడి హార్మోన్లు బీటా అడ్రినర్జిక్ రిసెప్టర్/పీకేఏ మార్గాన్ని ఉత్తేజితం చేస్తాయి. ఊబకాయ సంబంధ సంకేతాలేమో ప్రధానంగా పీకేడీ మార్గాన్ని ఉపయోగించుకుంటాయి. ఒత్తిడి, ఊబకాయం రెండూ ఇలా ఒకేరకం యంత్రాంగాల ద్వారా క్లోమ క్యాన్సర్ వృద్ధిని ప్రోత్సహిస్తున్నట్టు ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. అధిక కొవ్వు ఆహారం ఒక్కటే క్లోమ కణితుల వృద్ధికి దారితీస్తున్నట్టు ఎలుకలపై నిర్వహించిన ప్రయోగాల్లో గుర్తించారు. అయితే ఎలుకలను ఒంటరిగా ఉంచినప్పుడు తలెత్తిన ఒత్తిడితో మరింత తీవ్రమైన కణితులు ఏర్పడటం గమనార్హం.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy